RNI NO. APBIL/2013/50718
LOCAL GUIDE Bi-Lingual Daily Published From Rangareddy

లోకల్ గైడ్

ద్విభాషా దినపత్రిక

ఎడిటర్: చిలకమర్రి రంగారెడ్డి

www.localguidenews.com

LGTV

లోకల్ గైడ్ తెలంగాణ www.localguidenews.com

విలేకరులు కావలెను

సరికొత్త హంగులతో నూతన ఒరవడితో వెలువడుతున్న లోకల్ గైడ్ జాతీయ తెలుగు దినపత్రికలో పని చేయుటకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో జిల్లా ఇన్చార్జీలు, స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గాల ఆర్సీలు,మరియుమండలాల వారిగా రిపోర్టర్లు కావలెను. ADVERTISEMENT మేనేజర్లు కావలెను అనుభవము ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును సంప్రదించండి

8977761499/9110308094

ప్రచురణ :, తెలంగాణ | సంపుటి 13, | సంచిక ,276 | పేజీలు -12 | శనివారం - 31 - అక్టోంబర్ - 2026 | వెల రూ.2/-

బ్యాంకులను కాంగ్రెస్ సొంత సంస్థల్లా వాడుకుంది

- ఐడీబీఐ వాటాల విక్రయాన్ని సమర్థించిన నిర్మలా సీతారామన్
- కాంగ్రెస్ హయాంలో రాజకీయ ఒత్తిళ్లు ఉన్నాయని ఆరోపణ
- మొండి బకాయిలపై గత ప్రభుత్వాలను విమర్శించిన మంత్రి

ఐడీబీఐ బ్యాంకులో మెజారిటీ వాటా విక్రయించాలన్న

మిగతా 2లో

నవంబర్ 1 ర్యాలీ వాయిదా వేయండి.. సోనియా గాంధీకి ఢిల్లీ వ్యాపారుల విజ్ఞప్తి

- దీపావళి సీజన్‌లో రూ.12,000 కోట్ల వ్యాపారంపై ప్రభావం పడుతుందని ఆందోళన
- ర్యాలీ వల్ల ట్రాఫిక్, సరుకు రవాణా స్తంభించిపోతాయని లేఖలో వెల్లడి
- వాయిదా కుదరకపోతే రాంలీలా మైదానం బదులు బురారీకి మార్చాలని సూచన

కాంగ్రెస్ పార్టీ నవంబర్ 1న రాంలీలా మైదానంలో తలపెట్టిన భారీ ర్యాలీని వాయిదా వేయాలని ఢిల్లీ వ్యాపారులు, పారిశ్రామికవేత్తల సంఘం (సీటీఐ) కోరింది. దీపావళి పండుగ సీజన్‌లో ఈ ర్యాలీ వల్ల తమ వ్యాపారాలు తీవ్రంగా దెబ్బతింటాయని, రూ.10,000 కోట్ల నుంచి రూ.12,000 కోట్ల వరకు మిగతా 2లో

సీఎం పర్యవేక్షణతో పెను నష్టం తప్పింది

- రైతుల ఖాతాల్లోకి రూ.3,125 కోట్లు.. రెండో విడత నిధుల విడుదల!
- అర్నబ్ తుపాను నష్టంపై అమలాపురంలో మంత్రి అచ్చెన్నాయుడు సమీక్ష
- జిల్లాలోని మున్సిపాలిటీల్లో ఈ రాత్రికే 100 శాతం విద్యుత్ పునరుద్ధరించాలని లక్ష్యం
- తుపానుకు సుమారు 8 వేల విద్యుత్ స్తంభాలు, 36 సబ్‌స్టేషన్లు ధ్వంసం

అర్నబ్ తుపాను కారణంగా దెబ్బతిన్న విద్యుత్ వ్యవస్థను చక్కదిద్దే పనులను ప్రభుత్వం ముమ్మరం చేసింది. మున్సిపాలిటీల పరిధిలో ఈ రాత్రిలోగా 100 శాతం విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలని లక్ష్యంగా నిర్దేశించినట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి, కోనసీమ జిల్లా ఇన్‌చార్జి మంత్రి మిగతా 2లో

రూ.50వేల కోట్ల విలువైన భూములు కాజేసే కుట్ర

రూ.1.50 లక్షల కోట్ల ప్రభుత్వ భూములను కాపాడాం

- మియాపూర్‌లో 550 ఎకరాలపై సుప్రీంకోర్టు తీర్పు
- భూముల విలువ రూ.50 వేల కోట్లు అని సీఎం వెల్లడి
- రూ.1.50 లక్షల కోట్ల ప్రభుత్వ భూములు కాపాడినట్లు ప్రకటన
- కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావుపై భూ ఆక్రమణ ఆరోపణలు
- భూముల విక్రయ నిధులతో అభివృద్ధి పనుల ప్రతిపాదన
- తెలంగాణ రైజింగ్‌లో భాగస్వాములు కండి.. సీఎం రేవంత్
- మియాపూర్ భూముల విషయంలో తెలంగాణ ప్రభుత్వానికి అనుకూలంగా సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు.
- రూ.50వేల కోట్ల విలువైన భూములు కాజేయాలని చూశారని ఆరోపించారు.
- మియాపూర్ భూముల వివాదాన్ని గత ప్రభుత్వం పట్టించుకోలేదని విమర్శించారు.
- కేసీఆర్, ఆయన అనుచరులు కలిసి భూములు కొల్లగొట్టే ప్రయత్నం చేశారన్నారు. మియాపూర్‌లో 550 ఎకరాల ప్రభుత్వ భూమిని కొందరు ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించాలని చూశారని ఆరోపణలు గుప్పించారు.

మియాపూర్ భూముల విషయంలో తెలంగాణ ప్రభుత్వానికి అనుకూలంగా సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. శుక్రవారం) మీడియాతో మాట్లాడుతూ.. రూ.50వేల కోట్ల విలువైన భూములు కాజేయాలని చూశారని ఆరోపించారు. మియాపూర్ భూముల వివాదాన్ని గత ప్రభుత్వం పట్టించుకోలేదని విమర్శించారు. కేసీఆర్, ఆయన అనుచరులు కలిసి భూములు కొల్లగొట్టే ప్రయత్నం చేశారన్నారు. మియాపూర్‌లో 550 ఎకరాల ప్రభుత్వ భూమిని కొందరు ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించాలని చూశారని ఆరోపణలు గుప్పించారు. సుప్రీంలో బలమైన వాదనలు వినిపించి భూములను కాపాడామన్నారు. సుప్రీం తీర్పు రాగానే మిగతా 2లో

మూసీ ప్రక్షాళనకు మేము వ్యతిరేకం కాదు

- గాంధీ సరోవరం పేరిట పేదల ఇళ్లు కూల్చడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్న రాంచందర్ రావు
- కాంగ్రెస్ పార్టీ తమపై తప్పుడు ప్రచారం చేస్తోందని ఆరోపణ
- విపక్షాల 'మాక్ పార్లమెంట్' ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమేనని విమర్శ

మూసీ నది ప్రక్షాళన ప్రాజెక్టును బీజేపీ అడ్డుకుంటోందని కాంగ్రెస్ పార్టీ తప్పుడు ప్రచారం చేస్తోందని తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రాంచందర్ రావు మండిపడ్డారు. మూసీ ప్రక్షాళనను తమ పార్టీ వ్యతిరేకించడం లేదని, అయితే 'గాంధీ సరోవరం' పేరిట పేదల ఇళ్లను కూల్చివేయడాన్ని మాత్రం తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని ఆయన స్పష్టం చేశారు.నాంపల్లిలోని మిగతా 2లో

ఆక్వా ఏరియేటర్లకు ఒక గంట పవర్ లేకపోతేనే కష్టం..

అలాంటిది రోజుల తరబడి కరెంట్ బంద్

రైతులను ఆదుకోని కూటమి ప్రభుత్వం

- రైతులను ఆదుకోకుండా బాబు సమీక్షల డ్రామా
- వీడియో కాన్ఫరెన్సులో మాట్లాడుతున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి
- సీఎం చంద్రబాబుపై వైఎస్ జగన్ మండిపాటు
- తుపాను ప్రభావిత జిల్లాల పార్టీ అధ్యక్షులతో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్
- రైతులకు వాటిల్లిన నష్టంపై ఆరా
- అండగా నిలవాలని పార్టీ నేతలు, నాయకులు, శ్రేణులకు దిశా నిర్దేశం

అర్నబ్ తుపాను వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయినా వారిని ఆదుకోవడంలో చంద్రబాబు సర్కార్ తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్వజమెత్తారు. ఆర్టీజీఎస్‌లో సమీక్షల పేరుతో డ్రామా చేస్తున్న సీఎం చంద్రబాబు అబద్ధాలు ప్రచారం చేస్తూ కేవలం ఆర్భాటానికే పరిమితం అవుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మిగతా 2లో

ప్రజల గొంతు నొక్కడం పబ్లిక్ హియరింగా?

- మూసీ సుందరీకరణ ముసుగులో రూ.లక్షన్నర కోట్ల లూటీకి కుట్ర: కేటీఆర్
- సాగు, తాగునీటికి దిక్కులేదు.. మూసీకి 10 టీఎంసీలు తెస్తారా?
- డీపీఆర్ లేని సుందరీకరణ ప్రాజెక్టుపై న్యాయ పోరాటం చేస్తాం
- గ్లోబల్ సమ్మిట్ కాదు.. గోబెల్స్ సమ్మిట్

రాష్ట్రంలో కరువు లేదంటూనే మూసీ సుందరీకరణ పేరిట రేవంత్ ప్రభుత్వం మిగతా 2లో

పక్షవాత బాధితులకు ఉచిత వైద్యం

- పక్షవాత బాధితులకు ఉచిత వైద్య సేవలు అందిస్తున్నామని ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ తెలిపారు
- ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్టు ద్వారా నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో ఉచిత వైద్యసేవలు కొనసాగిస్తూనే, ప్రభుత్వ ఆస్పత్రుల్లోనూ పక్షవాతం బాధితులకు చికిత్సను క్రమంగా అందుబాటులోకి తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నామన్నారు.

పక్షవాత బాధితులకు ఉచిత వైద్య సేవలు అందిస్తున్నామని ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ తెలిపారు. ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్టు ద్వారా నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో ఉచిత వైద్యసేవలు మిగతా 2లో

చంద్రబాబూ.. నీ తప్పులు చాలా దూరం వెళ్తాయి!

- మీరు ఏం చేశారని ప్రజలు ఓట్లు వేస్తారంటూ చంద్రబాబు సర్కార్‌ను వైఎస్సార్‌సీపీ ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి నిలదీశారు.
- హౌసింగ్ కాలనీల్లో ఒక్క రూపాయి పనులైనా చేశారా?. పులివెందులకు మెడికల్ కాలేజీ వస్తే మీరే వద్దన్నారు.

మీరు ఏం చేశారని ప్రజలు ఓట్లు వేస్తారంటూ చంద్రబాబు సర్కార్‌ను వైఎస్సార్‌సీపీ ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి నిలదీశారు. శుక్రవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. మిగతా 2లో

RNI NO. APBIL/2013/50718 LOCAL GUIDE Bi-Lingual Daily Published From Rangareddy
లోకల్ గైడ్
ఎడిటర్: చిలకమర్రి రంగారెడ్డి ద్విభాషా దినపత్రిక
www.localguidenews.com

బ్యాంకులను కాంగ్రెస్ సొంత సంస్థల్లా వాడుకుంది

కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సమర్థించారు. ఈ విక్రయంపై కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చేసిన విమర్శలకు ఆమె స్పందించారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు బ్యాంకులపై రాజకీయ ఒత్తిళ్లు తెచ్చి, నిబంధనలకు విరుద్ధంగా రుణాలు ఇప్పించాయని ఆరోపించారు. వాటి ఫలితంగానే ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో భారీగా మొండి బకాయిలు పేరుకుపోయాయని విమర్శించారు.బ్యాంకులు, ఆర్థిక సంస్థలను కాంగ్రెస్ నేతలు తమ సొంత సంస్థల్లా వాడుకున్నారని నిర్మలా సీతారామన్ ఎక్స్‌లో పేర్కొన్నారు. తమకు నచ్చిన సంస్థలకు రుణాలు ఇవ్వాలని బ్యాంకు ఉద్యోగులపై ఒత్తిడి తెచ్చారని ఆరోపించారు. 1976లో ఇందిరా గాంధీ ప్రభుత్వం.. సంజయ్ గాంధీ వర్గానికి సంబంధమున్న సంస్థకు రుణాల విషయంలో రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గని ఎస్‌బీఐ చైర్మన్ ఆర్.కె. తల్వార్‌ను పదవి నుంచి తొలగించిందని గుర్తుచేశారు. మారుతి సంస్థకు రుణాల విషయంలోనూ 'సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా'పై సంజయ్ గాంధీ ఒత్తిడి తెచ్చారని ఆమె ఆరోపించారు.ఐడీబీఐ బ్యాంక్ గతంలో తీవ్ర సమస్యల్లో కూరుకుపోయిందని ఆర్థిక మంత్రి పేర్కొన్నారు. వీడియోకాన్, విన్‌సమ్, ఏబీజీ షిప్‌యార్డ్, కింగ్‌ఫిషర్ వంటి పెద్ద సంస్థలకు ఇచ్చిన రుణాలు మొండి బకాయిలుగా మారి బ్యాంకుకు భారీ నష్టాలు తెచ్చాయని తెలిపారు. ఈ సంస్థలకు కాంగ్రెస్ నేతలతో సన్నిహిత సంబంధాలు ఉన్నాయని ఆరోపించారు. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం వృత్తిపరమైన నిర్వహణ, జాగ్రత్తతో కూడిన రుణ విధానాలు, రూ.25 వేల కోట్లకు పైగా మూలధన సాయం ద్వారా బ్యాంకును తిరిగి గాడిలో పెట్టిందని చెప్పారు. ఐడీబీఐ పునర్వ్యవస్థీకరణలో అన్ని నిబంధనలను పాటించామని స్పష్టం చేశారు.2024 ఫిబ్రవరిలో కేంద్రం విడుదల చేసిన భారత ఆర్థిక వ్యవస్థపై శ్వేతపత్రంలో గత ప్రభుత్వాల హయాంలో చోటుచేసుకున్న ఆర్థిక అవకతవకల వివరాలు ఉన్నాయని నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. కాంగ్రెస్ హయాంలో.. పలుకుబడి ఉన్నవారికి ఒక రకంగా, సామాన్యులకు మరో రకంగా బ్యాంకింగ్ సేవలు అందేవని విమర్శించారు.ఈ నెల 14న ఐడీబీఐ బ్యాంకులో 60.72 శాతం వాటాను కెనడాకు చెందిన ఫెయిర్‌ఫాక్స్ ఫైనాన్షియల్ హోల్డింగ్స్‌కు సుమారు రూ.53 వేల కోట్లకు విక్రయించేందుకు కేంద్రం ఆమోదం తెలిపింది. ఇది భారత బ్యాంకింగ్ రంగంలో అతిపెద్ద విదేశీ పెట్టుబడిగా నిలవనుంది. ఈ నిర్ణయాన్ని రాహుల్ గాంధీ విమర్శిస్తూ.. కాంగ్రెస్ ప్రభుత్వాలు బ్యాంకులను ఏర్పాటు చేస్తే, మోదీ ప్రభుత్వం వాటిని విక్రయిస్తోందని వ్యాఖ్యానించారు. ఐడీబీఐ ఉద్యోగులకు అండగా ఉంటానని ఆయన తెలిపారు.

నవంబర్ 1 ర్యాలీ వాయిదా వేయండి.. సోనియా గాంధీకి ఢిల్లీ వ్యాపారుల విజ్ఞప్తి

నష్టం వాటిల్లుతుందని ఆందోళన వ్యక్తం చేసింది. ఈ మేరకు కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియా గాంధీకి శుక్రవారం లేఖ రాసింది.సీటీఐ చైర్మన్ బ్రిజేష్ గోయల్ మాట్లాడుతూ.. తాము ర్యాలీకి వ్యతిరేకం కాదని, కేవలం దాని సమయంపైనే ఆందోళన చెందుతున్నామని స్పష్టం చేశారు. "నవంబర్ 6న ధనత్రయోదశి, 8న దీపావళి ఉన్నాయి. నవంబర్ 1 వ్యాపార సన్నాహాలకు అత్యంత కీలకమైన రోజు. ఆ రోజున 10 లక్షల మంది, 15,000 నుంచి 20,000 వాహనాలు ఢిల్లీ నగరంలోకి వస్తే, 20 ప్రధాన మార్కెట్లలో వ్యాపారాలు పూర్తిగా స్తంభించిపోతాయి. పండుగ వేళ మా ఉపాధిపోతుంది కాపాడాలని వినయంగా కోరుతున్నాం" అని ఆయన అన్నారు. ఈ ర్యాలీ వల్ల ఎదురయ్యే నాలుగు ప్రధాన సమస్యలను సీటీఐ తన లేఖలో ప్రస్తావించింది. పార్కింగ్ సౌకర్యం కొరత, తీవ్రమైన ట్రాఫిక్ రద్దీ, సరుకు రవాణా అంతరాయం, హోల్‌సేల్, రిటైల్ వ్యాపారాలపై ప్రభావం వంటి అంశాలను వివరించింది. రాంలీలా మైదానంలో కనీసం 200 బస్సులకు కూడా పార్కింగ్ స్థలం లేదని, వేలాది వాహనాలను ఎక్కడ నిలుపుతారని ప్రశ్నించింది.రాంలీలా మైదానానికి 5 కిలోమీటర్ల పరిధిలోనే చాందినీ చౌక్, సదర్ బజార్, కన్నాట్ ప్లేస్, కరోల్ బాగ్, ఖరీ బావోలీ సహా 20 ప్రధాన మార్కెట్లు ఉన్నాయని సీటీఐ గుర్తుచేసింది. ఈ మార్కెట్లకు రోజుకు 5,000 ట్రక్కులు సరుకులు తీసుకురాగా, మరో 3,000 ట్రక్కులు దేశంలోని ఇతర ప్రాంతాలకు సరుకులను తరలిస్తాయని తెలిపింది. ర్యాలీ కారణంగా అక్టోబర్ 31 నుంచే రవాణా వ్యవస్థపై ప్రభావం పడే అవకాశం ఉందని వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో సీటీఐ రెండు డిమాండ్లను సోనియా గాంధీ ముందు ఉంచింది. మొదటిది, ర్యాలీని దీపావళి తర్వాత అంటే నవంబర్ 10 లేదా 11వ తేదీకి వాయిదా వేయడం. అది సాధ్యం కాకపోతే, ర్యాలీ వేదికను రాంలీలా మైదానం నుంచి బురారీ గ్రౌండ్‌కు మార్చాలని సూచించింది. బురారీలో 15,000 వాహనాలకు పార్కింగ్ సౌకర్యం ఉందని పేర్కొంది. గతంలో రాహుల్ గాంధీకి మూడుసార్లు లేఖ రాసినా స్పందన రాలేదని బ్రిజేష్ గోయల్ తెలిపారు. రాజకీయ కార్యక్రమాల కోసం పండుగ సీజన్‌లో తమ వ్యాపారాలను బలిచేయవద్దని వ్యాపారులు కోరుతున్నారు.

సీఎం పర్యవేక్షణతో పెను నష్టం తప్పింది

కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. అమలాపురంలోని విద్యుత్ శాఖ ఎస్‌ఈ కార్యాలయంలో ఆయన తుపాను నష్టంపై సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... అర్నాబ్ తుపాను తీవ్రత ఎక్కువగా ఉన్నప్పటికీ, ముఖ్యమంత్రి చంద్రబాబు ముందునుంచీ నిరంతరం పర్యవేక్షించడం వల్ల ప్రాణ, ఆస్తి నష్టాన్ని నివారించగలిగామని చెప్పారు. మత్స్యకారులను సముద్రంలోకి వెళ్లకుండా ఆపడం వంటి చర్యలు సత్ఫలితాలనిచ్చాయన్నారు. అయితే, విద్యుత్ శాఖకు ఊహించని స్థాయిలో నష్టం వాటిల్లిందని, జిల్లావ్యాప్తంగా సుమారు 8,000 విద్యుత్ స్తంభాలు నేలకూలాయని, 36 సబ్‌స్టేషన్లు పూర్తిగా దెబ్బతిన్నాయని వివరించారు.పునరుద్ధరణ పనులకు అవసరమైన సిబ్బంది, సామగ్రి అందుబాటులో ఉన్నప్పటికీ, క్షేత్రస్థాయిలో పరిస్థితులు క్లిష్టంగా ఉన్నాయని తెలిపారు. గురువారం క్షేత్రస్థాయిలో పరిస్థితిని సమీక్షించిన ముఖ్యమంత్రి... తక్షణమే తెలంగాణ నుంచి 1,000 మంది సిబ్బందిని రప్పించారని చెప్పారు. అలాగే, తమిళనాడు ప్రభుత్వంతో చర్చించి అక్కడి నుంచి కూడా అదనపు సిబ్బందిని రప్పిస్తున్నట్లు మంత్రి వెల్లడించారు.అమరావతి, అక్టోబర్ 30: రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యమని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. అన్నదాత సుఖీభవ--పీఎం కిసాన్ పథకం రెండో విడత కింద నేడు రూ.3,125.47 కోట్ల ఆర్థిక సాయం విడుదలకు ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు.రాష్ట్రవ్యాప్తంగా 46,85,838 రైతు కుటుంబాలకు ఈ నిధులు అందనున్నాయని పేర్కొన్నారు. ఇందులో రాష్ట్ర ప్రభుత్వ వాటా రూ.2,342.92 కోట్లు కాగా, కేంద్ర ప్రభుత్వ వాటా రూ.782.55 కోట్లుగా ఉంది. ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు అర్హులైన ప్రతి రైతు కుటుంబానికి ఏడాదికి రూ.20 వేల చొప్పున ఆర్థిక సాయం అందిస్తున్నట్లు తెలిపారు. ఇందులో రాష్ట్ర ప్రభుత్వం రూ.14 వేలు, ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ ద్వారా రూ.6 వేలు సమకూరుస్తున్నాయని వివరించారు. అన్నదాత సుఖీభవ పథకం ద్వారా ఖరీఫ్‌లో రూ.7 వేలు, రబీలో రూ.7 వేలు, వేసవిలో రూ.6 వేల చొప్పున మూడు విడతల్లో రైతులకు సాయం అందిస్తున్నట్లు చెప్పారు.రైతులకు పెట్టుబడి సాయం అందించడంలో కూటమి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని అచ్చెన్నాయుడు తెలిపారు. 2025--26 ఆర్థిక సంవత్సరంలో రూ.8,985.41 కోట్లు, 2026--27 తొలి విడతలో రూ.3,125.47 కోట్లను రైతులకు అందించినట్లు పేర్కొన్నారు.

పక్షవాత బాధితులకు ఉచిత వైద్యం

కొనసాగిస్తూనే, ప్రభుత్వ ఆస్పత్రుల్లోనూ పక్షవాతం బాధితులకు చికిత్సను క్రమంగా అందుబాటులోకి తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నామన్నారు. గత నెలలో ప్రయోగాత్మక ప్రాజెక్టు కింద తెనాలి జిల్లా ఆస్పత్రిలో పక్షవాతం బాధితులకు హబ్ అండ్ స్పోక్ విధానంలో చికిత్స అందించే ఏర్పాట్లు చేశామన్నారు. రక్తపు గడ్డలు కరిగించే చికిత్సలో భాగంగా 9 మందికి ఖరీదైన టెనెక్టేప్లేజ్ ఇంజెక్షన్లు ఇచ్చామని, వారు కోలుకున్నారని చెప్పారు. 2026-27 ఆర్థిక సంవత్సరంలో అక్టోబరు వరకు పక్షవాత రోగుల చికిత్స కోసం రూ.22.86 కోట్లు వ్యయం చేసినట్లు ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ తెలిపిందన్నారు

చంద్రబాబూ.. నీ తప్పులు చాలా దూరం వెళ్తాయి!

హౌసింగ్ కాలనీల్లో ఒక్క రూపాయి పనులైనా చేశారా?. పులివెందులకు మెడికల్ కాలేజీ వస్తే మీరే వద్దన్నారు. ఎన్నికల్లో ఇస్తామన్న హామీలు ఏమయ్యాయి?. ఈ మూడేళ్లల్లో ఏం చేశారో చెప్పి ఓట్లు అడగగలరా?" అంటూ అవినాష్‌రెడ్డి ప్రశ్నించారు."చంద్రబాబు ఎంత బలహీనుడో రాష్ట్రం మొత్తానికి అర్థమైంది. బీటెక్ రవి ప్రచారం వింతగా, ఆశ్చర్యకరంగా ఉంది. ఏ హామీ నెరవేర్చారని టీడీపీ నేతలు ఓట్లు అడుగుతున్నారు?. వైఎస్సార్‌సీపీ కార్పొరేట్, కౌన్సిలర్ అభ్యర్థులను నామినేషన్‌లు వేయకుండా అడ్డుకున్నారు. మధ్యాహ్నం 1:30కు నామినేషన్లు వేసుకోవచ్చుని చెప్పి పోలీసులే అడ్డుకున్నారు. మున్సిపల్ ఆఫీస్ ముందు ఆగి నామినేషన్లు వేసుకోవడానికి అనుమతి అడిగాం. నామినేషన్లకు అనుమతివ్వమని పోలీసులు స్పష్టంగా చెప్పారు" అని వైఎస్ అవినాష్‌రెడ్డి పేర్కొన్నారు."ప్రచారం కూడా వైఎస్సార్‌సీపీ నేతలను ప్రశాంతంగా చేసుకోనివ్వడం లేదు. ప్రచారంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నేతల ఆస్తులపై దాడులు చేస్తున్నారు. వైఎస్సార్‌సీపీ నేతల ఆస్తులపై దాడులు చేసిన వారికి కనీసం నోటీసులు కూడా ఇవ్వలేదు. పనికి మాలిన పనుల్నీ చంద్రబాబు హయాంలో జరుగుతున్నాయి. ఇలాంటి దాడులు గతంలో ఏనాడూ జరగలేదువేలాది మందిని బయట నుంచి తీసుకొస్తున్నారు.

మూసీ ప్రక్షాళనకు మేము వ్యతిరేకం కాదు

బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఈరోజు ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రాంచందర్ రావు మాట్లాడారు. పేదల ఇళ్లకు ఎలాంటి నష్టం జరగకుండా మూసీని శుభ్రపరిచే ప్రణాళికలు ప్రభుత్వం సిద్ధం చేయాలని సూచించారు. ఉద్యోగులకు జీతాలు, పెన్షన్లు ఇవ్వడానికి నిధులు లేవని చెబుతున్న ప్రభుత్వం, మూసీ ప్రక్షాళన పేరుతో వేల కోట్లు ఖర్చు చేయడానికి సిద్ధమవ్వడం విచిత్రంగా ఉందన్నారు. ఈ ప్రాజెక్టుకు ఇంత పెద్ద మొత్తంలో నిధులు ఎక్కడి నుంచి వస్తున్నాయని ఆయన ప్రశ్నించారు.ఢిల్లీలో విపక్షాలు తలపెట్టిన 'మాక్ పార్లమెంట్'పైనా రాంచందర్ రావు తీవ్ర విమర్శలు చేశారు. కాంగ్రెస్ నేతలు ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారని మండిపడ్డారు. గతంలో యూపీఏ హయాంలో ములాయం సింగ్ యాదవ్ నాయకత్వంలో మాక్ పార్లమెంట్ నిర్వహిస్తే, దాన్ని ఎందుకు నిర్వహిస్తున్నారని సోనియా గాంధీ ప్రశ్నించిన విషయాన్ని గుర్తు చేశారు. పార్లమెంట్‌ను ప్రజాస్వామ్య దేవాలయంగా అభివర్ణించిన కాంగ్రెస్ నేత, మాజీ స్పీకర్ మీరా కుమార్ విషయాన్ని ప్రస్తావిస్తూ... ఇప్పుడు అదే కాంగ్రెస్ నేతలు రాజకీయ స్వలాభం కోసం ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని విమర్శించారు.

రూ.50వేల కోట్ల విలువైన భూములు కాజేసే కుట్ర..

భూములను స్వాధీనం చేసుకోవాలని అధికారులను ఆదేశించామని చెప్పారు. అవసరమైతే భూములను వేలం వేసి పేదల కోసం ఖర్చు చేస్తామని వెల్లడించారు.ఐఎమ్‌జీ భూముల అంశంలోనూ కోర్టుల్లో బలంగా వాదనలు వినిపించామని ముఖ్యమంత్రి అన్నారు. దీనిపై సుప్రీంకోర్టులో ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పు వచ్చిందని తెలిపారు. మంచిరేవులలోని 143 ఎకరాల ప్రభుత్వ భూమిని ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టేందుకు కేటీఆర్ ప్రయత్నించారని ఆరోపించారు. ఈ అంశంపైనా కోర్టుల్లో కొట్లాడి భూములను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఇందులో 50ఎకరాలు యంగ్ ఇండియా పోలీస్ స్కూల్‌కు కేటాయించినట్లు వివరించారు. తాము అధికారంలోకి వచ్చాక కబ్జాకోరల్లో చిక్కుకున్న ప్రభుత్వ భూములను కాపాడుతున్నామని సీఎం తెలిపారు.కంచె గచ్చిబౌలి, మామిడిపల్లి భూములను కొట్టేసేందుకు బీఆర్‌ఎస్ నాయకులు ప్రయత్నిస్తే న్యాయపోరాటంలో గెలిచామని సీఎం అన్నారు. గుర్రంగూడ అటవీ భూములను కేటీఆర్ అనుచరులు కబ్జాకు ప్రయత్నిస్తే సుప్రీం కోర్టులో పోరాడామని తెలిపారు. ప్రభుత్వం పోరాటంతో అది అటవీ భూమి అని సుప్రీం కోర్టు తెల్చి చెప్పిందని అన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 400 ఎకరాల అటవీ భూమిని బీఆర్‌ఎస్‌లోకి ఫిరాయించిన ఎమ్మెల్యేకు నజరానాగా అప్పగిస్తే సుప్రీం కోర్టులో పోరాడి రక్షించామని చెప్పుకొచ్చారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో బీఆర్‌ఎస్ నాయకుల భూ ఆక్రమణలను అడ్డుకున్నామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన 3 ఏళ్లలో రూ.1.50 లక్షల కోట్ల విలువైన భూములను రక్షించామన్నారు.వనరుల సమీకరణకు నియమించిన మంత్రివర్గం ఉపసంఘం ఈ భూముల విక్రయం ద్వారా వచ్చే నిధులతో చేపట్టే అభివృద్ధి పనులపై అధ్యయనం చేస్తుందని రేవంత్ వెల్లడించారు. హరీశ్ రావు మామ హనుమంత రావు కబ్జా పెట్టిన భూములను సర్వే చేయకుండా అధికారులను అడ్డుకుంటున్నారని.. కోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకున్నారన్నారు. భూముల ఆక్రమణపై ప్రభుత్వంపై బీఆర్‌ఎస్ నాయకులు అనేక తప్పుడు ఆరోపణలు చేశారని మండిపడ్డారు. శాసనసభలో చర్చించి చర్యలకు దిగితే తేలు కుట్టిన దొంగల్లా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. మియాపూర్ భూములపై ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పు వస్తే బీఆర్‌ఎస్ నాయకులు ఎందుకు స్పందించడం లేదని రేవంత్ ప్రశ్నించారు. కనీసం రెవెన్యూ అధికారులను ఎందుకు అభినందించడం లేదని నిలదీశారు. పద్మాలయ స్టూడియో, ల్యాంకో భూములపై ఉమ్మడి రాష్ట్రంలో కేసులు వేసిన కేసీఆర్, హరీశ్ రావు.. అధికారంలోకి వచ్చిన తర్వాత ఎందుకు వాటిని స్వాధీనం చేసుకోలేదని అడిగారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఎవరిపై కేసులు వేశారో వారితో కేసీఆర్, హరీశ్ రావు లాలూచీ పడ్డారని ఆరోపించారు.మియాపూర్ భూములపై ఇప్పటికైనా కుట్రలు మానాలని సీఎం హితవుపలికారు. మియాపూర్ భూముల విక్రయంతో వచ్చే నిధులను విద్యాభివృద్ధికి వినియోగిస్తామన్నారు. వాళ్ల భూముల ఆక్రమణలపై చర్చించేందుకు అసెంబ్లీకి రావాలని సీఎం డిమాండ్ చేశారు. రెండు గ్రామాల మధ్య వివాదాన్ని కేసీఆర్ తనకు అనుకూలంగా మలుచుకున్నారన్నారు. అక్కడి ఆక్రమణలను తేల్చి శ్రీకాంతాచారి అమరవీరుల కాలనీ నిర్మిస్తామని ప్రకటించారు. కేసీఆర్, కేటీఆర్ ఇప్పటికైనా బుద్ధి మార్చుకుని, ఆక్రమణలు చేయడం మానుకోవాలన్నారు. వాళ్ల ఆక్రమణలకు వ్యతిరేకంగా కోర్టులు తీర్పులు ఇస్తున్నాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారుమియాపూర్‌లో 550 ఎకరాల భూమిపై సుప్రీంకోర్టు తీర్పు తెలంగాణ ప్రభుత్వానికి అనుకూలంగా రావడంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఢిల్లీలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ భూముల పరిరక్షణ, గతంలో జరిగిన భూ లావాదేవీలపై మాట్లాడారు. రాష్ట్రంలో తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.1.50 లక్షల కోట్ల విలువైన ప్రభుత్వ భూములను కాపాడినట్లు తెలిపారు. మియాపూర్ భూముల విలువ సుమారు రూ.50 వేల కోట్లు ఉంటుందని పేర్కొన్నారు.మియాపూర్ భూముల వ్యవహారంలో మాజీ సీఎం కేసీఆర్, ఆయన బంధువు దామోదర్‌రావు, గోల్డ్‌స్టోన్ ప్రసాద్‌పై రేవంత్‌రెడ్డి ఆరోపణలు చేశారు. ఈ భూ లావాదేవీల్లో లగ్జరీ కార్లు లంచంగా ఇచ్చారని, నగదు రూపంలో ముడుపులు అందాయని ఆరోపించారు. తాను ఎమ్మెల్యేగా, ఎంపీగా, టీపీసీసీ అధ్యక్షుడిగా ఉన్నప్పటి నుంచే ఈ వ్యవహారంపై పోరాడుతున్నట్లు చెప్పారు. సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో మియాపూర్ భూముల పరిరక్షణకు తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించినట్లు వెల్లడించారు. ఐఎంజీ భూములు, కంచ గచ్చిబౌలి, మామిడిపల్లి, గుర్రంగూడ అటవీ భూములు, మంచిరేవులలోని 143 ఎకరాలు సహా పలు ప్రాంతాల్లో ప్రభుత్వ భూములను కాపాడినట్లు సీఎం వివరించారు.

అర్నబ్ తుపాను: చివరి బాధితుడికి సాయం అందేవరకు విశ్రమించేది లేదు

నేను విశ్రమించను" అని ఆయన స్పష్టం చేశారు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో సాధారణ పరిస్థితులను నెలకొల్పేందుకు ప్రభుత్వ యంత్రాంగం మొత్తం ఇదే సంకల్పంతో పనిచేయాలని ఆయన అధికారులకు దిశానిర్దేశం చేశారు. గత నాలుగు రోజులుగా టెలికాన్ఫరెన్స్‌లు, వీడియో కాన్ఫరెన్స్‌లు, క్షేత్ర స్థాయి పర్యటనలతో పరిస్థితిని నిరంతరం సమీక్షిస్తూ సహాయక చర్యలను స్వయంగా పర్యవేక్షిస్తున్నారు.ఇవాళ పశ్చిమ గోదావరి జిల్లా మొగల్తూరు ప్రాంతంలో రెండో రోజు క్షేత్రస్థాయి పర్యటనకు వెళ్లే ముందు కూడా ఆయన ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. విద్యుత్, రహదారులు, సమాచార వ్యవస్థల పునరుద్ధరణలో సాధించిన పురోగతిని అధికారులు ఆయనకు వివరించారు. ముఖ్యమంత్రి స్వయంగా క్షేత్రస్థాయి సిబ్బందితో మాట్లాడుతూ పనుల పురోగతిని తెలుసుకుంటుండటంతో, యంత్రాంగం మొత్తం యుద్ధప్రాతిపదికన పనిచేస్తోంది.

యుద్ధప్రాతిపదికన పునరుద్ధరణ పనులు

తుపాను కారణంగా అతలాకుతలమైన వ్యవస్థలను తిరిగి గాడిన పెట్టేందుకు వివిధ శాఖలు తీవ్రంగా కృషి చేస్తున్నాయి. ముఖ్యంగా విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు ప్రాధాన్యత ఇస్తున్నారు. ఏపీఈపీడీసీఎల్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిచిపోయిన 5,404 గ్రామాలకు గాను, శుక్రవారం ఉదయం 10 గంటల నాటికి 4,881 గ్రామాలకు (దాదాపు 90%) విద్యుత్‌ను పునరుద్ధరించారు. దెబ్బతిన్న 552 సబ్‌స్టేషన్లలో 513 (93%) తిరిగి పనిచేయడం ప్రారంభించాయి. విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, ఏలూరు జిల్లాల్లో విద్యుత్ సరఫరా పూర్తిగా పునరుద్ధరించబడింది.అయితే, తుపాను తీవ్రత ఎక్కువగా ఉన్న కోనసీమ, పశ్చిమ గోదావరి జిల్లాల్లో పనులు ఇంకా కొనసాగుతున్నాయి. కోనసీమలో 316 గ్రామాలకు గాను 87, పశ్చిమ గోదావరిలో 318 గ్రామాలకు గాను 154 గ్రామాల్లోనే విద్యుత్ సరఫరా అందుబాటులోకి వచ్చింది. ఈ రెండు జిల్లాల్లోనే ఇంకా 393 గ్రామాలకు విద్యుత్ అందించాల్సి ఉంది. కృష్ణా జిల్లాలో ఏపీసీపీడీసీఎల్ పరిధిలో ప్రభావితమైన 915 గ్రామాల్లో 867 గ్రామాలకు సరఫరాను పునరుద్ధరించారు. మరోవైపు, దెబ్బతిన్న 1,045 మొబైల్ టవర్లలో 661 పనిచేయడం ప్రారంభించాయి. ఆర్అండ్‌బీ రహదారులపై కూలిన 2,270 చెట్లను తొలగించి, 137 చోట్ల నిలిచిపోయిన రాకపోకలను 119 చోట్ల పునరుద్ధరించారు.

భారీ నష్టం.. మరోవైపు జల సమృద్ధి

తుపాను కారణంగా రాష్ట్రవ్యాప్తంగా వ్యవసాయ, ఉద్యాన రంగాలు తీవ్రంగా నష్టపోయాయి. ప్రాథమిక అంచనాల ప్రకారం, 16 జిల్లాల్లో 3,52,254 హెక్టార్లలో వ్యవసాయ పంటలు, 23,211 హెక్టార్లలో ఉద్యాన పంటలు నీట మునిగాయి. ఈ నష్టంపై వాస్తవ పరిస్థితులను అంచనా వేసేందుకు కేంద్ర బృందాలు త్వరలో రాష్ట్రంలో పర్యటించనున్నాయి. వారికి క్షేత్రస్థాయిలో జరిగిన నష్టాన్ని వివరించి, గరిష్ఠంగా కేంద్ర సహాయం పొందేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది.ఒకవైపు ఇంత నష్టం జరిగినప్పటికీ, కురిసిన భారీ వర్షాలు రాష్ట్ర జల వనరులకు ఊహించని మేలు చేశాయి. అక్టోబర్ 26 నుంచి 29 వరకు కురిసిన వర్షాల వల్ల రాష్ట్రానికి సుమారు 380 టీఎంసీల నీరు లభించినట్లు అధికారులు అంచనా వేశారు. సమర్థ నీటి నిర్వహణ ద్వారా రాష్ట్రంలోని రిజర్వాయర్లలో అదనంగా 4.68 టీఎంసీల నీటిని నిల్వ చేయగా, మరో 5-6 టీఎంసీలు చేరే అవకాశం ఉంది. చిన్న నీటిపారుదల చెరువుల్లోకి 22 టీఎంసీల నీరు చేరగా, భూగర్భ జలాలు 44 టీఎంసీల మేర పెరిగాయి. రాబోయే ఐదు రోజుల్లో గొట్టా బ్యారేజీకి 16.24 టీఎంసీలు, మద్దువలసకు 12.01 టీఎంసీల వరద నీరు వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.ఆర్నబ్ తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో నష్టపోయిన రైతులను అన్నిరకాలుగా ఆదుకుంటామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు (ఌూా జవీ జష్ఞుఅంతీఖుఎబ చీుఅంబ) భరోసా కల్పించారు. నర్సాపురం మండలంలో నీట మునిగిన పొలాలను సందర్శించి, బాధిత రైతులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. రైతన్నలు అధైర్యపడవద్దని పేర్కొన్నారు. తుఫాన్ నష్ట తీవ్రతను అంచనా వేసేందుకు కేంద్ర ప్రభుత్వం నుంచి ఓ బృందం కూడా ఏపీలో పర్యటిస్తుందని వివరించారు.తుఫాన్ ప్రభావిత ప్రాంతాల పర్యటనలో భాగంగా ఈ రోజు (శుక్రవారం) నర్సాపురం, మొగల్తూరుల్లో ఏరియల్ సర్వే ద్వారా దెబ్బతిన్న పంటపొలాలను ముఖ్యమంత్రి పరిశీలించారు. మొగల్తూరు, నర్సాపురం మండలాల్లో పర్యటించి, క్షేత్రస్థాయిలో ప్రభావిత ప్రాంతాల పరిస్థితిని అధ్యయనం చేశారు.

తక్షణమే తాగునీటి సమస్యను పరిష్కరిస్తా: సీఎం

పశ్చిమగోదావరి జిల్లాలోని నర్సాపురం - పాలకొల్లు రోడ్డులోని కొత్త కాలనీ వద్ద ముఖ్యమంత్రి చంద్రబాబు కాన్వాయ్ వెళ్తుండగా ఖాళీ బిందెలతో మహిళలు నిల్చోని ఉన్నారు. మహిళలను చూసి సీఎం కారు దిగి సమస్యను అడిగి తెలుసుకున్నారు. తమ కాలనీలో సమస్యలను పరిష్కరించాలని విన్నవించారు. తమ కాలనీ ఏర్పాటుచేసి 25 ఏళ్లు గడిచిందని.. నేటికీ నీళ్లు లేవని మహిళలు తెలిపారు. తక్షణమే తాగునీటి సమస్యను పరిష్కరిస్తానని సీఎం చంద్రబాబు హామీ ఇచ్చారు.పవన్ కల్యాణ్ కలిసి ఎన్నడూ చేయనంత కసరత్తు చేశామని తెలిపారు. సార్వత్రిక ఎన్నికల్లో కూడా ఇంతగా శ్రమించలేదని, ఎంపీటీసీ స్థాయి వరకు అభ్యర్థుల ఎంపికపై దృష్టి సారించామని వివరించారు.ఈ సందర్భంగా ప్రత్యర్థి పార్టీపై ఆయన తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. "మా ప్రభుత్వ సహనాన్ని, సంయమ నాన్ని గొడ్డలి పార్టీ దుర్వినియోగం చేస్తోంది. వాళ్లు సొంత కుటుంబంలోనే సంక్షోభాన్ని సృష్టించుకు న్నారు. ఆస్తుల కోసం సొంత చెల్లెల్ని, తల్లిని మోసం చేస్తున్నారు. వారి ఆలోచన ప్యాలెస్ కోసం అయితే, మా ఆలోచన, తపన పేద ప్రజల కోసం" అని చంద్రబాబు వ్యాఖ్యానించారు. నేరాలు, ఘోరాలు చేసే పార్టీ సృష్టించే అడ్డంకులను దాటుకుని ముందుకు వెళతామని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

ఆక్వా ఏరియేటర్లకు ఒక గంట పవర్ లేకపోతేనే కష్టం.. అలాంటిది రోజుల తరబడి కరెంట్ బంద్

ఆర్‌టీజీఎస్‌లోని సీసీ కెమెరాల ఫుటేజ్‌తో పంట నష్టం అంచనా ఎలా సాధ్యం? అని చంద్రబాబును వైఎస్ జగన్ నిలదీశారు. అర్నబ్ తుపాను ప్రభావిత జిల్లాల పార్టీ అధ్యక్షులతో గురువారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆయా జిల్లాల్లో తుపాను ప్రభావం, రైతులకు కలిగిన నష్టం... ప్రజలు, రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వ నిర్లక్ష్యం వివరాలు తెలుసుకున్న వైఎస్ జగన్.... పార్టీ పరంగా చేపట్టాల్సిన, చేయాల్సిన వాటిపై నాయకులకు, శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజలు, రైతులకు తోడుగా, అండగా నిలబడాలని, వారితో ఉన్నామన్న భరోసా కల్పించాలని సూచించారు. తడిసిన, రంగు మారిన ధాన్యం కొనుగోళ్లు జరిగేలా చూడాలని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలకు వైఎస్ జగన్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వైఎస్ జగన్ ఏమన్నారంటే.. అర్నబ్ తుపాను ఇంకా పూర్తిగా తగ్గలేదు. ఎక్కడా నష్టం అంచనా జరగలేదు. ఎక్కడా పూర్తిగా సహాయ కార్యక్రమాలు లేవు. విద్యుత్ సరఫరా కూడా పునరుద్ధరణ కాలేదు. వలంటీర్లు లేకపోవడం వల్ల గ్రామాల్లో పరిస్థితి దారుణంగా మారింది. ఆర్బీకేలు నిర్వీర్యం. ఉచిత పంటల బీమా లేదు. దీంతో వ్యవస్థలన్నీ దిగజారిపోయాయి. ఇంత జరుగుతున్నా చంద్రబాబు ఏమంటున్నారు..? సీసీ కెమెరాల ద్వారా పంట నష్టం అంచనా చేస్తున్నారంట! ఇక్కడ ఆర్టీజీఎస్‌లో కూర్చుని మానిటర్ చేస్తే సరిపోతుందా? మరోవైపు పంట నష్టాలపై ఇష్టానుసారం లెక్కలు చెబుతున్నారు. ఒకసారి వరి 1.70 లక్షల ఎకరాల్లోనూ, ఉద్యాన పంటలు 24 వేల ఎకరాల్లోనూ నష్టపోయాయని చెబుతారు. మళ్లీ సాయంత్రానికి ఆ లెక్కలన్నీ మారిపోతున్నాయి. ఎక్కడా సీరియస్‌నెస్ లేదు. ప్రాథమిక సమాచారం ప్రకారం దాదాపు 12 లక్షల ఎకరాల్లో పంటలకు తీవ్ర నష్టం జరిగింది. కోనసీమ, ఉభయ గోదావరి, అనకాపల్లి జిల్లాల్లో వరి పంట నష్టం చాలా ఎక్కువగా ఉంది. వరి ఇప్పుడు పొట్టకొచ్చింది. తుపాను వల్ల పంటలు మునిగిపోగా రైతులకు చాలా నష్టం కలుగుతోంది. ఉచిత పంటల బీమా లేక నష్టం మరింత ఎక్కువైంది. ఇంకా కొబ్బరి, అరటి.. ఆక్వాకు చాలా నష్టం కలిగింది. ఏరియేటర్లు నడవక ఆక్వా పంట దెబ్బ తింది. ఇవన్నీ కళ్లెదుటే కనిపిస్తున్నా నష్టం పెద్దగా జరగలేదని ప్రచారం చేస్తున్నారు. అసలు పట్టించుకోవడం లేదు. వరి పంటలో ఎకరాకు రూ.40 వేలు, అరటిపై ఎకరాకు రూ.2 లక్షలు, ఆక్వాలో ఎకరాకు దాదాపు రూ.45 లక్షల వరకు రైతులు నష్టపోతున్నా ప్రభుత్వం చాలా తక్కువగా చూపే ప్రయత్నం చేస్తోంది. గతేడాది మొంథా తుపాను వల్ల కలిగిన నష్టానికి సంబంధించి దాదాపు రూ.600 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీ ఇప్పటికీ ఇవ్వలేదు. సున్నా వడ్డీ పంట రుణాలు లేవు. ఉచిత పంటల బీమా లేదు. మొన్నటిదాకా కరువు... ఇప్పుడు తుపాను. రెండింటి వల్ల రైతులకు చాలా నష్టం కలిగింది. తీవ్ర ప్రతికూల పరిస్థితుల్లో బలవన్మరణాలకు పాల్పడిన రైతుల కుటుంబాలకు ఈ కూటమి ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి అంటే 2024 జూన్ నుంచి ఒక్క రూపాయి సాయం చేయలేదు. నాడు మన ప్రభుత్వ హయాంలో ఏదైనా సీజన్‌లో పంట నష్టం జరిగితే, ఆ తర్వాత పంటకు ఉచిత విత్తనాలు ఇచ్చాం. ఇప్పుడు అది లేదు. అన్నదాతా సుఖీభవతో మూడేళ్లలో రూ.60 వేలు ఇస్తామని చెప్పి కేవలం రూ.19 వేలు ఇచ్చి, రూ.41 వేలు బకాయి పడ్డారు. ఆర్బీకేలతో పాటు ఈ--క్రాప్ నిర్వీర్యం చేశారు. మరోవైపు కేజీ బియ్యం రూ.80 నుంచి రూ.90 వరకు ఉంది. మొత్తం సిండికేట్‌గా మారి బియ్యం ఎగుమతి చేస్తున్నారు. సీజ్ ది షిప్ అన్నారు...సీజ్ లేదు. షిప్ లేదు. నాదెండ్ల మనోహర్. చినబాబుకు కమీషన్లు! వ్యాపారం చేసేది పయ్యావుల కేశవ్ తదితరులు. కృష్ణా, గోదావరి డెల్టాలో పండించిన పంటలు చేతికి రాక ఇంకా నష్టం జరుగుతోంది.

మత్స్యకారుల సమస్యలకు శాశ్వత పరిష్కారాలు అన్వేషించాలి

ఈరోజు (శుక్రవారం) కాకినాడ జిల్లాపై ఆర్నబ్ తుఫాన్ ప్రభావం, సహాయక చర్యలపై జిల్లా యంత్రాంగంతో, తీర ప్రాంత గ్రామాల ప్రజలతో వర్చువల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు డిప్యూటీ సీఎం కీలక అంశాలపై దిశానిర్దేశం చేశారు.వేట పడవలకు బీమా సౌకర్యం కల్పించే అంశంపై ప్రతిపాదనలు సిద్ధం చేయాలని పవన్ కల్యాణ్ సూచించారు. దీపావళి తర్వాత మత్స్యకార గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పర్యటిస్తానని స్పష్టం చేశారు. ఉప్పాడ తీర ప్రాంత రక్షణ గోడ పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. మత్స్యకారుల సమస్యలపై స్వయంగా తాను అధ్యయనం చేస్తానని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.'అర్నబ్' తుపాను కారణంగా కాకినాడ జిల్లాలో జరిగిన నష్టంపై ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఈరోజు సమీక్ష నిర్వహించారు. తీరప్రాంత మత్స్యకారులు ఎదుర్కొంటున్న సమస్యలకు శాశ్వత పరిష్కారాలు కనుగొనాలని అధికారులను ఆదేశించారు. అమరావతి నుంచి వర్చువల్ విధానంలో జరిగిన ఈ సమావేశంలో ఆయన కాకినాడ జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్, ఇతర అధికారులు, మత్స్యకారులు, రైతులతో మాట్లాడారు. తుపాను ప్రభావం, సహాయక చర్యలపై కలెక్టర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. మత్స్యకారుల బోట్లకు బీమా సౌకర్యం కల్పించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. దీపావళి తర్వాత తాను స్వయంగా మత్స్యకార గ్రామాల్లో పర్యటించి, వారి సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకుంటానని ప్రకటించారు. ఉప్పాడ తీర ప్రాంత రక్షణ గోడ డిజైన్, డీపీఆర్ పనులను వేగవంతం చేసి, నిర్మాణం వెంటనే ప్రారంభించాలని ఆదేశించారు. తుపాను ధాటికి తీవ్రంగా దెబ్బతిన్న ఉప్పాడ-కాకినాడ బీచ్ రోడ్డును తక్షణమే పునరుద్ధరించాలని స్పష్టం చేశారు.ఇళ్లు, పంటలు, పడవలు, వలలకు జరిగిన నష్టాన్ని వేగంగా అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిక సమర్పించాలని, తద్వారా బాధితులకు పరిహారం ఆలస్యం కాకుండా అందించాలని పవన్ ఆదేశించారు. వరద బాధితులకు 25 కిలోల బియ్యం, మత్స్యకారులు, చేనేత కార్మికులకు 50 కిలోల బియ్యంతో పాటు నిత్యావసరాలు అందించాలని సూచించారు. సకాలంలో స్పందించి 92 తీరప్రాంత ఆవాసాల నుంచి 10,000 మందికి పైగా ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడంపై జిల్లా యంత్రాంగాన్ని ఆయన అభినందించారు. లని అన్నారు. వచ్చే ఎన్నికల్లో కూటమి ప్రభుత్వాన్ని తుడిచిపెట్టేస్తామని ధీమా వ్యక్తం చేశారు."మా టైమ్ వచ్చినప్పుడు, చట్టాన్ని అతిక్రమించి అన్యాయం చేసిన ఏ అధికారినీ వదిలిపెట్టే ప్రసక్తే లేదు. వారు సర్వీసులో ఉన్నా, ఒకవేళ రిటైర్ అయిపోయినా సరే.. ఎక్కడున్నా తీసుకొచ్చి చట్టం ముందు నిలబెట్టి చర్యలు తీసుకుంటాం. వడ్డీతో సహా చెల్లించేలా చేస్తాం" అని తీవ్రంగా హెచ్చరించారు. పులివెందులలో తమ కార్యకర్తలపై చేయి వేస్తే, తనపై చేయి వేసినట్లేనని ఆయన స్పష్టం చేశారు. "మన హక్కులు మనమే కాపాడుకోవాలి. తిరగబడండి" అని పిలుపునిచ్చారు.స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియలో అధికార కూటమి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోందని జగన్ తీవ్ర ఆరోపణలు చేశారు. "ఎన్నికల్లో 50 శాతం సీట్లలో పోటీ చేస్తున్నది మా అక్కచెల్లెమ్మలే. వారి నామినేషన్లను నడిరోడ్డుపై అడ్డుకుంటున్నారు. అక్కచెల్లెమ్మల చీరలు చించి దాడులు చేశారు. ఇలా చేయడానికి మీకు సిగ్గుందా? వైసీపీ హయాంలోనే మహిళలకు నిజమైన న్యాయం జరిగింది. ఇప్పుడు చంద్రబాబు చేస్తున్న పనులకు ఆయనే సిగ్గుతో తలదించుకోవాలి" అని మండిపడ్డారు. నామినేషన్ల ప్రక్రియలో అడుగడుగునా అక్రమాలు జరిగాయని జగన్ ఆరోపించారు.

ప్రజల గొంతు నొక్కడం పబ్లిక్ హియరింగా?

వేలాది ఎకరాల భూమిని లూటీ చేసేందుకు ప్రయత్నిస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. ప్రజల గొంతు నొక్కుతూ సవివర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) లేకుండా 'పబ్లిక్ హియరింగ్' తంతును ముగించే ప్రయత్నాలు జరుగు తున్నాయని మండిపడ్డారు. ఓ వైపు కరువుతో అల్లాడుతుంటే రూ.లక్షన్నర కోట్లతో మూసీ సుందరీకరణ ప్రాజెక్టుకు టెండర్లు పిలవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఓ వైపు పశుగ్రా సానికి కూడా కొరత ఉంటే మరోవైపు మల్లన్న సాగర్ నుంచి 10 టీఎంసీల నీటిని తెచ్చి మూసీలో పోసి రేవంత్ సుంద రీకరణ పేరిట హడావుడి చేస్తున్నాడని మండిపడ్డారు.క్రాప్ హాలిడే ప్రకటించిన కాంగ్రెస్ ప్రభుత్వానికే ప్రజలు హాలిడే ఇవ్వాలని పిలుపునిచ్చారు. తెలంగాణ భవన్‌లో గురువారం జరిగిన మీడియా సమావేశంలో కేటీ ఆర్ మాట్లాడారు. 'కృష్ణా గోదావరి నదుల్లో వేయి టీఎంసీలను నిర్లక్ష్యంతో దిగువకు వదిలేసిన రేవంత్ ప్రభుత్వం 365 కరువు మండలాలను ప్రకటించింది. పొరుగున ఉన్న తమిళనాడులో 35 శాతం, కర్ణాటకలో 30 శాతం లోటు వర్షపాతం నమోదైనా కరువు లేదు.ఉపాధి హామీ పథకం ద్వారా ఉపాధి కల్పిస్తామంటూ రేవంత్ ప్రభుత్వం రైతులను కూలీలుగా మారుస్తోంది. మూసీ సుందరీకరణ ప్రాజెక్టు తెర మీదకు వచ్చింది మొదలు కుని బాధితుల పక్షాన బీఆర్ఎస్ గళమెత్తుతూ వస్తోంది. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సబిత, సుధీర్‌రెడ్డి, ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్, పార్టీ నేతలు కార్తీక్‌రెడ్డిని పబ్లిక్ హియరింగ్‌కు వెళ్లకుండా అడ్డుకోవడం దుర్మార్గం.రాష్ట్రంలో ఏం జరుగుతుందో రాహుల్‌గాంధీ తెలుసు కోవాలి' అని కేటీఆర్ పేర్కొన్నారు.

దోపిడీని అడ్డుకోవడంలో తగ్గేది లేదు

'రేవంత్ అహంకారపూరిత మనస్తత్వం వల్లే రాష్ట్రంలో నీటి ఎద్దడి ఏర్పడింది. కాంగ్రెస్ పాలనలో కరెంటు ఉండదని తేలి పోయింది. సాయంత్రం 6 గంటల తర్వాత విద్యుత్ ఇవ్వలే మంటూ ఐటీ కంపెనీలకు ఫోన్లు చేస్తున్నారు. ఎన్ని కలకు ముందు డిక్లరేషన్లు ఇచ్చిన కాంగ్రెస్ ఇప్పుడు పంటలు వేయొద్దని రైతుల నుంచి సెల్ఫ్ డిక్లరేషన్లు తీసుకుంటోంది. తాగునీరు లేక హైదరాబాద్ నుంచి వలసలు వెళ్లే పరిస్థితులు ఉన్నాయి. అధికారం చేపట్టి మూడేళ్లుగా కాంగ్రెస్ చేస్తున్న దోపిడీని అడ్డుకోవడంలో వెనక్కి తగ్గేది లేదు' అని కేటీఆర్ చెప్పారు. 'ప్రభుత్వం గ్లోబల్ సమ్మిట్ పేరిట హడావుడి చేస్తోంది.

RNI NO. APBIL/2013/50718 LOCAL GUIDE Bi-Lingual Daily Published From Rangareddy
లోకల్ గైడ్
ద్విభాషా దినపత్రిక

గెలుపే లక్ష్యంగా పట్టభద్రుల ఓటరు నమోదు, విస్తృత ప్రచారం

లోకల్ గైడ్ అక్టోబర్ 30.మహబూబాబాద్ : మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి గెలుపే లక్ష్యంగా మహబూబాబాద్ పట్టణ కేంద్రంలో పట్టభద్రుల ఓటరు నమోదు కార్యక్రమాన్ని చేపడుతూ, ఎన్నికల ప్రచారాన్ని విస్తృతంగా మహబూబాబాద్ శాసనసభ్యులు డాక్టర్ భూక్య మురళి నాయక్ . మహబూబాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ గుగులోత్ జ్యోతి రమేష్ నాయక్ నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని పలు వార్డుల్లో పర్యటిస్తూ పట్టభద్రులను కలిసి ఎమ్మెల్సీ ఎన్నికల ప్రాధాన్యతను వివరించారు. అర్హులైన ప్రతి పట్టభద్రుడు ఓటరుగా నమోదు చేసుకోవాలని, ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వాములై తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు అదేవిధంగా పట్టణంలోని ఎన్టీఆర్ స్టేడియంలో కూడా ప్రచార కార్యక్రమాన్ని నిర్వహిస్తూ పట్టభద్రులను కలిసి రామ్ రెడ్డి సర్వోత్తమ్ రెడ్డి విజయానికి మద్దతు తెలపాలని కోరారు. పట్టభద్రుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడంతో పాటు వారి హక్కుల సాధనకు ఎమ్మెల్సీ ఎన్నికలు కీలకమని వివరించారు. పట్టణంలోని అన్ని వార్డుల్లో అర్హులైన పట్టభద్రులను గుర్తించి ఓటరు నమోదు ప్రక్రియపై అవగాహన కల్పిస్తూ, ఎన్నికల ప్రచారాన్ని మరింత విస్తృతం చేయడంపై దృష్టి సారించారు. రామ్ రెడ్డి సర్వోత్తమ్ రెడ్డి విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియలో అర్హులైన వారందరూ భాగస్వాములు కావాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ యొక్క కార్యక్రమంలో, పలు వార్డులో కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు, మహమ్మద్ ఖలీల్, బొల్లు రాజు, నిమ్మల మాధవి శ్రీనివాస్, గాడిపెల్లి లావణ్య చరణ్ గౌడ్, అంబాల శివకుమార్, బోడ రవి నాయక్, సాల్వాయి దిలీప్, కాంగ్రెస్ వారి పట్టణ నాయకులు, ఎడ్ల రమేష్, తోట శుభాష్, గోనె శ్యాం కుమార్, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పలు వార్డుల నాయకులు ముఖ్యులు తదితరులు సాత్రికేయ మిత్రులు పాల్గొన్నారు...

పట్టభద్రుల ఓటరు నమోదుకు కాంగ్రెస్ నాయకుడు గుడిపూడి తిరుమల రావు పిలుపు

ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ ఆధ్వర్యంలో ప్రత్యేక నమోదు కేంద్రాలు.. రాంరెడ్డి సర్వోత్తం రెడ్డి గెలుపునకు కృషి చేయాలి

కారేపల్లి, అక్టోబర్ 30 (లోకల్ గైడ్ న్యూస్): ఖమ్మం--నల్గొండ--వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గ పరిధిలో అర్హులైన పట్టభద్రులందరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని కాంగ్రెస్ నాయకుడు గుడిపూడి తిరుమల రావు పిలుపునిచ్చారు. వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ ఆధ్వర్యంలో సింగరేణి మండలంలోని వివిధ గ్రామాల్లో ప్రత్యేక పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు సహాయ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మండలంలోని అర్హులైన పట్టభద్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని నవంబర్ 6వ తేదీలోగా తమ దరఖాస్తులను సమర్పించాలని కోరారు. ఓటరు నమోదు ప్రక్రియలో పట్టభద్రులకు సహకరించేందుకు ప్రత్యేక కేంద్రాలను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు పేర్కొన్నారు. అవసరమైన ధ్రువపత్రాలతో సహాయ కేంద్రాలను సంప్రదిస్తే నిర్వాహకులు దరఖాస్తు ప్రక్రియలో సహకరిస్తారని, దరఖాస్తు సమర్పించిన అనంతరం రసీదు అందజేస్తారని తెలిపారు. రాంరెడ్డి సర్వోత్తం రెడ్డి గెలుపునకు కృషి చేయాలి పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తం రెడ్డి గెలుపునకు అర్హులైన పట్టభద్రులందరూ కృషి చేయాలని గుడిపూడి తిరుమల రావు విజ్ఞప్తి చేశారు. ప్రతి పట్టభద్రుడు తన ఓటు హక్కును వినియోగించుకునేలా ముందుగా ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. నవంబర్ 6వ తేదీ నమోదు ప్రక్రియకు చివరి గడువు కావడంతో అర్హులైన వారు చివరి తేదీ వరకు వేచి ఉండకుండా వెంటనే దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

ఓటరు నమోదు సహాయ కేంద్రాల వివరాలు:

చీమలపాడు: 7032173193 మాణిక్యారం: 9949459394 సీతారాంపురం: 9849386957 భాగ్యనగర్: 8340933846 సింగరేణి: 9885532955 మాదారం: 8106489502 గేట్ కారేపల్లి: 9705594932 గమనిక: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు చివరి తేదీ నవంబర్ 6. అర్హులైన పట్టభద్రులు సమీపంలోని సహాయ కేంద్రాలను సంప్రదించి నమోదు చేసుకోవాలని కాంగ్రెస్ నాయకుడు గుడిపూడి తిరుమల రావు కోరారు.

చలో ఢిల్లీ కార్యక్రమానికి షాద్‌నగర్ కాంగ్రెస్ నేతల బృందం పయనం

జెండా ఊపి బస్సును ప్రారంభించిన షాద్‌నగర్ ఎమ్మెల్యే, ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ చైర్మన్ వీర్లపల్లి శంకర్

నవంబర్ 1న ఢిల్లీలోని రాంలీలా మైదానంలో కాంగ్రెస్ నిరసన సభకు హాజరయ్యేందుకు బయలుదేరిన 40 మంది నేతలు, కార్యకర్తలు

(లోకల్ గైడ్ షాద్ నగర్) : షాద్‌నగర్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తల బృందం చలో ఢిల్లీ కార్యక్రమానికి బయలుదేరి వెళ్లింది. నవంబర్ 1వ తేదీన న్యూఢిల్లీలోని రాంలీలా మైదానంలో కేంద్ర ప్రభుత్వ విధానాలు, ఎస్ఐఆర్ (ూ×=)కు వ్యతిరేకంగా ఇండియా కూటమి ఆధ్వర్యంలో నిర్వహించనున్న భారీ నిరసన సభలో పాల్గొనేందుకు సుమారు 40 మంది కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ప్రత్యేక బస్సులో ఢిల్లీకి పయనమయ్యారు. ఈ సందర్భంగా షాద్‌నగర్ ఎమ్మెల్యే, ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ చైర్మన్ వీర్లపల్లి శంకర్ గారు జెండా ఊపి బస్సును ప్రారంభించి నాయకులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను, ఎస్ఐఆర్ ప్రక్రియను నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ జాతీయ స్థాయిలో చేపడుతున్న ఉద్యమంలో భాగస్వాములు కావడానికి ఢిల్లీకి వెళ్తున్నట్లు తెలిపారు. ఈ నిరసన కార్యక్రమానికి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీతో పాటు పలువురు జాతీయ, రాష్ట్ర స్థాయి నాయకులు హాజరుకానున్నారని పేర్కొన్నారు. ఢిల్లీ నిరసన కార్యక్రమానికి హాజరయ్యేందుకు తెలంగాణ కాంగ్రెస్ నాయకులు ప్రత్యేక రైళ్లను కేటాయించాలని కేంద్ర ప్రభుత్వాన్ని, రైల్వే శాఖను కోరినప్పటికీ ఎలాంటి ఏర్పాట్లు చేయకపోవడంతో, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రి పొన్నం ప్రభాకర్ తదితర మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు సికింద్రాబాద్ రైల్వే నిలయం వద్ద నిరసన చేపట్టారు. ఈ నేపథ్యంలో షాద్‌నగర్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు బస్సు ద్వారా ఢిల్లీకి బయలుదేరారు.ఈ బృందంలో షాద్‌నగర్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు నల్లమోని శ్రీధర్, కేశంపేట మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రమేష్, నాయకులు ముబారక్ అలీ ఖాన్, సర్పంచులు భాస్కర్ గౌడ్, నాగేశ్వర్, కరుణాకర్ రెడ్డి, కత్తి శేఖరప్ప, షర్ఫోద్దీన్, సత్తయ్య, బీరప్ప, మట్ట వెంకటేష్, లయక్ భాయ్, మంగ మధు, నరేందర్ రెడ్డి తదితరులు ఉన్నారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ సూచన కృష్ణారెడ్డి, మండల అధ్యక్షులు రాయికల్ శ్రీనివాస్, రమేష్, పురుషోత్తం రెడ్డి, నల్లమోని శ్రీధర్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ అలీ ఖాన్, సీనియర్ నాయకులు రఘు నాయక్, గణేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

చెరువుల పరిరక్షణలో హైడ్రా: తొలగింపులే కాదు.. పునరాక్రమణల నివారణా కీలకమే!

ఆక్రమణల తొలగింపుతోనే బాధ్యత ముగియదు..

కాలుష్య నియంత్రణ, భూగర్భజలాల సంరక్షణ, పారదర్శక రికార్డులతోనే చెరువులకు శాశ్వత రక్షణ

సంపాదకీయం: వనం రామకృష్ణ

హైదరాబాద్ నగరంతోపాటు పరిసర ప్రాంతాల్లో చెరువుల పరిరక్షణ, ఆక్రమణల తొలగింపు అంశాలు ప్రాధాన్యం సంతరించుకుంటున్నాయి. చెరువుల పరిధిలోని అక్రమ నిర్మాణాలను తొలగించడం, నిర్మాణ వ్యర్థాలను తరలించడం, హద్దుల వద్ద కంచెలు ఏర్పాటు చేయడం వంటి చర్యలు జలవనరుల రక్షణకు అవసరమే. అయితే, ఈ చర్యలతోనే చెరువులకు సంపూర్ణ రక్షణ లభిస్తుందని భావించడం సరికాదు. తొలగించిన ఆక్రమణలు తిరిగి ఏర్పడకుండా చూడటం, మురుగునీటి ప్రవాహాన్ని నియంత్రించడం, భూగర్భజలాలను కాపాడటం, చెరువుల హద్దులను పారదర్శకంగా నిర్ధారించడం కూడా అంతే ముఖ్యం. ఈ నేపథ్యంలో హైడ్రా చేపడుతున్న చర్యల ప్రభావాన్ని తాత్కాలిక తొలగింపులకే పరిమితం చేయకుండా, దీర్ఘకాలిక ఫలితాల ఆధారంగా అంచనా వేయాల్సిన అవసరం ఉంది.

తొలగింపుల తర్వాత పరిస్థితి ఏమిటి?

అక్టోబర్ 29న వెలువడిన స్థానిక నివేదిక ప్రకారం,

నార్సింగిలోని ముస్కి చెరువు పూర్తి స్థాయి నీటిమట్టం (ఎఫ్‌టీఎల్) పరిధిలో పడేసిన నిర్మాణ, కూల్చివేత వ్యర్థాలను హైడ్రా తొలగించి, చెరువు హద్దుల వద్ద కంచె ఏర్పాటు చేసింది. అయితే, అక్కడ మళ్లీ వ్యర్థాలను పారవేస్తున్నారని, కంచెను ధ్వంసం చేశారని, ఆక్రమణలకు ప్రయత్నాలు జరుగుతున్నాయని స్థానికులు ఫిర్యాదు చేస్తున్నట్లు సమాచారం. ఈ ఫిర్యాదులపై అధికారిక ధ్రువీకరణ అవసరమైనప్పటికీ, అవి చెరువుల పరిరక్షణలో నిరంతర పర్యవేక్షణ ఎంత ముఖ్యమో గుర్తుచేస్తున్నాయి. ఒకసారి వ్యర్థాలను తొలగించి, కంచె ఏర్పాటు చేసిన తర్వాత కూడా అదే సమస్య పునరావృతమైతే, కేవలం తొలగింపుల సంఖ్యను విజయానికి కొలమానంగా తీసుకోవడం సమంజసం కాదు. కంచెను ధ్వంసం చేసినవారు ఎవరు? వ్యర్థాలను మళ్లీ పారవేస్తున్న వారిని గుర్తించారా? ఫిర్యాదులపై ఎలాంటి చర్యలు తీసుకున్నారు? అనే ప్రశ్నలకు సంబంధిత అధికారులు సమాధానమివ్వాలి. చెరువుల వద్ద ఏర్పాటు చేసిన రక్షణ వ్యవస్థలు వాస్తవంగా ఎంతకాలం పనిచేస్తున్నాయో కూడా పరిశీలించాలి. మాదాపూర్‌లోని సున్నం చెరువు పరిసరాల్లో అనధికార బోరుబావులు, మోటార్లు, పైపులైన్లు, షెడ్ల తొలగింపునకు చర్యలు చేపట్టినట్లు అక్టోబర్ 24, 25 తేదీలకు సంబంధించిన నివేదికలు పేర్కొన్నాయి. బోర్ల ద్వారా భూగర్భజలాలను తోడి, ట్యాంకర్ల ద్వారా వాణిజ్య అవసరాలకు విక్రయిస్తున్నారనే ఆరోపణలు కూడా ఉన్నాయి. అయితే, ఈ అంశాలపై అనుమతుల రికార్డులు, అధికారిక స్పందన, సంబంధిత ఫిర్యాదులు, కేసుల వివరాలను పరిశీలించిన తర్వాతే నిర్ధారణకు రావాలి. చెరువుల పరిరక్షణలో చర్యలు ఎంత ముఖ్యమో, వాటి ఆధారాలను సేకరించి వాస్తవాలను నిర్ధారించడం కూడా అంతే ముఖ్యం.

ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ హద్దులపై స్పష్టత అవసరం

చెరువుల పరిరక్షణలో అత్యంత కీలకమైన అంశం వాటి హద్దులను చట్టబద్ధంగా గుర్తించడం. ఎఫ్‌టీఎల్ అంటే చెరువు పూర్తిగా నిండినప్పుడు నీరు చేరే గరిష్ఠ స్థాయిని సూచించే హద్దు. బఫర్ జోన్ అంటే జలవనరుల పరిరక్షణ కోసం చెరువు చుట్టూ నిర్దేశించే రక్షణ ప్రాంతం. ఈ రెండు పరిధులు ఒకటే కావు. వాటిని కలగలిపి చూడటం వల్ల భూముల హద్దులు, నిర్మాణాల చట్టబద్ధత, ఆక్రమణల గుర్తింపులో గందరగోళం ఏర్పడవచ్చు. హైడ్రా ప్రచురించిన సాధారణ మార్గదర్శకాలలో 10 హెక్టార్లకు పైబడిన చెరువులకు 30 మీటర్లు, 10 హెక్టార్లలోపు చెరువులకు 9 మీటర్లు, నదులు లేదా కాలువలకు 15 మీటర్ల బఫర్ పరిధులు ప్రస్తావించబడ్డాయి. అయితే, ఈ కొలతలను ప్రతి జలవనరుకు యథాతథంగా వర్తింపజేయడం సరికాదు. సంబంధిత చెరువుకు వర్తించే నిబంధనలు, ఆమోదిత మ్యాపులు, అధికారిక ఉత్తర్వులు, సర్వే రికార్డుల ఆధారంగానే హద్దులను నిర్ధారించాలి. చెరువుల సర్వే నంబర్లు, ఎఫ్‌టీఎల్ మ్యాపులు, బఫర్ జోన్ వివరాలు ప్రజలకు సులభంగా అందుబాటులో ఉంటే అనేక సందేహాలకు పరిష్కారం లభిస్తుంది. ఉపగ్రహ చిత్రాలు, జీఐఎస్ సాంకేతికత హద్దులను గుర్తించడంలో ఉపయోగపడతాయి. అయితే, డిజిటల్ మ్యాప్ ఒక్కటే తుది చట్టపరమైన ఆధారం కాదు. రెవెన్యూ రికార్డులు, సర్వే వివరాలు, గతంలో జారీ చేసిన అనుమతులను సమగ్రంగా పరిశీలించడంతోపాటు, ప్రభావిత వ్యక్తులకు తమ వాదనను వినిపించే అవకాశం కల్పించాలి. చట్టబద్ధమైన ప్రక్రియను అనుసరించినప్పుడే చర్యలపై పారదర్శకత, ప్రజల్లో విశ్వాసం పెరుగుతాయి.

చెరువుల రక్షణ అంటే భూమిని కాపాడటమే కాదు

చెరువులను ఆక్రమణల నుంచి విముక్తం చేయడం ఎంత అవసరమో, వాటిలోకి చేరే కాలుష్యాన్ని నియంత్రించడం కూడా అంతే అవసరం. చెరువులు వర్షపు నీటిని నిల్వ చేయడం, భూగర్భజలాల పునర్భరణకు తోడ్పడటం, పరిసర ప్రాంతాల పర్యావరణ సమతుల్యతను కాపాడటం వంటి కీలక పాత్ర పోషిస్తాయి. వాటి నీటి నిల్వ సామర్థ్యం తగ్గినా, మురుగునీరు నిరంతరం చేరినా, పరిరక్షణ చర్యల ఆశించిన ఫలితాలు దెబ్బతింటాయి. మూసీ నది పరిసరాలతోపాటు నగరంలోని చెరువుల్లో చెత్త, నిర్మాణ వ్యర్థాలను తొలగించడం అవసరమే. కానీ శుద్ధి చేయని మురుగునీరు చెరువులు, కాలువలు, నదిలోకి నిరంతరం చేరుతుంటే కాలుష్యం మళ్లీ పేరుకుపోయే ప్రమాదం ఉంది. అందువల్ల గృహ మురుగునీరు, పారిశ్రామిక వ్యర్థాలు, నిర్మాణ వ్యర్థాల విడుదలను మూలాల వద్దే నియంత్రించాలి. మురుగునీటి శుద్ధి కేంద్రాల రూపకల్పన సామర్థ్యం ఎంత? వాస్తవంగా ఎంత మురుగునీటిని శుద్ధి చేస్తున్నారు? శుద్ధి చేసిన నీరు నిర్దేశిత నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా ఉందా? అనే ప్రశ్నలకు సంబంధిత శాఖలు గణాంకాలతో సమాధానం చెప్పాలి. చెరువుల నుంచి తొలగించిన పూడిక, వ్యర్థాలను ఎక్కడికి తరలిస్తున్నారు? వాటిని పర్యావరణ నిబంధనలకు అనుగుణంగా నిర్వహిస్తున్నారా? అనే వివరాలను కూడా వెల్లడించాలి. వ్యర్థాలను ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి తరలించడం సమస్యకు శాశ్వత పరిష్కారం కాదు. భూగర్భజలాల వినియోగంపై పర్యవేక్షణ ఏది సున్నం చెరువు పరిసరాల్లో బోరుబావుల ద్వారా నీటిని వెలికితీసి ట్యాంకర్లకు సరఫరా చేస్తున్నారనే ఆరోపణలు నిజమైతే, వాటిపై సంబంధిత శాఖలు సమగ్ర విచారణ చేపట్టాలి. అయితే, ఆరోపణలను నిర్ధారిత వాస్తవాలుగా ప్రచురించడానికి ముందు బోరుబావుల అనుమతులు, నీటి వెలికితీతకు సంబంధించిన నిబంధనలు, సరఫరా వివరాలు పరిశీలించాలి. భూగర్భజలాల వినియోగం, ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా, నీటి నాణ్యతపై సంబంధిత శాఖలు సమన్వయంతో పర్యవేక్షణ చేపట్టాలి. అనుమతులు లేకుండా నీటిని వెలికితీస్తున్నారనే ఫిర్యాదులపై ఆధారాలతో విచారణ జరిపి, ఉల్లంఘనలు నిర్ధారణ అయితే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలి. అదే సమయంలో, చట్టబద్ధమైన నీటి వినియోగాన్ని అనవసరంగా అడ్డుకోకుండా రికార్డుల ఆధారంగా నిర్ణయాలు తీసుకోవడం అవసరం.

పునరాక్రమణలకు అడ్డుకట్ట ఎప్పుడు?

ఆక్రమణలను తొలగించిన తర్వాత అదే ప్రాంతంలో మళ్లీ నిర్మాణాలు జరగకుండా చూడటం హైడ్రాతోపాటు సంబంధిత స్థానిక సంస్థలకూ ముఖ్యమైన బాధ్యత. కంచెలు, హెచ్చరిక బోర్డులు, అవసరమైన చోట సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం ఉపయోగకరమే. అయితే, వాటి నిర్వహణ, నిరంతర తనిఖీలు, ఫిర్యాదులపై వేగవంతమైన స్పందన లేకపోతే ఈ ఏర్పాట్లు ఆశించిన ఫలితాన్ని ఇవ్వవు. ప్రతి చెరువుకు ప్రత్యేక పరిరక్షణ ప్రణాళిక ఉండాలి. పర్యవేక్షణకు బాధ్యత వహించే అధికారి ఎవరు? ఫిర్యాదు అందిన తర్వాత ఎంత సమయంలో పరిశీలన చేపడతారు? ఉల్లంఘన నిర్ధారణ అయితే ఎలాంటి చర్యలు తీసుకుంటారు? అనే అంశాలను స్పష్టంగా నిర్ణయించాలి. ప్రజలు ఫిర్యాదులు చేయడానికి, వాటి పరిష్కార స్థితిని తెలుసుకోవడానికి అందుబాటులో ఉండే వ్యవస్థను ఏర్పాటు చేయాలి. హైడ్రా, జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, నీటిపారుదల, రెవెన్యూ శాఖలు, తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి, జలమండలి మధ్య సమన్వయం కూడా కీలకం. శాఖలవారీగా విడివిడిగా రికార్డులు నిర్వహించడం వల్ల సమాచార లోపాలు, బాధ్యతల విషయంలో గందరగోళం ఏర్పడే అవకాశం ఉంది. చెరువుల హద్దులు, గుర్తించిన ఆక్రమణలు, జారీ చేసిన నోటీసులు, చేపట్టిన తొలగింపులు, పెండింగ్ కేసులు, పునరుద్ధరణ పురోగతిని ఒక సమగ్ర డిజిటల్ రికార్డులో నమోదు చేసి, సంబంధిత శాఖలకు అందుబాటులో ఉంచాలి.

ప్రకటనలు కాదు.. ఫలితాలే ప్రామాణికం

చెరువుల పరిరక్షణలో హైడ్రా విజయాన్ని అంచనా వేయడానికి తొలగించిన నిర్మాణాల సంఖ్య ఒక్కటే సరిపోదు. ఆక్రమణల నుంచి విముక్తి కల్పించిన విస్తీర్ణం ఎంత? చెరువు నీటి నిల్వ సామర్థ్యంలో మార్పు వచ్చిందా? శుద్ధి చేయని మురుగునీటి ప్రవాహం తగ్గిందా? నీటి నాణ్యతలో మెరుగుదల నమోదైందా? భూగర్భజలాల మట్టంలో ఎలాంటి మార్పులు కనిపించాయి? తొలగించిన ప్రాంతాల్లో పునరాక్రమణలు జరగకుండా ఎంతకాలంగా పర్యవేక్షణ కొనసాగుతోంది? అనే అంశాలపై చెరువులవారీగా గణాంకాలను వెల్లడించాలి. ఈ వివరాలను నిర్దిష్ట కాలవ్యవధుల్లో ప్రజలకు అందుబాటులో ఉంచితే చర్యల ప్రభావాన్ని వాస్తవికంగా అంచనా వేయవచ్చు. హద్దుల గుర్తింపు నుంచి పునరుద్ధరణ వరకు ప్రతి దశలో పారదర్శకత ఉండాలి. ఫిర్యాదులపై తీసుకున్న చర్యలు, కాలుష్య నియంత్రణ ఫలితాలు, పునరాక్రమణల స్థితి వంటి వివరాలను బహిరంగపరచడం ద్వారా ప్రజల భాగస్వామ్యాన్ని పెంచవచ్చు.

శాశ్వత రక్షణే అసలైన లక్ష్యం

చెరువులను ఆక్రమణల నుంచి విముక్తం చేయడం పరిరక్షణలో తొలి అడుగు మాత్రమే. వాటి హద్దులను చట్టబద్ధంగా నిర్ధారించడం, నిర్మాణ వ్యర్థాల పారవేతను అరికట్టడం, మురుగునీటిని శుద్ధి చేయడం, భూగర్భజలాలను కాపాడటం, పునరాక్రమణలను నిరోధించడం వంటి చర్యలు సమాంతరంగా సాగాలి. ఇందుకు హైడ్రాతోపాటు సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలి. ముస్కి, సున్నం చెరువులకు సంబంధించిన స్థానిక నివేదికల్లో ప్రస్తావించిన ఫిర్యాదులపై అధికారిక నిర్ధారణ అవసరం. అయినప్పటికీ, చెరువుల పరిరక్షణను తాత్కాలిక తొలగింపులకే పరిమితం చేయకూడదనే అంశం స్పష్టంగా కనిపిస్తోంది. ఒక చెరువు ఆక్రమణల నుంచి విముక్తమైందా? దాని నీటి నిల్వ సామర్థ్యం మెరుగుపడిందా? కాలుష్యం తగ్గిందా? తిరిగి ఆక్రమణలు జరగకుండా పటిష్ఠమైన వ్యవస్థ ఏర్పడిందా? అనే ప్రశ్నలకు అధికారిక గణాంకాలు, పారదర్శక రికార్డులతో సమాధానం లభించాలి. చెరువుల పరిరక్షణలో అసలైన విజయం ఎన్ని నిర్మాణాలను తొలగించామన్నదానిలో కాదు.. తొలగించిన తర్వాత ఆ చెరువును ఎంత సమర్థంగా, ఎంతకాలం కాపాడగలిగామన్నదానిలో ఉంది.లి

వనం రామకృష్ణ,
మేడ్చల్ జిల్లా లోకల్ గైడ్ స్టాఫ్ రిపోర్టర్.

ప్రజలకు పోలీసు సేవలను చేరవేయడమే 'సురక్ష' లక్ష్యం

పోలీసుల త్యాగాలు, సేవలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి..

డీజీపీ సి.వి.ఆనంద్

సైబరాబాద్, అక్టోబరు 30 (లోకల్ గైడ్ ప్రతినిధి కృష్ణ): మారుతున్న సమాచార వ్యవస్థకు అనుగుణంగా పోలీసుల సేవలు, త్యాగాలు, విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే 'సురక్ష' దినపత్రిక ప్రధాన లక్ష్యమని తెలంగాణ డీజీపీ, సురక్ష ప్రధాన సంపాదకుడు సి.వి. ఆనంద్ అన్నారు. పోలీసులపై తప్పుడు వార్తలు ప్రచారంలోకి వచ్చినప్పుడు వాస్తవాలను ప్రజలకు వివరించడంతోపాటు, నేరాల నివారణ, ప్రజా సమస్యలు, భద్రతా చర్యలపై అవగాహన కల్పించాలని సూచించారు. తెలంగాణ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'సురక్ష' దినపత్రిక ప్రథమ వార్షికోత్సవం గురువారం హైదరాబాద్‌లోని పేట్లబురుజు సిటీ పోలీస్ కాలేజీలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డీజీపీ సి.వి.ఆనంద్‌కు సైబరాబాద్ పోలీస్ కమిషనర్, సురక్ష కార్యనిర్వాహక సంపాదకుడు డాక్టర్ ఎం.రమేష్ స్వాగతం పలికారు. ప్రముఖ పాత్రికేయుడు పమిడికాల్వ మద్దతు, బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ మామిడి హరికృష్ణతోపాటు రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాలు, పోలీసు యూనిట్లకు చెందిన పీఆర్వోలు పాల్గొన్నారు."సాంకేతికతతో మారుతున్న సమాచార వ్యవస్థ" సెల్‌ఫోన్లు, సామాజిక మాధ్యమాల ద్వారా సమాచారం క్షణాల్లో ప్రజలకు చేరుతున్న నేపథ్యంలో వార్తల నిజానిజాలను నిర్ధారించడం కీలకమని డీజీపీ పేర్కొన్నారు. విధి నిర్వహణలో పోలీసులు ఎదుర్కొనే సవాళ్లు, పోలీసు అమరవీరుల సంస్మరణ కార్యక్రమాల్లో నిర్వహించే రక్తదాన శిబిరాలు, ఇతర సేవా కార్యక్రమాలను విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. పెట్రోలింగ్, కేసుల దర్యాప్తు, నేరాల నివారణ, ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రత్యేక కథనాలు ప్రచురించాలని తెలిపారు. "స్థానిక భాషతోనే ప్రజలతో అనుసంధానం" ప్రజల సమస్యలను అర్థం చేసుకుని మెరుగైన సేవలు అందించాలంటే అధికారులకు స్థానిక భాష, ప్రాంతీయ యాసలపై పట్టు అవసరమని సి.వి. ఆనంద్ అన్నారు. తెలుగు భాషకు సి.పి. బ్రౌన్ అందించిన సేవలను గుర్తుచేస్తూ, ప్రాంతీయ భాషలు, యాసలు మన సంస్కృతికి ప్రత్యేకతను తీసుకొస్తాయని పేర్కొన్నారు. సురక్ష దినపత్రిక పోలీసు శాఖకు, ప్రజలకు మధ్య సమాచార వారధిగా నిలవాలని ఆకాంక్షించారు. "పోలీసుల చరిత్రను వారే వెలుగులోకి తేవాలి" సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం.రమేష్ మాట్లాడుతూ.. రాష్ట్రంలోని అన్ని పోలీసు యూనిట్లలో జరుగుతున్న కార్యక్రమాలు, విజయాలు, నేర నియంత్రణ చర్యలను ప్రజలకు చేరవేయడమే సురక్ష ఉద్దేశమన్నారు. బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ మామిడి హరికృష్ణ మాట్లాడుతూ..పోలీసుల సేవలు, త్యాగాలను పోలీసులే ప్రజలకు తెలియజేయాలని సూచించారు. ప్రముఖ పాత్రికేయుడు పమిడికాల్వ మద్దతు మాట్లాడుతూ.. సరళమైన, ఆకట్టుకునే భాషలో వార్తలు రాయాలని, మాతృభాషపై పట్టు పెంచుకోవాలని పేర్కొన్నారు.

ఆపదలో ఉన్నవారికి అండగా మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్

సీఎం ఆర్‌ఎఫ్ చెక్కులు అందజేసిన ఎమ్మెల్సీ సురభి వాణీదేవి

(లోకల్ గైడ్ షాద్ నగర్) : కేశంపేట మండలం కొండారెడ్డిపల్లి గ్రామానికి చెందిన కె. అనూషకు రూ.60,000, వినయకు రూ.60,000 చొప్పున మొత్తం రూ.1,20,000 సీఎం సహాయనిధి చెక్కులు మంజూరయ్యాయి. మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్య యాదవ్ ప్రత్యేక చొరవతో, ఎమ్మెల్సీ సురభి వాణీదేవి సహకారంతో ఈ చెక్కులు మంజూరు కాగా, ఎమ్మెల్సీ సురభి వాణీదేవి చేతుల మీదుగా లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. పదవిలో ఉన్నా లేకున్నా ప్రజల కోసం, కార్యకర్తల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్న మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఆపదలో ఉన్న వారికి అండగా నిలుస్తూ, అవసరమైన సమయంలో సహాయం అందించేందుకు ఆయన చేస్తున్న కృషి అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ యువ నాయకులు కానం ప్రేమ్ కుమార్ గౌడ్, ఉప సర్పంచ్ కర్నెకోట నరేష్, నాయకులు కంది రాఘవేందర్ గౌడ్, దశరథ్, తేజ యాదవ్, హరీష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటు నమోదు చేసుకోండి

మిడ్జిల్ అక్టోబర్ 30(లోకల్ గైడ్): మండలంలోని డిగ్రీ పూర్తి చేసి మూడేళ్లు నిండిన అర్హులైన పట్టభద్రులు ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు జాబితాలో తమ పేర్లను నమోదు చేసుకోవాలని మిడ్జిల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గౌస్ కోరారు. ఓటరు నమోదు ప్రక్రియకు నవంబర్ 6వ తేదీ చివరి గడువు కావడంతో అర్హులైన ప్రతి ఒక్కరూ సకాలంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇప్పటికే దరఖాస్తు చేసుకున్నవారు, కొత్తగా దరఖాస్తు చేసుకునేవారు తమ వివరాలను అందజేయాలని కోరారు. దరఖాస్తు చేసుకున్న పట్టభద్రులు ఆధార్ కార్డు, డిగ్రీ మెమో, దరఖాస్తు డౌన్‌లోడ్ కాపీ జిరాక్స్ ప్రతులను తీసుకొని గెజిటెడ్ అధికారి సంతకం చేయించాలి. అనంతరం వాటిని గ్రామంలోని బీఎల్‌ఓలకు లేదా మండలంలోని సంబంధిత గ్రామ పంచాయతీ అధికారులకు (జీపీఓలకు) అందజేయాలని గౌస్ తెలిపారు. అర్హులైన పట్టభద్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఎమ్మెల్సీ ఓటరు జాబితాలో తమ పేర్లు నమోదు చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

RNI NO. APBIL/2013/50718 LOCAL GUIDE Bi-Lingual Daily Published From Rangareddy

లోకల్ గైడ్ ద్విభాషా దినపత్రిక

అనాథ పిల్లలకు అండగా నిలుస్తున్న జల్లి ఉదయ్ కుమార్.. ఉత్తమ నాయకత్వ పురస్కారం ప్రదానం!

మిడ్జిల్ అక్టోబర్ 30(లోకల్ గైడ్): గ్రామీణ ప్రాంతాల్లోని నిరుపేద, అనాథ పిల్లలకు విశేష సేవలందిస్తూ సామాజిక బాధ్యతను చాటుకుంటున్న మహేంద్రనాథ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ అధ్యక్షుడు జల్లి ఉదయ్ కుమార్‌కు ఉత్తమ నాయకత్వ పురస్కారం (బెస్ట్ లీడర్‌షిప్ అవార్డు) లభించింది. హైదరాబాద్‌లోని హబ్సిగూడ వేమూరి బ్యాంక్వెట్ హాల్‌లో సోషల్ వర్కర్లు, కుట్టు మిషన్ శిక్షణ ట్రైనర్ల కోసం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయనకు ఈ అవార్డును ప్రదానం చేశారు.ఐగ్రామీణ ప్రాంతాల్లో తల్లిదండ్రులను కోల్పోయిన నిరుపేద పిల్లలు, అనాథ ఆశ్రమాల్లో ఉంటున్న చిన్నారులకు వందల సంఖ్యలో ఉచితంగా దుస్తులు కుట్టించి అందిస్తూ జల్లి ఉదయ్ కుమార్ చేస్తున్న సేవలను గుర్తించి ఈ పురస్కారానికి ఎంపిక చేశారు. ఆర్థిక ఇబ్బందులతో అవసరమైన దుస్తులు సమకూర్చుకోలేని చిన్నారులకు తన వంతు సహాయం అందిస్తూ వారి ముఖాల్లో చిరునవ్వులు నింపడం అభినందనీయమని కార్యక్రమ నిర్వాహకులు పేర్కొన్నారు.ఎంవీఆర్ గ్రూప్ సీఈఓ ఎం. వెంకట్ రావు, మాక్స్ గ్లోబల్ ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ దినేష్ చర్లపల్లి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. టీవీ సీరియల్ నటి భారతి చేతుల మీదుగా జల్లి ఉదయ్ కుమార్ ఉత్తమ నాయకత్వ పురస్కారాన్ని అందుకున్నారు.ఈ సందర్భంగా సామాజిక సేవా రంగంలో నిస్వార్థంగా పనిచేసే వారిని గుర్తించి ప్రోత్సహించడం ద్వారా మరింత మందికి సేవా స్ఫూర్తి కలుగుతుందని నిర్వాహకులు అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో టైలరింగ్ శిక్షణ ట్రైనర్లు, టైలర్లు అరుణ, అర్చనతో పాటు పలువురు సోషల్ వర్కర్లు, సేవా రంగ ప్రతినిధులు పాల్గొన్నారు. జల్లి ఉదయ్ కుమార్‌కు అవార్డు లభించడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

హైదరాబాద్‌లో వైభవంగా సదర్ సమ్మేళనం నిర్వహణకు ఏర్పాట్లు

-సీఎం రేవంత్ రెడ్డికి ఆహ్వాన పత్రిక అందజేసిన సదర్ కమిటీ సభ్యులు

హైదరాబాద్, అక్టోబర్ 30 (లోకల్ గైడ్ ప్రతినిధి కృష్ణ): హైదరాబాద్‌లో నిర్వహించనున్న సదర్ సమ్మేళనాన్ని వైభవంగా నిర్వహించేందుకు సదర్ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో సదర్ సమ్మేళనానికి ముఖ్య అతిథిగా హాజరు కావాలని కోరుతూ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సదర్ కమిటీ సభ్యులు ఆహ్వాన పత్రికను అందజేశారు. "సదర్ సమ్మేళనానికి ఘనంగా ఏర్పాట్లు" యాదవ సామాజిక వర్గానికి చెందిన సంప్రదాయాలు, సంస్కృతి, ఐక్యతను చాటిచెప్పే సదర్ సమ్మేళనానికి ప్రత్యేక ప్రాధాన్యత ఉంది. ప్రతి సంవత్సరం సంప్రదాయబద్ధంగా నిర్వహించే ఈ వేడుకల్లో భాగంగా సాంస్కృతిక కార్యక్రమాలు, సంప్రదాయ ప్రదర్శనలు ఆకట్టుకుంటాయి. హైదరాబాద్‌లో నిర్వహించే ఈ సమ్మేళనం ద్వారా సామాజిక ఐక్యతను మరింత బలోపేతం చేయడంతో పాటు, యువతకు తమ సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన కల్పించే అవకాశం ఉంటుందని నిర్వాహకులు భావిస్తున్నారు."ముఖ్యమంత్రికి ఆహ్వానం" సదర్ సమ్మేళనానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఆహ్వానిస్తూ కమిటీ సభ్యులు ఆహ్వాన పత్రిక అందజేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు కమిటీ సభ్యులు కృషి చేస్తున్నారు. సమ్మేళనానికి సంబంధించిన ఏర్పాట్లను సమన్వయం చేస్తూ, వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఈ సందర్భంగా శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు మిరియాల ప్రీతమ్ మాట్లాడుతూ..సదర్ సమ్మేళనం మన సంప్రదాయాలకు, సామాజిక ఐక్యతకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఇలాంటి కార్యక్రమాలు సమాజంలో పరస్పర స్నేహభావాన్ని పెంపొందించడంతో పాటు, సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించేందుకు దోహదపడతాయని తెలిపారు. హైదరాబాద్‌లో నిర్వహించనున్న సదర్ సమ్మేళనం విజయవంతం కావాలని ఆయన ఆకాంక్షించారు.

హెల్మెట్ వాడండి.. ప్రాణాలను కాపాడుకోండి'

షాద్ నగర్ ట్రాఫిక్ సీఐ వెంకటేశ్వర్లు

ద్విచక్ర వాహనదారులకు అవగాహన కల్పించిన ట్రాఫిక్ సీఐ వెంకటేశ్వర్లు

ద్విచక్ర వాహనదారులకు కొత్త హెల్మెట్లు అందజేత

రహదారి భద్రతే లక్ష్యం.. హెల్మెట్ వాడకంపై పోలీసుల ప్రచారం

(లోకల్ గైడ్ షాద్ నగర్) : రహదారి భద్రతపై ప్రజల్లో అవగాహన కల్పించడంతో పాటు హెల్మెట్ వినియోగాన్ని ప్రోత్సహించేందుకు షాద్‌నగర్ ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో రాయికల్ టోల్‌గేట్ వద్ద ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సీఐ వెంకటేశ్వర్లు హెల్మెట్ ధరించకుండా ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనదారులకు కొత్త హెల్మెట్లు కొనిపించి, వారి చేతుల మీదుగానే ధరింపజేశారు. హెల్మెట్ ధరించడం వల్ల రోడ్డు ప్రమాదాల సమయంలో తలకు తీవ్ర గాయాలు కాకుండా ప్రాణాలను కాపాడుకునే అవకాశం ఉంటుందని వివరించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ట్రాఫిక్ నిబంధనలను నిర్లక్ష్యం చేయకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. వాహనం నడిపేటప్పుడు సెల్‌ఫోన్ వినియోగం, అతివేగం వంటి ప్రమాదకర చర్యలకు దూరంగా ఉండాలని కోరారు. ప్రతి ఒక్కరూ రహదారి భద్రతను తమ బాధ్యతగా భావించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ వెంకటేష్ , ఏఎస్ఐ రవీందర్ పాల్గొని వాహనదారులకు రహదారి భద్రతపై పలు సూచనలు చేశారు. పోలీసుల ఈ కార్యక్రమాన్ని పలువురు అభినందించారు.

ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి ఎమ్మెల్యే: కుంభం అనిల్ కుమార్ రెడ్డి

యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి భువనగిరి అక్టోబర్ 30 (లోకల్ గైడ్): బీబీనగర్ మండలం లోని రాఘవపూర్, బ్రాహ్మణపల్లి గ్రామాల్లో పిఎసిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వడ్ల కొనుగోలు కేంద్రాలను భువనగిరి ఎమ్మెల్యే కుంభ అనిల్ కుమార్ రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని, ధాన్యం కొనుగోళ్లలో జాప్యం లేకుండా చూడాలని రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ పొట్టోల్ల శ్యామ్ గౌడ్ మండల అధ్యక్షుడు సురకంటి సత్తిరెడ్డి, సర్పంచ్ గడ్డం బాల్ రెడ్డి,పి ఎఎస్ సిఎస్ వైస్ చైర్మన్ చంద్రశేఖర్ రెడ్డి ,డైరెక్టర్ లు పాలకవర్గం రైతులు,అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో ఏదులాపురం మునిసిపాలిటీని రోల్ మోడల్ గా తీర్చిదిద్దుతాం...

రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

ఏదులాపురం మున్సిపాలిటీలో అభివృద్ధి పనుల శంకుస్థాపన చేసిన మంత్రి

ఖమ్మం, అక్టోబర్ -30: లోకల్ గైడ్ : ఏదులాపురం మున్సిపాలిటీని రాష్ట్రంలోనే రోల్ మోడల్ గా తీర్చిదిద్దుతామని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. శుక్రవారం మంత్రి, జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తో కలిసి ఏదులాపురం మున్సిపాలిటీలో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. ఇందులో భాగంగా ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని 6 వ వార్డు సింగరేణి కాలనీ వద్ద రూ. 496 లక్షల అంచనా వ్యయంతో 46 అంతర్గత సి.సి. రోడ్ల నిర్మాణ పనులకు, రూ. 250 లక్షల అంచనా వ్యయంతో ప్రకాశ్ నగర్ బ్రిడ్జి నుండి కోదాడ ఆర్ అండ్ బి రోడ్డు వయా కోటనారాయణపురం ఇందిరమ్మ కాలనీ వరకు బీటీ రోడ్డు నిర్మాణ పనులకు మంత్రి శంకుస్థాపనలు చేశారు. ఈ రోడ్లతో సాయి ప్రభాత్ నగర్ వన్ అండ్ టూ, టెంపుల్ సిటీ, అభయ టౌన్‌షిప్, సింగరేణి కాలనీ, గుర్రాలపాడు తండా, ఇందిరమ్మ కాలనీ, కోట నారాయణపురం, సూర్యా నగర్, చంద్ర నగర్, చిన్న తండా, కె.ఎల్.ఆర్. నగర్, బృందావనం, గోకుల కృష్ణ నగర్, తాశిల్లీ తండా, లక్ష్మీ గాయత్రి నగర్, నందన వనం, ఏదులాపురం, ఆదిత్య టౌన్‌షిప్, గుర్రాలపాడు ఆర్.టి.సి. కాలనీ, శ్రీవారి నగర్, సత్య సంకల్ప కాలనీ, షాబాద్ మాసరెడ్డి నగర్, వరంగల్ క్రాస్ రోడ్, కోదాడ క్రాస్ రోడ్ తదితర ప్రాంతాల ప్రజలందరూ నిరంతరం రాకపోకలు సాగిస్తారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ప్రజాప్రభుత్వం వచ్చిన తర్వాత 6, 7, 8 డివిజన్లలో వివిధ అభివృద్ధి కార్యక్రమాల కోసం రూ. 79 కోట్ల 79 లక్షల రూపాయలతో శంకుస్థాపనలు చేసుకున్నామని, కొన్ని పూర్తయ్యాయని, మరికొన్ని వివిధ దశల్లో ఉన్నాయని తెలిపారు. ఏదులాపురం మున్సిపాలిటీని ఎన్నికల ముందు నుంచి కూడా అభివృద్ధి చేస్తూ, రాష్ట్రంలోనే ఒక రోల్ మోడల్ మున్సిపాలిటీగా తీసుకొస్తామని ఇచ్చిన మాటి ప్రకారం ఎన్నికల దగ్గర నుంచి ఇప్పటివరకు సుమారు రూ. 100 కోట్లకు పైగా నిధులు తీసుకొచ్చామని తెలిపారు. మున్సిపాలిటీలో 8 నుంచి 11 గ్రామ పంచాయతీలు కలిసి ఉన్నందున అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని, ఈ విశాలమైన మున్సిపాలిటీని తీర్చిదిద్దాలనే తపనతో ముఖ్యమంత్రి ఏది కాదనకుండా సహకరిస్తున్నారని అన్నారు. కేవలం రోడ్లు, డ్రైన్లే కాకుండా తాగునీరు సమస్యను, విద్యుత్ సమస్యలను హైటెన్షన్ లైన్ల తొలగింపు తదితరాలను పరిష్కరించామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా పేదవాళ్లకు అండదండగా ఉంటూ, భద్రత, భరోసా కల్పిస్తూ అనేక సంక్షేమ కార్యక్రమాలు అందిస్తున్నామని మంత్రి తెలిపారు. ఇందులో భాగంగానే 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఆర్.టి.సి. బస్సులలో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం, కొత్త రేషన్ కార్డులు, పేదవాళ్ళు తినడానికి సన్నబియ్యం పంపిణీ కార్యక్రమం అమలు చేస్తున్నామని అన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేసే కార్యక్రమంలో భాగంగా గడిచిన 33 నెలల్లో రూ. 73 వేల కోట్లు సున్నా వడ్డీనిచ్చిన ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమని తెలిపారు. పేదోడి కల ఇందిరమ్మ ఇల్లు అన్నట్లుగా, పేదవాడు చనిపోయేలోపు సొంత స్థలంలో ఇల్లు కట్టుకోవాలనే కోరికను నెరవేర్చడానికి తెలంగాణ ప్రభుత్వం అప్పుల్లో ఉన్నప్పటికీ ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందని తెలిపారు. మొదటి విడత రాష్ట్రవ్యాప్తంగా 4.5 లక్షల ఇళ్లు, రెండో విడత 2.5 లక్షల ఇళ్లు, హైదరాబాదులో లక్ష ఇళు ,, మొత్తంగా 8 లక్షల ఇళ్లకు 40 వేల కోట్ల రూపాయలు పేదింటి ఆడబిడ్డకు ఇల్లు కట్టుకోవడానికి ఇస్తున్నామని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరుకు కులం, మతం, పార్టీ అనకుండా కేవలం పేదవాడై ఉంటే చాలు అనే ఉద్దేశంతోనే ఈ కార్యక్రమం అమలు జరుగుతోందని మంత్రి స్పష్టం చేశారు. ఏదులాపురం మునిసిపాలిటీకి ఇప్పటికే రూ. 100 కోట్లు ఖర్చు పెట్టామని, రాబోయే రోజుల్లో మరో రూ. 100 నుండి 150 కోట్లు ఖర్చు పెట్టి ప్రతి డొంకను, ప్రతి రోడ్డును సిమెంట్ రోడ్డుగా మారుస్తామన్నారు. కార్యక్రమాల్లో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ, కేవలం వారం రోజుల్లోనే రూ. 30 కోట్ల విలువైన శంకుస్థాపనలు ఏదులాపురం మునిసిపాలిటీలో జరిగాయన్నారు. అభివృద్ధి పనులు అత్యంత వేగంగా కొనసాగుతున్నాయన్నారు. అన్ని ఏరియాలలోనూ ప్రజలకు మెరుగైన వసతులు కల్పించేలా సమగ్ర అభివృద్ధి జరుగుతోందని అన్నారు. మంత్రి ఆదేశాల మేరకు పనుల పూర్తికి ఇంజనీరింగ్ అధికారులను డెప్యుటేషన్ పై తెప్పించడం జరిగిందని, త్వరలోనే ఈ పనులన్నీ పూర్తిగా వేగవంతం చేసి పూర్తి చేస్తామని కలెక్టర్ అన్నారు.ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ బి ఎస్ఈ యుగంధర్ రావు, పీఆర్ ఎస్ఈ వెంకట్ రెడ్డి, ఏదులాపురం మునిసిపల్ చైర్ పర్సన్ పోకబత్తిని అనిత, వైస్ చైర్మన్ తమ్మినేని నవీన్, కౌన్సిలర్లు, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

11వ వార్డు అభివృద్ధికి మహర్దశ..

మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక ప్రణాళిక!

లోకల్ గైడ్ అక్టోబర్ 30 : మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో రూ.50 లక్షలతో సైడ్ డ్రైనేజీ నిర్మాణం.. 66 అడుగుల వెడల్పుతో రోడ్డు.. రూ.30 కోట్లతో ప్రభుత్వ విద్యాసంస్థల అభివృద్ధి!. మహబూబాబాద్ పట్టణం లోని 11వ వార్డు అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యతనిస్తూ, ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు నూతన పనులకు శంకుస్థాపన చేసిన మహబూబాబాద్ శాసనసభ్యులు డాక్టర్ భూక్య మురళి నాయక్ మహబూబాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ గూగులోత్ జ్యోతి రమేష్ నాయక్ అదేవిధంగా ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నామని సంబంధిత నాయకులు పేర్కొన్నారు. గత పాలకులు నిర్లక్ష్యం చేసిన సమస్యలకు పరిష్కారం చూపుతూ, రానున్న రోజుల్లో 11వ వార్డును సస్యశ్యామలంగా, అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిన వార్డుగా తీర్చిదిద్దుతామని తెలిపారు. రైల్వే స్టేషన్ నుంచి నిజాం చెరువు వరకు సుమారు రూ.50 లక్షల వ్యయంతో సైడ్ డ్రైనేజీ కాలువ నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ పనుల ద్వారా ఆయా ప్రాంతాల్లో డ్రైనేజీ సమస్యలను పరిష్కరించి, ప్రజలకు మెరుగైన పారిశుద్ధ్య సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని వివరించారు. రైల్వే స్టేషన్ మదర్ తెరిస్స ప్రాంతం నుంచి సిగ్నల్ కాలనీకి ఆనుకుని ఉన్న రైల్వే గేట్ వరకు 66 ఫీట్ల వెడల్పుతో రహదారిని నిర్మించనున్నట్లు వెల్లడించారు. ఈ రహదారి నిర్మాణం పూర్తయితే స్థానిక ప్రజలకు రవాణా సౌకర్యాలు మెరుగుపడటంతో పాటు, భవిష్యత్తులో ఈ ప్రాంత అభివృద్ధికి మరింత ఊతం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఎంతోమంది విద్యార్థుల జీవితాలకు బంగారు బాటలు వేసి, ఇంజనీర్లు, డాక్టర్లు, ఐఏఎస్ అధికారులు, కలెక్టర్ల వంటి ఉన్నతస్థాయి వ్యక్తులను సమాజానికి అందించిన ఘనత మహబూబాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాలకు ఉందని పేర్కొన్నారు. ఒకప్పుడు ఎంతోమంది విద్యార్థుల భవిష్యత్తుకు పునాది వేసిన ఈ కళాశాల నేడు సరైన నిర్వహణ, అభివృద్ధి లేక శిథిలావస్థకు చేరుకోవడం బాధాకరమని అన్నారు.గతంలో అనేక ప్రభుత్వాలు అధికారంలోకి వచ్చినప్పటికీ, ఈ విద్యాసంస్థల అభివృద్ధిపై తగిన శ్రద్ధ చూపలేదని విమర్శించారు. ఈ పరిస్థితిని మార్చేందుకు ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ హైస్కూల్‌లను సుమారు రూ.30 కోట్ల వ్యయంతో ఆధునిక సదుపాయాలతో అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. మహిళలకు, పురుషులకు వేర్వేరుగా అవసరమైన సదుపాయాలు కల్పిస్తూ విద్యాసంస్థలను ఆధునిక హంగులతో తీర్చిదిద్దనున్నట్లు వివరించారు.గత పాలకులు ఎన్నికల సమయంలో ఓట్ల కోసం అభివృద్ధి పనులు చేపట్టినట్లు చూపించి ప్రజలను ఆకర్షించారే తప్ప, దీర్ఘకాలిక సమస్యల పరిష్కారంపై తగిన దృష్టి సారించలేదని విమర్శించారు. ప్రజలకు శాశ్వత ప్రయోజనం చేకూర్చే రహదారులు, డ్రైనేజీలు, విద్యాసంస్థల అభివృద్ధి వంటి మౌలిక సదుపాయాల కల్పనే నిజమైన అభివృద్ధికి నిదర్శనమని పేర్కొన్నారు. మహబూబాబాద్ పట్టణంలోని మొత్తం 36 వార్డులను సమగ్రంగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని తెలిపారు. ప్రతి వార్డులో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వాటికి ప్రాధాన్యత క్రమంలో పరిష్కారాలు చూపిస్తూ పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక వార్డు కౌన్సిలర్ బోడ రవి నాయక్, డి ఈ ఉపేందర్, మహబూబాబాద్ మండల అధ్యక్షులు బెల్లంకొండ శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ పలు వార్డుల కౌన్సిలర్లు, బొల్లు రాజు, మహమ్మద్ ఖలీల్, గాడిపెల్లి లావణ్య చరణ్ గౌడ్, నిమ్మల మాధవి శ్రీనివాస్, సాల్వాయి దిలీప్, అంబాల శివకుమార్, పట్టణ కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఎడ్ల రమేష్, తోట సుభాష్, గోనె శ్యాం కుమార్, గిరిధర్ గుప్త, నల్ల నరసింహారావు పట్టణ పలు వార్డుల నాయకులు కార్యకర్తలు పాత్రికేయ మిత్రులు తదితరులు పాల్గొన్నారు

విందు విలాస్ కిచెన్ అండ్ బాంక్వెట్ హాల్ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా కోలన్ హన్మంత్ రెడ్డి

కుత్బుల్లాపూర్ అక్టోబర్ 30 (లోకల్ గైడ్ ప్రతినిధి) : బాచుపల్లి రోడ్డులోని మల్లంపేట్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన 'విందు విలాస్ కిచెన్ అండ్ విందు' రెస్టారెంట్, బాంక్వెట్ హాల్ ప్రారంభోత్సవ కార్యక్రమం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కోలన్ హన్మంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వేణుగోపాల్ రెడ్డి తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.మల్లంపేట్, బాచుపల్లి రోడ్డులోని సిల్వర్ ఓక్స్ స్కూల్ పక్కన 1-17 చిరునామాలో ఏర్పాటు చేసిన ఈ రెస్టారెంట్‌లో వినియోగదారులకు డైన్-ఇన్, టేక్‌అవే, అవుట్‌డోర్ క్యాటరింగ్‌తో పాటు ప్రత్యేక బాంక్వెట్ హాల్ సదుపాయాలను అందుబాటులోకి తీసుకొచ్చారు.విందు విలాస్‌లో వెజ్, నాన్‌వెజ్ విభాగాల్లో విస్తృతమైన ఆహార పదార్థాలను అందిస్తున్నారు. చికెన్ 65, చికెన్ మెజెస్టిక్, మటన్ ఘీ రోస్ట్, అపోలో ఫిష్, చిల్లీ ప్రాన్స్ వంటి నాన్‌వెజ్ వంటకాలతో పాటు పనీర్ 65, వెజ్ మంచూరియన్, క్రిస్పీ కార్న్, మష్రూమ్ తదితర వెజిటేరియన్ వంటకాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి.ప్రారంభోత్సవం సందర్భంగా ప్రత్యేక ఆఫర్లు, డిస్కౌంట్లు కూడా ప్రకటించారు. నాణ్యమైన ఆహారాన్ని ఆహ్లాదకరమైన వాతావరణంలో అందించడమే తమ లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు. రెస్టారెంట్ ప్రారంభంతో మల్లంపేట్, బాచుపల్లి పరిసర ప్రాంతాల ప్రజలకు మరింత మెరుగైన భోజన సదుపాయం అందుబాటులోకి వచ్చినట్లయింది.

ఔషధ మొక్కల విశిష్టతను చాటిచెప్పిన 'ఘనం -- పి.వి. వనం' పుస్తకం

పుస్తకాన్ని ఆవిష్కరించిన గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా.. రచయిత్రి వాణీదేవికి అభినందనలు

కుత్బుల్లాపూర్ అక్టోబర్ 30 (లోకల్ గైడ్ (ప్రతినిధి) : ఔషధ మొక్కల ప్రాముఖ్యత, ప్రకృతి పరిరక్షణ, పర్యావరణ సమతుల్యత ఆవశ్యకతను తెలియజేసే 'ఘనం – – పి.వి. వనం' పుస్తకాన్ని తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా శుక్రవారం ఆవిష్కరించారు. తెలంగాణ శాసనమండలి సభ్యురాలు సురభి వాణీదేవి రచించిన ఈ పుస్తకావిష్కరణ కార్యక్రమం బేగంపేటలోని స్వామి రామానంద తీర్థ మెమోరియల్ ప్రాంగణంలో నిర్వహించారు. సురభి ఎడ్యుకేషనల్ సొసైటీ, స్వామి రామానంద తీర్థ మెమోరియల్ కమిటీ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశాయి. ఈ సందర్భంగా రచయిత్రి సురభి వాణీదేవి మాట్లాడుతూ, అభివృద్ధి పేరుతో ప్రకృతిని నాశనం చేయకుండా పర్యావరణ సమతుల్యతను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. భారతదేశంలో లభించే అరుదైన ఔషధ మొక్కల విశిష్టతను యువతకు పరిచయం చేయడంతో పాటు, మాజీ ప్రధాని పి.వి. నరసింహారావు దార్శనికత, ఔషధ వనాల స్ఫూర్తితో ఈ పుస్తకాన్ని రూపొందించినట్లు వివరించారు.మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ, తులసి వంటి అనేక మొక్కల్లో విలువైన ఔషధ గుణాలు ఉన్నాయని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించడం ద్వారా ప్రకృతి పరిరక్షణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా మాట్లాడుతూ, ఔషధ మొక్కలపై ప్రజల్లో అవగాహన పెంపొందించేలా పుస్తకాన్ని రచించిన వాణీదేవిని అభినందించారు. చెట్లను తొలగించాల్సిన పరిస్థితి ఏర్పడితే వాటి స్థానంలో కొత్త మొక్కలను నాటి సంరక్షించాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి పౌరుడి బాధ్యతగా గుర్తించాలని అన్నారు. అనంతరం మాజీ ప్రధాని పి.వి. నరసింహారావుకు నివాళులర్పించిన గవర్నర్, ప్రధానిగా ఆయన చేపట్టిన ఆర్థిక సంస్కరణలు, ప్రపంచీకరణ విధానాలు దేశ అభివృద్ధికి దోహదపడ్డాయని పేర్కొన్నారు. సమాచార సాంకేతిక పరిజ్ఞానం, మొబైల్ వినియోగ రంగాల్లో భారత్ సాధించిన పురోగతి దేశ అభివృద్ధికి నిదర్శనమని తెలిపారు.ఈ కార్యక్రమంలో శాసనమండలి ఉపసభాపతి డాక్టర్ బండ ప్రకాశ్, స్వామి రామానంద తీర్థ మెమోరియల్ కమిటీ కార్యదర్శి సురభి వాణీదేవి, ఎస్ ఆర్ టి శేరిని

అధ్యక్షుడు పి.వి. ప్రభాకర్ రావు తదితరులు పాల్గొన్నారు.

వీధి కుక్కల బెడదకు చెక్.. ఆమనగల్లులో ప్రత్యేక కార్యక్రమం ప్రారంభం!

బ్లూక్రాస్ సొసైటీతో మున్సిపాలిటీ ఒప్పందం..

తొలిరోజే 50 కుక్కలకు శస్త్రచికిత్సలు, రేబిస్ నివారణ టీకాలు

లోకల్ గైడ్ ఆమనగల్లు, అక్టోబర్ 30: ఆమనగల్లు పట్టణంలో వీధి కుక్కల సంఖ్యను నియంత్రించడంతో పాటు ప్రజల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ మున్సిపాలిటీ ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. వీధి కుక్కల సంతతి నియంత్రణ, రేబిస్ వ్యాధి నివారణ లక్ష్యంగా హైదరాబాద్‌కు చెందిన బ్లూక్రాస్ సొసైటీతో ఆమనగల్ మున్సిపాలిటీ అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. కేంద్ర జంతు సంక్షేమ మండలి మార్గదర్శకాలు, జంతు జనన నియంత్రణ నిబంధనలు--2023 ప్రకారం ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

తొలిరోజే 50 కుక్కలకు చికిత్సలు

కార్యక్రమంలో భాగంగా తొలిరోజు 5, 6, 12వ వార్డుల్లో 50 వీధి కుక్కలను పట్టుకుని ప్రత్యేక కేంద్రానికి తరలించారు. అక్కడ వాటికి సంతతి నియంత్రణ శస్త్రచికిత్సలతో పాటు రేబిస్ నివారణ టీకాలు వేయనున్నారు. రానున్న రోజుల్లో పట్టణంలోని అన్ని వార్డుల్లో ఈ కార్యక్రమాన్ని కొనసాగించనున్నట్లు అధికారులు తెలిపారు.

ప్రజల భద్రతకు ప్రాధాన్యత

వీధి కుక్కల సంతతిని శాస్త్రీయ పద్ధతుల్లో నియంత్రించడం, కుక్కల దాడులు, కాట్లను తగ్గించడం ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని అధికారులు పేర్కొన్నారు. ప్రతి కుక్కకు రేబిస్ నివారణ టీకాలు వేయడం ద్వారా ప్రాణాంతకమైన రేబిస్ వ్యాధి వ్యాప్తిని అరికట్టేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. అలాగే పాఠశాలలు, వార్డుల్లో కుక్కల కాటు నివారణ, పరిసరాల పరిశుభ్రత, వ్యర్థాల నిర్వహణపై ప్రజలకు అవగాహన కల్పించనున్నారు.

ప్రజలు సహకరించాలి

పట్టణంలోని అన్ని కాలనీల్లో ఈ కార్యక్రమం విజయవంతంగా అమలయ్యేందుకు ప్రజలు, కాలనీవాసులు మున్సిపల్ సిబ్బందికి, బ్లూక్రాస్ బృందానికి సహకరించాలని అధికారులు కోరారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎన్. పత్య నాయక్, కమిషనర్ ఎస్. రాఘువేందర్ రెడ్డి, బ్లూక్రాస్ ప్రతినిధి కుమారి, కౌన్సిలర్లు ఎం. వెంకయ్య, ఎన్. జగన్, మేనేజర్ ఆంజనేయులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రమేష్, సిబ్బంది రామకృష్ణ, మెహబూబ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ తెచ్చిన మార్పు ఇదే.. అన్ని రంగాలకు హాలిడే!

-పవర్ హాలిడే.. వాటర్ హాలిడే.. కన్ స్ట్రక్షన్ హాలిడే.. పాలనకూ హాలిడేనా?

-బిఆర్ఎస్ సీనియర్ నాయకులు పార్ నంది శ్రీకాంత్

సైబరాబాద్, అక్టోబర్ 30 (లోకల్ గైడ్ ప్రతినిధి కృష్ణ): కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తెలంగాణలో అభివృద్ధి కుంటుపడిందని, ప్రజలు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు పార్ నంది శ్రీకాంత్ తీవ్రస్థాయిలో విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన మార్పు ఇదేనంటూ ప్రభుత్వ పనితీరుపై ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో అభివృద్ధి, సంక్షేమం గురించి గొప్పగా చెప్పుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం ప్రస్తుతం ప్రజలకు కనీస అవసరాలు కూడా సక్రమంగా అందించలేని పరిస్థితి కల్పించిందని విమర్శించారు. రాష్ట్రంలో విద్యుత్ సరఫరా సమస్యలతో పవర్ హాలిడే, తాగునీటి సరఫరాలో అంతరాయాలతో వాటర్ హాలిడే, నిర్మాణ రంగంలో నెలకొన్న ఇబ్బందులతో కన్ స్ట్రక్షన్ హాలిడే ఏర్పడిందని ఎద్దేవా చేశారు. ప్రభుత్వ పాలన సైతం ప్రజలకు అందుబాటులో లేకుండా పోయిందని, సమస్యల పరిష్కారంలో పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని మండిపడ్డారు. అన్ని రంగాలలోను ఆటంకాలు ఎదురవుతుండటంతో ప్రజలు, వ్యాపారులు, నిర్మాణ రంగంపై ఆధారపడిన కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.పవర్ హాలిడే.. వాటర్ హాలిడే.. కన్ స్ట్రక్షన్ హాలిడే.. చివరకు పాలనకే పూర్తిగా హాలిడే ఇచ్చినట్లుగా కాంగ్రెస్ ప్రభుత్వ పరిస్థితి ఉందని శ్రీకాంత్ వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చి, మౌలిక సదుపాయాలను మెరుగుపరిచి, సమస్యలను పరిష్కరించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

స్వచ్ఛత ప్రతి ఒక్కరి బాధ్యత జిల్లా కలెక్టర్, ఎస్పీ

యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి భువనగిరి అక్టోబర్ 30 (లోకల్ గైడ్) : పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం భువనగిరి పట్టణంలోని చెరువు కట్టపై జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో శ్రమదానం ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి ఎస్పీ అక్షాంష్ యాదవ్ స్వయంగా చెత్త చెదారం ను తొలగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వచ్ఛత అనేది ప్రతి ఒక్కరి బాధ్యత అని పరిశుభ్రమైన వాతావరణమే ఆరోగ్యకరమైన సమాజానికి పునాది అని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ లక్ష్మీనారాయణ, డీఎస్పీలు, సిఐలు, మున్సిపల్ చైర్ పర్సన్ తగేళ్లపల్లి శ్రీవాణి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ అవైస్ ,విద్యార్థులు, పోలీసులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మియాపూర్ భూములు సర్కారువే!

-23 ఏళ్ల భూ వివాదానికి సుప్రీంకోర్టు తెర

-550 ఎకరాల 39 గుంటలపై ప్రైవేటు వ్యక్తుల అప్పీళ్లు కొట్టివేత

1912 నాటి సర్వే రికార్డులే కీలకం.. ప్రభుత్వ యాజమాన్యాన్ని సమర్థించిన ధర్మాసనం

-జాగీర్ వ్యవస్థ రద్దుతోనే ప్రభుత్వానికి భూములపై హక్కులు

హైదరాబాద్, అక్టోబర్ 30 (లోకల్ గైడ్ ప్రతినిధి కృష్ణ): హైదరాబాద్ నగర శివారులోని మియాపూర్ లోని అత్యంత విలువైన భూముల వివాదానికి ఎట్టకేలకు తెరపడింది. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం మియాపూర్ పరిధిలోని సర్వే నంబర్లు 100, 101లో ఉన్న 550 ఎకరాల 39 గుంటల భూములు తెలంగాణ ప్రభుత్వానివేనని సుప్రీంకోర్టు సంచలన తీర్పు వెలువరించింది. ఈ భూములపై యాజమాన్య హక్కులు తమవేనంటూ ప్రైవేటు వ్యక్తులు, వివిధ సంస్థలు దాఖలు చేసిన సివిల్ అప్పీళ్లను అత్యున్నత న్యాయస్థానం కొట్టివేసింది. దీంతో గత 23 ఏళ్లుగా సుప్రీంకోర్టులో కొనసాగుతున్న సుదీర్ఘ న్యాయపోరాటానికి ముగింపు లభించింది. వేల కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూముల యాజమాన్యంపై నెలకొన్న సందిగ్ధత తొలగిపోయింది."1912 నాటి సర్వే రికార్డులే కీలకం" మియాపూర్ లోని సర్వే నంబర్ 100లో 277 ఎకరాల 5 గుంటలు, సర్వే నంబర్ 101లో 273 ఎకరాల 34 గుంటలు ఉన్నాయి. మొత్తం 550 ఎకరాల 39 గుంటల విస్తీర్ణం కలిగిన ఈ భూములపై గతంలో పలువురు ప్రైవేటు వ్యక్తులు హక్కులు కోరుతూ న్యాయస్థానాలను ఆశ్రయించారు. అయితే 1912లో నిర్వహించిన భూ సర్వే రికార్డులు, సెత్వార్, క్లాసర్ రిజిస్టర్లలో ఈ భూములు 'సర్కారీ పోరంబోకు'గా నమోదై ఉన్నాయని సుప్రీంకోర్టు గుర్తించింది. అప్పటి నుంచే ప్రభుత్వ భూములుగా ఉన్నాయని చారిత్రక రెవెన్యూ రికార్డులు స్పష్టం చేస్తున్నాయని ధర్మాసనం పేర్కొంది."జాగీర్ వ్యవస్థ రద్దుతో ప్రభుత్వానికి హక్కులు" ఈ భూములకు సంబంధించి నిజాం పాలన కాలంలో పాయగా (పైగా) జాగీర్ వ్యవస్థకు సంబంధించిన అంశాలు కూడా విచారణలో ప్రస్తావనకు వచ్చాయి. జస్టిస్ రైలీ కమిషన్ నివేదిక సిఫారసుల ఆధారంగా మియాపూర్ గ్రామాన్ని రఫీ-ఉన్-నిసా బేగంకు పునరుద్ధరించినప్పటికీ, 1929 నాటి నిజాం ఫర్మాన్ ద్వారా లభించిన హక్కులు భూమిపై పూర్తి యాజమాన్య హక్కులు కావని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. జాగీర్ అనేది ప్రధానంగా భూములపై రెవెన్యూ వసూలు చేసుకునే హక్కులకు సంబంధించినదని, భూమిపై సంపూర్ణ యాజమాన్యాన్ని కల్పించదని వివరించింది. అంతేకాకుండా, 1949 ఆగస్టు 15 నుంచి అమల్లోకి వచ్చిన జాగీర్ రద్దు నిబంధనల ప్రకారం జాగీర్దార్లకు ఉన్న హక్కులు రద్దయ్యాయని పేర్కొంది. వారికి చట్ట ప్రకారం పరిహారం పొందే హక్కు మాత్రమే మిగిలిందని వివరించింది. "రెవెన్యూ రికార్డుల్లో అక్రమాలపై తీవ్ర వ్యాఖ్యలు" 1950ల నాటి పహాణీల్లో రఫీ-ఉన్-నిసా బేగం పేరుతో నమోదైన పట్టాదారు వివరాలు అసలైనవి కావని, రెవెన్యూ అధికారులతో కుమ్మక్కై తప్పుడు రికార్డులు సృష్టించినట్లు ధర్మాసనం తన తీర్పులో పేర్కొన్నట్లు వెల్లడైంది. కేవలం రెవెన్యూ రికార్డుల్లో పేరు నమోదైనంత మాత్రాన భూమిపై చట్టబద్ధమైన యాజమాన్య హక్కులు ఏర్పడవని స్పష్టం చేసింది. 1918లో వేలం ద్వారా భూములు కొనుగోలు చేశారనే వాదనను కూడా సుప్రీంకోర్టు పరిగణనలోకి తీసుకోలేదు. సంబంధిత పత్రాలు చట్టపరమైన నిరూపణకు అవసరమైన ప్రమాణాలను అందుకోలేదని పేర్కొంది. అదేవిధంగా, దీర్ఘకాలిక స్వాధీనం ఆధారంగా హక్కులు పొందామనే వాదనను కూడా తిరస్కరించింది."1997 ప్రత్యేక కోర్టు నుంచి 2026 సుప్రీంకోర్టు వరకు" ఈ భూములపై వివాదం మొదట ఏపీ భూ ఆక్రమణల నిరోధక చట్టం కింద ఏర్పాటైన ప్రత్యేక న్యాయస్థానానికి చేరింది. 1997 డిసెంబర్ 31న ప్రత్యేక కోర్టు ఈ భూములపై ప్రైవేటు వ్యక్తుల వాదనలను తిరస్కరించి, ప్రభుత్వ భూములుగా గుర్తించింది. అనంతరం ప్రైవేటు వ్యక్తులు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టును ఆశ్రయించారు. 2003 ఏప్రిల్ 16న హైకోర్టు ప్రత్యేక కోర్టు తీర్పును సమర్థిస్తూ వారి పిటిషన్లను కొట్టివేసింది. ఈ తీర్పును సవాలు చేస్తూ ప్రైవేటు వ్యక్తులు సుప్రీంకోర్టులో సుమారు 20 ప్రత్యేక అప్పీళ్లు దాఖలు చేశారు. అప్పటి నుంచి దాదాపు 23 ఏళ్ల పాటు ఈ కేసు అత్యున్నత న్యాయస్థానంలో కొనసాగింది."ఇద్దరు న్యాయమూర్తుల ధర్మాసనం కీలక తీర్పు" తాజాగా జస్టిస్ ఎం.ఎం. సుందరేశ్, జస్టిస్ సతీశ్ చంద్ర శర్మలతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం 44 పేజీల తుది తీర్పును వెలువరించింది. ప్రత్యేక కోర్టు, ఉమ్మడి హైకోర్టు ఇచ్చిన తీర్పుల్లో జోక్యం చేసుకోవాల్సిన అవసరం లేదని స్పష్టం చేస్తూ ప్రైవేటు వ్యక్తుల అప్పీళ్లను కొట్టివేసింది. విలువైన ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకునే ప్రయత్నాలపై ధర్మాసనం తీవ్రంగా స్పందించింది. ఈ తీర్పుతో మియాపూర్ లోని సర్వే నంబర్లు 100, 101 పరిధిలోని భూములపై ప్రభుత్వ యాజమాన్య హక్కులకు న్యాయపరమైన బలం చేకూరింది. హైదరాబాద్ నగర అభివృద్ధి, ప్రభుత్వ భూముల పరిరక్షణ, భవిష్యత్ మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించి ఈ తీర్పు ప్రాధాన్యత సంతరించుకుంది. దశాబ్దాలుగా వివాదంలో చిక్కుకున్న విలువైన భూములపై సుప్రీంకోర్టు ఇచ్చిన తుది తీర్పు భూ పరిరక్షణలో కీలక పరిణామంగా నిలిచింది.

సింగరేణికి హామీలే.. అభివృద్ధి శూన్యమే! కే. నరేంద్ర

ఎమ్మెల్యే రాందాస్ నాయక్‌పై సీపీఎం మండల కార్యదర్శి కే. నరేంద్ర తీవ్ర విమర్శలు.. సీతారామ ప్రాజెక్టు, పోడు భూములు, విద్యా--వైద్య సమస్యలపై నిలదీత

కారేపల్లి(సింగరేణి), అక్టోబర్ 30 (లోకల్ గైడ్ న్యూస్): కాంగ్రెస్ పాలనలో సింగరేణి మండల అభివృద్ధి శూన్యంగా మారిందని సీపీఎం సింగరేణి మండల కార్యదర్శి కే. నరేంద్ర తీవ్రంగా విమర్శించారు. మండలం అభివృద్ధి పథంలో దూసుకుపోతోందని వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ చెప్పుకోవడం వాస్తవ పరిస్థితులకు విరుద్ధమని అన్నారు. శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ మండలంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో పాలకులు విఫలమయ్యారని ఆరోపించారు.

ప్రాజెక్టు పేరుతో ప్రచారం.. రైతులకు దక్కని ప్రయోజనం

సీతారామ ప్రాజెక్టు ద్వారా రూ.100 కోట్లు మంజూరు చేయించి వైరా నియోజకవర్గానికి నీళ్లు తీసుకొచ్చామని ఎమ్మెల్యే చెబుతున్నారని నరేంద్ర పేర్కొన్నారు. అయితే సింగరేణి మండలంలో ప్రాజెక్టు కారణంగా గిరిజన, గిరిజనేతర పేదలు భూములు కోల్పోవడం తప్ప ఆశించిన ప్రయోజనం దక్కలేదని విమర్శించారు. భూములు కోల్పోయిన రైతులకు న్యాయమైన పరిహారం, పునరావాస ప్యాకేజీ అందించడంలో నిర్లక్ష్యం ఎందుకని ప్రశ్నించారు. ప్రాజెక్టు ద్వారా మండలంలోని రైతులకు సాగునీరు, ప్రజలకు తాగునీరు అందించేందుకు తీసుకున్న చర్యలేమిటో ఎమ్మెల్యే స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు.

విద్యారంగానికి పెద్దపీట ఎక్కడ?

41 గ్రామ పంచాయతీలు, సుమారు 100 గ్రామాలు, లక్ష జనాభా కలిగిన సింగరేణి మండలంలో విద్యారంగం పరిస్థితి అధ్వానంగా ఉందని నరేంద్ర అన్నారు. మండలానికి డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయడంతో పాటు బీసీ హాస్టల్ నిర్మించాలని డిమాండ్ చేశారు. కళాశాల హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మించడంతో పాటు మండల కేంద్రంలో ఎస్సీ, ఎస్టీ బాలుర, బాలికల వసతి గృహాలు ఏర్పాటు చేయాలని కోరారు. విద్యార్థుల భవిష్యత్తుకు కీలకమైన ఈ సమస్యలను పరిష్కరించడంలో ఎమ్మెల్యే ఎందుకు చొరవ చూపడం లేదని ప్రశ్నించారు.

వైద్య సేవల మెరుగుదలపై నిర్లక్ష్యం

మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌గా అప్‌గ్రేడ్ చేయాలని పలుమార్లు విజ్ఞప్తులు చేసినా ఫలితం లేకుండా పోయిందని నరేంద్ర విమర్శించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. మండలంలో వైద్య సదుపాయాలను బలోపేతం చేయాల్సిన అవసరం ఉన్నప్పటికీ పాలకులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఎర్రబోడు ప్లాంటేషన్ రైతులకు భూములు ఇప్పిస్తామని ఇచ్చిన హామీని ఇప్పటికైనా అమలు చేయాలని డిమాండ్ చేశారు.

పోడు రైతులకు హక్కులేవి?

పోడు భూముల్లో మొక్కలు నాటుకుంటున్న రైతులపై కేసులు నమోదు చేయడం ఏమిటని నరేంద్ర ప్రశ్నించారు. పోడు భూములకు హక్కు పత్రాలు, విద్యుత్ సౌకర్యం, సాగునీటి బోర్లు కల్పించాలని సీపీఎం పార్టీ గతంలో అనేక పోరాటాలు నిర్వహించిందని గుర్తుచేశారు. ఈ పోరాటాల సందర్భంగా పార్టీ నాయకులు, పోడు సాగుదారులపై కేసులు నమోదయ్యాయని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత పోడు భూముల రక్షణకు, సాగుదారులకు హక్కు పత్రాలు అందించేందుకు ఆశించిన స్థాయిలో కృషి జరగలేదని విమర్శించారు. పోడు రైతుల సమస్యలను తక్షణమే పరిష్కరించి వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

అభివృద్ధి ప్రణాళికను బహిర్గతం చేయాలి

సింగరేణి మండల సమగ్ర అభివృద్ధికి ప్రణాళిక రూపొందించామని చెబుతున్న ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ ఆ ప్రణాళికను ప్రజల ముందుంచాలని నరేంద్ర డిమాండ్ చేశారు. ప్రకటనలు, హామీలకే పరిమితం కాకుండా ప్రజల సమస్యల పరిష్కారానికి కార్యాచరణ చేపట్టాలని సూచించారు. మండలంలో విద్య, వైద్యం, సాగునీరు, తాగునీరు, గిరిజనుల భూముల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. ఎమ్మెల్యేగా మిగిలిన పదవీకాలాన్ని, అధికార పార్టీ శాసనసభ్యుడిగా ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని సింగరేణి మండల అభివృద్ధికి ప్రత్యేక చొరవ చూపాలని నరేంద్ర కోరారు. ప్రజల అవసరాలను గుర్తించి పెండింగ్ సమస్యలను పరిష్కరించినప్పుడే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుందని ఆయన పేర్కొన్నారు.

భూగర్భ జలాల వినియోగంపై ప్రభుత్వ నియంత్రణ

-నవంబర్ 1 నుంచి కొత్త బోర్ల తవ్వకాలకు ఎన్వోసీ తప్పనిసరి

-పరిశ్రమలు, వాణిజ్య సంస్థలకు యూజర్ చార్జీలు

-పాత బోర్లను రెగ్యులరైజ్ చేసుకోవాల్సిందే

హైదరాబాద్, అక్టోబర్ 30 (లోకల్ గైడ్ ప్రతినిధి కృష్ణ): రానున్న రోజుల్లో ఎల్‌నినో ప్రభావంతో నీటి ఎద్దడి ఏర్పడే అవకాశాల నేపథ్యంలో భూగర్భ జలాల పరిరక్షణపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. భూగర్భ జలాలను విచ్చలవిడిగా వినియోగించడాన్ని నియంత్రించడంతో పాటు, వాటి దుర్వినియోగాన్ని అరికట్టేందుకు కొత్త నిబంధనలను అమలు చేయాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా ఇప్పటికే అమల్లో ఉన్న వాల్టా చట్టంతో పాటు జీవో 15 నిబంధనలను పకడ్బందీగా అమలు చేయాలని సంబంధిత శాఖలకు ఆదేశాలు జారీ చేసింది."కొత్త బోర్లకు ఎన్వోసీ తప్పనిసరి" గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో తాగునీటి అవసరాలకు మినహా ఇతర అవసరాల కోసం బోర్లు తవ్వడంపై నవంబర్ 1 నుంచి నిషేధం అమల్లోకి రానుంది. జీహెచ్ఎంసీ పరిధిలో తాగునీటి బోర్లతో పాటు ఇతర ప్రాంతాల్లో కొత్తగా బోర్లు వేయాలంటే గ్రౌండ్ వాటర్ శాఖ నుంచి నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ (ఎన్వోసీ) తప్పనిసరిగా తీసుకోవాలి. వ్యవసాయం, గృహ అవసరాలు, వ్యాపార, వాణిజ్య సంస్థలు, వాటర్ ప్లాంట్లు, పరిశ్రమలు, గనుల తవ్వకాలు సహా అన్ని రంగాలకు ఈ నిబంధన వర్తించనుంది. నిర్ణీత రూ.10 వేల ఫీజు చెల్లిస్తే నిబంధనల ప్రకారం అధికారులు ఎన్వోసీ జారీ చేయనున్నారు. ఇప్పటికే అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన బోర్లను రెగ్యులరైజ్ చేసుకోవాలని, గడువు ముగిసిన ఎన్వోసీలను పునరుద్ధరించుకోవాలని ప్రభుత్వం సూచించింది. "నీటి వినియోగానికి యూజర్ చార్జీలు" భూగర్భ జలాలను అధికంగా వినియోగించే పరిశ్రమలు, వాణిజ్య సంస్థలపై యూజర్ చార్జీలు విధించనున్నారు. ఇటుక బట్టీలు, రెడీమిక్స్ కాంక్రీట్ ప్లాంట్లు, మినరల్ వాటర్, డిస్టిల్డ్ వాటర్ ప్లాంట్లు, గోలిసోడా, ఐస్ తయారీ యూనిట్లు, ఐస్‌క్రీమ్ కంపెనీలు, ఆటోమొబైల్ సర్వీసింగ్ కేంద్రాలు, హోటళ్లు, రెస్టారెంట్లు, అపార్ట్‌మెంట్లు, స్విమ్మింగ్ పూల్స్, పాఠశాలలు, కళాశాలలు, ఆస్పత్రులు తదితర సంస్థలు ఈ చార్జీలు చెల్లించాల్సి ఉంటుంది. నీటి వినియోగాన్ని కచ్చితంగా లెక్కించేందుకు డిజిటల్ ఫ్లో మీటర్లు ఏర్పాటు చేసుకోవాలి. మౌలిక సదుపాయాల రంగానికి చెందిన సంస్థల నుంచి ప్రతి వెయ్యి లీటర్లకు రూపాయి చొప్పున వసూలు చేస్తున్నారు. "ప్రాంతాన్ని బట్టి టారిఫ్‌లు.. మినహాయింపులు" పరిశ్రమలు రోజువారీగా వెలికితీసే నీటి పరిమాణం, భూగర్భ జలాల లభ్యత ఆధారంగా యూజర్ చార్జీలు నిర్ణయించనున్నారు. సాధారణ పరిశ్రమలకు సురక్షిత ప్రాంతాల్లో కిలోలీటర్‌కు రూ.2 నుంచి రూ.10 వరకు, ఓవర్ ఎక్స్‌ప్లాయిటెడ్ ప్రాంతాల్లో రూ.20 నుంచి రూ.100 వరకు టారిఫ్‌లు విధిస్తున్నారు. ఇందుకు సంబంధించి గ్రౌండ్ వాటర్ శాఖ అధికారులు సంస్థలకు నోటీసులు జారీ చేస్తున్నారు. సింగరేణి బొగ్గు గనులు, సిమెంట్ పరిశ్రమలకు సంబంధించిన సున్నపురాయి గనులు ఎన్వోసీలు తీసుకొని యూజర్ చార్జీలు చెల్లిస్తున్నాయి. గ్రానైట్, స్టోన్ మైన్స్‌ను కూడా ఈ పరిధిలోకి తీసుకురావాలనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో వ్యక్తిగత వినియోగదారులు, వ్యవసాయ కార్యకలాపాలు, పాడి పరిశ్రమలు, గ్రామీణ మంచినీటి సరఫరా పథకాలు, సాయుధ దళాలకు చెందిన సంస్థలకు యూజర్ చార్జీల నుంచి మినహాయింపు కల్పించారు. పట్టణ ప్రాంతాల్లోని నివాస అపార్ట్‌మెంట్లు, గ్రూప్ హౌసింగ్ సొసైటీలకు నెలవారీ మీటర్ రీడింగ్ ఆధారంగా చార్జీలు విధించనున్నారు. ఇంకుడు గుంతలు వంటి భూగర్భ జలాల పునరుద్ధరణ నిర్మాణాలు చేపట్టిన వారికి యూజర్ చార్జీల్లో 50 శాతం రాయితీ కల్పించనున్నారు."డ్రిల్లింగ్ రిగ్గులపైనా ఆంక్షలు" కొత్త పరిశ్రమలు, సంస్థలకు అనుమతులు ఇచ్చే సమయంలో గ్రౌండ్ వాటర్ ఎన్వోసీని పరిశీలించాలని ప్రభుత్వం సంబంధిత శాఖలను ఆదేశించింది. బోర్లు తవ్వేందుకు రిజిస్ట్రేషన్ కలిగిన డ్రిల్లింగ్ రిగ్గులను మాత్రమే వినియోగించాలని స్పష్టం చేసింది. రిజిస్ట్రేషన్ లేని రిగ్గులను సీజ్ చేస్తామని హెచ్చరించింది. భూగర్భ జలాల వినియోగాన్ని క్రమబద్ధీకరించడం, నీటి వృథాను అరికట్టడం, భవిష్యత్ తరాలకు నీటి వనరులను అందుబాటులో ఉంచడమే ఈ నిబంధనల ప్రధాన ఉద్దేశమని అధికారులు పేర్కొంటున్నారు.

ఆమనగల్లు మున్సిపల్ ఆస్తుల పరిరక్షణకు ఆధునిక సాంకేతిక సర్వే

డీజీపీఎస్ సర్వే, జీఐఎస్ మ్యాపింగ్ ప్రారంభం

-- కమిషనర్ ఎస్. రాఘువేందర్ రెడ్డి

లోకల్ గైడ్ -- ఆమనగల్లు అక్టోబర్ 30: మున్సిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ ఆస్తులను గుర్తించి, వాటి పరిరక్షణకు పటిష్ట చర్యలు తీసుకునే లక్ష్యంతో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో సమగ్ర సర్వే చేపడుతున్నట్లు ఆమనగల్లు మున్సిపల్ కమిషనర్ ఎస్. రాఘువేందర్ రెడ్డి తెలిపారు. పురపాలక పరిపాలన శాఖ సంచాలకుల ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తున్న మున్సిపల్ ఆస్తుల నిర్వహణ ప్రాజెక్టులో భాగంగా ఆమనగల్లు మున్సిపాలిటీలో డీజీపీఎస్ సర్వే, జీఐఎస్ మ్యాపింగ్, డిజిటలీకరణ, ఆస్తుల విలువల నిర్ధారణ ప్రక్రియను ప్రారంభించినట్లు వెల్లడించారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని ఖాళీ స్థలాలు, మున్సిపల్ కార్యాలయాలు, భవనాలు, లేఅవుట్లలోని ఖాళీ ప్రదేశాలు, పార్కులు, క్రీడా మైదానాలు, నీటి సరఫరా వ్యవస్థలు, ఇతర మౌలిక వసతులకు సంబంధించిన పూర్తి వివరాలను ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో సేకరించి నమోదు చేయనున్నట్లు పేర్కొన్నారు.ఈ సర్వే ద్వారా మున్సిపల్ ఆస్తుల వివరాలు స్పష్టంగా అందుబాటులోకి రావడంతో పాటు ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణకు, ఆక్రమణల నివారణకు ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. పురపాలక పరిపాలనలో పారదర్శకత, జవాబుదారీతనం మరింత పెరుగుతాయని అన్నారు.పట్టణ ప్రణాళిక అధికారి ఎం. వికాస్ ఆధ్వర్యంలో సాంకేతిక సలహా సంస్థ బృందంతో కలిసి మున్సిపల్ సిబ్బంది రామకృష్ణ, సాయిరామ్, సికిందర్, సుభాష్ సర్వే, వివరాల నమోదు ప్రక్రియలో పాల్గొంటారని తెలిపారు. క్షేత్రస్థాయి పరిశీలనకు వచ్చే సర్వే బృందాలకు ఆమనగల్లు పట్టణ ప్రజలు, కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు పూర్తి సహకారం అందించి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కమిషనర్ ఎస్. రాఘువేందర్ రెడ్డి కోరారు.

RNI NO. APBIL/2013/50718 LOCAL GUIDE Bi-Lingual Daily Published From Rangareddy

లోకల్ గైడ్ ద్విభాషా దినపత్రిక

అపర్ణ హిల్ పార్క్ రోడ్డులో పారిశుధ్య పనుల తనిఖీ

దీప్తి శ్రీనగర్ వార్డులో వన్ డే వన్ వార్డ్ కార్యక్రమం..

ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులకు ఆదేశాలు

సైబరాబాద్, అక్టోబర్ 30 (లోకల్ గైడ్ ప్రతినిధి కృష్ణ): నగరంలో పారిశుధ్య నిర్వహణను మెరుగుపరచడంతో పాటు ప్రజా సమస్యలను క్షేత్రస్థాయిలో పరిష్కరించడమే లక్ష్యంగా శుక్రవారం అపర్ణ హిల్ పార్క్ రోడ్డులో పారిశుధ్య పనులను అధికారులు తనిఖీ చేశారు. రహదారుల పరిశుభ్రత, పరిసరాల నిర్వహణ, పారిశుధ్య సిబ్బంది పనితీరును పరిశీలించి అవసరమైన సూచనలు చేశారు. అనంతరం కెవిఎస్ఆర్ ఎన్‌క్లేవ్‌లో వన్ డే వన్ వార్డ్ (ఓడిఓడబ్ల్యూ) కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (ఆర్డబ్ల్యూఏ) ప్రతినిధులతో పాటు ఏయే, డివై ఏఈఈ, విఓ, యుబిడి మేనేజర్, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానికంగా నెలకొన్న సమస్యలు, పారిశుధ్య నిర్వహణ, మౌలిక సదుపాయాల అభివృద్ధి తదితర అంశాలపై చర్చించారు. అలాగే దీప్తి శ్రీనగర్ వార్డులో ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను, వివిధ అభివృద్ధి పనుల ప్రస్తుత పురోగతిని సమీక్షించారు. క్షేత్రస్థాయిలో గుర్తించిన సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని, పెండింగ్‌లో ఉన్న పనులను నిర్దేశిత సమయంలో పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రజలకు మెరుగైన పారిశుధ్య సేవలు, నాణ్యమైన మౌలిక సదుపాయాలు అందించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రజల భాగస్వామ్యంతో వార్డుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు.

ఫారం పాండ్ ల నిర్మాణంతో రైతులకు బహుళ ప్రయోజనాలు కలెక్టర్: అనురాగ్ జయంతి

యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి ఆలేరు అక్టోబర్ 30 (లోకల్ గైడ్) : ఆలేరు మండలం మందనపల్లి గ్రామం లో వి బి జి రామ్ జి పథకం తో నిర్మిస్తున్న ఫామ్ పాండ్ పనులను జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి పరిశీలించారు. అక్కడ పని చేస్తున్న కూలీలతో కలెక్టర్ నేరుగా మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో నీటి సంరక్షణతో పాటు రైతుల ఆదాయ వృద్ధికి దోహదపడే మునగ తోటల పెంపకం, ఫా-పాండ్ల నిర్మాణం, ప్రతి ఇంటికి ఇంకుడు గుంతలు, బోర్‌వెల్ రీఛార్జ్ నిర్మాణాలు, పశువుల షెడ్లు, పశువులకు నీటి తొట్లు,కమ్యూనిటీ ఇంకుడు గుంతలు వంటి పనులను విస్తృతంగా చేపట్టాలని సూచించారు. కూలీలకు నిబంధనల ప్రకారం రోజుకు రూ.308 కూలి లభించే విధంగా పనులు చేపట్టాలని తెలిపారు. గ్రామాల్లోని చెరువుల్లో పూడికతీత పనులు చేపట్టి నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచడం ద్వారా భూగర్భ జలాల అభివృద్ధికి, వ్యవసాయ అవసరాలకు నీటి లభ్యత మెరుగుపడుతుందని వివరించారు. ఈ తరహా పనులను అన్ని గ్రామపంచాయతీలలో ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఓ నాగిరెడ్డి ఎంపిడిఓ , ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

రామారావు హత్య కేసులో న్యాయం ఏదీ

భట్టి రాజీనామా చేయాలి.. సీపీని బదిలీ చేయాలి

కే. నరేంద్ర, కొండబోయిన నాగేశ్వరరావు

కారేపల్లి, అక్టోబర్ 30 (లోకల్ గైడ్ న్యూస్): సీపీఎం సీనియర్ నాయకుడు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, పాతర్లపాడు మాజీ సర్పంచ్ కామ్రేడ్ సామినేని రామారావు హత్య కేసులో అసలైన నిందితులను గుర్తించి కఠినంగా శిక్షించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. కేసు విచారణ తీరును నిరసిస్తూ సీపీఎం సింగరేణి మండల కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఖమ్మం పోలీస్ కమిషనర్ దిష్టిబొమ్మలను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కొండబోయిన నాగేశ్వరరావు మాట్లాడుతూ.. సామినేని రామారావు హత్య కేసులో పోలీసులు నిష్పక్షపాతంగా విచారణ జరిపి అసలైన నిందితులను వెలుగులోకి తీసుకురావాలని కోరారు. కేసుతో సంబంధం లేని వారిని అరెస్టు చేస్తూ, దర్యాప్తును పక్కదారి పట్టిస్తున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయని ఆరోపించారు. ఈ కేసుపై ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)తో సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. హత్య జరిగి ఏడాది కావస్తున్నా కేసులో వాస్తవాలు వెలుగులోకి రాకపోవడం ఆందోళన కలిగిస్తోందని అన్నారు. పోలీసుల దర్యాప్తు తీరుపై ప్రజల్లో అనుమానాలు నెలకొన్నాయని, అందువల్ల ఖమ్మం పోలీస్ కమిషనర్‌ను వెంటనే బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. అధికారాన్ని అడ్డుపెట్టుకొని చట్టాన్ని దుర్వినియోగం చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని విమర్శించారు. సామినేని రామారావు హత్య కేసులో నిష్పక్షపాత విచారణ జరిపించి అసలైన నిందితులను గుర్తించాలని, వారికి కఠిన శిక్షలు విధించేలా చర్యలు తీసుకోవాలని నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. ఈ వ్యవహారంపై నైతిక బాధ్యత వహిస్తూ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క రాజీనామా చేయాలని కోరారు. తమ డిమాండ్లను ప్రభుత్వం పట్టించుకోకపోతే ఆందోళనలను మరింత ఉధృతం చేసి కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని ప్రజల్లో ఎండగడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమానికి సీపీఎం సింగరేణి మండల కార్యదర్శి కే. నరేంద్ర అధ్యక్షత వహించగా, పార్టీ సీనియర్ నాయకుడు ముక్క సీతారాములు, కార్యదర్శివర్గ సభ్యుడు రేకల మంగయ్య, మండల కమిటీ సభ్యులు ముండ్ల ఏకాంబరం, శ్రీరాములు, తిరపయ్య, సైదులు, కోటయ్య, సంపత్, మంద శ్రీను, తగర బాబు తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీకి తరలిన కాంగ్రెస్ శ్రేణులు...

మంచిర్యాల జిల్లా ప్రతినిధి (లోకల్ గైడ్) : ఓటు చోరీకి వ్యతిరేకంగా ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం లోక్‌సభ ప్రతిపక్ష నాయకులు రాహుల్ గాంధీ పిలుపు మేరకు నవంబర్1న న్యూఢిల్లీ లోని రామ్‌లీలా మైదానంలో నిర్వహించనున్న భారీ నిరసన ర్యాలీలో పాల్గొనేందుకు ఎమ్మెల్యే గడ్డం వినోద్ పిలుపుమేరకు నియోజకవర్గంలోని పలువురు సీనియర్ కాంగ్రెస్ నాయకులు శుక్రవారం ఢిల్లీకి తరలివెళ్లారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతు ఓటు చోరీకి వ్యతిరేకంగా ఎన్నికల సంఘంలో జరుగుతున్న అక్రమాలకు బాధ్యత వహిస్తు ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి,టీపీసీసీ అధ్యక్షులు,ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ నాయకత్వంలో నిర్వహించనున్న ఈ నిరసన ర్యాలీలో పాల్గొనేందుకు బెల్లంపల్లి నియోజకవర్గంలోని 7మండలాల కాంగ్రెస్ అధ్యక్షులు,నాయకులు,కార్యకర్తలు,ప్రజాప్రతినిధులు నాయకులు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు.దేశ చరిత్రలో కనీవినీ ఎరుగని రీతిలో నిర్వహించనున్న ఈ భారీ ర్యాలీ ద్వారా ఓటు హక్కు పరిరక్షణ,రాజ్యాంగ విలువల సంరక్షణ,ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కాంగ్రెస్ తన గళాన్ని బలంగా వినిపించనుందని అన్నారు.ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని,ప్రతి పౌరుడి ఓటు హక్కును కాపాడుకోవడం మనందరి బాధ్యత అని,రాజ్యాంగాన్ని,ప్రజాస్వామ్య వ్యవస్థను పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరు ముందుకు రావాలని పేర్కొన్నారు.ఓటు హక్కును కాపాడుకుందాం,రాజ్యాంగాన్ని పరిరక్షించుకుందాం,ప్రజాస్వామ్య విలువలను నిలబెడదాం అని పిలుపునిచ్చారు.

అధికారుల నిర్లక్ష్యానికి ఆర్టీసీ డ్రైవర్ బలి...

విధులు నిర్వర్తించలేనని చెప్పిన ఒత్తిడి చేసిన అధికారులు...

డ్రైవర్ శ్రీనివాస్ మృతికి బాధ్యులు ఎవరు....

మంచిర్యాల జిల్లా ప్రతినిధి (లోకల్ గైడ్) : ఆర్టీసీ ఉద్యోగులపై పని ఒత్తిడి పెరుగుతోందా సిబ్బంది ఇబ్బందులను అధికారులు పట్టించుకోవడం లేదా,విధులు నిర్వహించలేని పరిస్థితిలో ఉన్నానని చెప్పినా వినిపించుకోకుండా విధులకు పంపడంతో ఘోర రోడ్డు ప్రమాదంలో ఆర్టీసీ డ్రైవర్ శ్రీనివాస్ మృతి చెందారని ఆయన కుటుంబ సభ్యులు ఆరోపించారు.ఒక కుటుంబానికి ఆధారంగా నిలిచిన వ్యక్తి అకాల మరణంతో ఆ కుటుంబం దిక్కుతోచని స్థితిలో పడితే,మరోవైపు విధుల నిర్వహణలో అధికారుల బాధ్యతపై చర్చ మొదలైంది.డ్రైవర్ శ్రీనివాస్ విధులు నిర్వహించలేనని ముందుగానే అధికారులకు తెలిపినప్పటికీ,విధులకు హాజరు కావాలంటు అధికారులు ఒత్తిడి తెచ్చినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.ఈ ఆరోపణల్లో వాస్తవమెంత ఆయన నిజంగానే విధులు నిర్వహించలేని పరిస్థితిలో ఉన్నారా ఆయన అభ్యర్థనను అధికారులు పరిగణనలోకి తీసుకున్నారా,తీసుకోకపోతే అందుకు కారణాలేమిటి అనే అంశాలపై సంబంధిత ఆర్టీసీ ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరపాల్సిన అవసరం ఉంది.ప్రజల ప్రాణాలను కాపాడాల్సిన బాధ్యత కలిగిన ఆర్టీసీ డ్రైవర్లు బస్సులు నడిపే సమయంలో శారీరకంగా,మానసికంగా ఆరోగ్యంగా ఉండటం అత్యంత కీలకం.సంబందిత అధికారులు డ్రైవర్ పరిస్థితిని అంచనా వేయకుండా విధులకు పంపితే ప్రయాణికులతో పాటు రహదారిపై ప్రయాణించే ఇతరుల భద్రత కూడా ప్రమాదంలో పడే అవకాశం ఉందనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.విధుల కేటాయింపులో అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.ఈనెల 27న అర్ధరాత్రి సిద్దిపేట వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మంచిర్యాల డిపోకు చెందిన ఆర్టీసీ డ్రైవర్ శ్రీనివాస్ మృతి చెందడం ఆయన కుటుంబంలో తీవ్ర విషాదాన్ని నింపింది.అయితే ఈ ప్రమాదానికి దారితీసిన ఖచ్చితమైన కారణాలేమిటన్నది అధికారిక విచారణలో తేలాల్సి ఉంది.విధుల ఒత్తిడి,డ్రైవర్ ఆరోగ్య పరిస్థితి,పని గంటలు విశ్రాంతి సమయం,ప్రమాదానికి దారితీసిన ఇతర పరిస్థితులను సమగ్రంగా పరిశీలించాల్సిన అవసరం ఉంది.అయితే శ్రీనివాస్ ముందుగానే తన ఇబ్బందులను అధికారుల దృష్టికి తీసుకెళ్లి ఉంటే,ఆ విషయాన్ని నిర్ధారించే విధంగా విధుల రికార్డులు,సంబంధిత సమాచారాన్ని పరిశీలించాలి.ఆయన అభ్యర్థనను పట్టించుకోలేదనే ఆరోపణలు నిజమని తేలితే బాధ్యులపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.వయసు రిత్యా తనకు రాత్రివేళ డ్రైవింగ్ వీధుల్లో ఇబ్బందులు తలెత్తుతున్నాయని తెలియజేసినప్పటికీ సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారనే ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి.

విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలి...

ఈ ఘటనపై ఆర్టీసీ ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను ప్రజల ముందుంచాల్సిన అవసరం ఉంది. డ్రైవర్ శ్రీనివాస్ విధుల కేటాయింపు వివరాలు,పని గంటలు,విశ్రాంతి సమయం,ఆయన చేసిన అభ్యర్థనలు,ప్రమాదానికి దారితీసిన పరిస్థితులపై సంబంధిత అధికారులు స్పష్టత ఇవ్వాలి.విధుల నిర్వహణలో ఏవైనా నిబంధనల ఉల్లంఘనలు జరిగాయా,అధికారుల నిర్లక్ష్యం ఏమైనా ఉందా అనే అంశాలను నిష్పక్షపాతంగా పరిశీలించాలి.ఉద్యోగులపై పని ఒత్తిడి పెంచడం కంటే వారి ఇబ్బందులను అర్థం చేసుకొని,భద్రతకు ప్రాధాన్యం ఇవ్వడం అధికారుల బాధ్యత.ఒక డ్రైవర్ ప్రాణం కోల్పోయిన తర్వాత విచారం వ్యక్తం చేయడం మాత్రమే కాకుండా,ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలి.విధుల కేటాయింపులో పారదర్శకత,తగిన విశ్రాంతి,ఆరోగ్య పరిస్థితుల పరిశీలనకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆర్టీసీ కార్మికులు కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు. డ్రైవర్ శ్రీనివాస్ మృతికి దారి తీసిన పరిస్థితులు నిజ నిజాలు వెలుగులోకి రావాలని అంతేకాకుండా అధికారులపై వచ్చిన ఆరోపణలు నిజమని తేలితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.బాధిత కుటుంబానికి యాజమాన్యం న్యాయం చేయాలని,కార్మికులపై ఒత్తిడి పెంచే విధానానికి స్వస్తి పలికి,సిబ్బంది భద్రతకు పటష్టమైన చర్యలు చేపట్టాలని ఆర్టీసీ కార్మికులు డిమాండ్ చేస్తున్నారు.

అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు...

రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

రాష్ట్రంలో 8 లక్షల ఇందిరమ్మ ఇళ్లకు 40 వేల కోట్ల రూపాయల ఖర్చు

రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పట్టాల పంపిణీ చేసిన మంత్రి

ఖమ్మం, అక్టోబర్- 30: లోకల్ గైడ్: రాష్ట్రంలో అర్హులైన ప్రతి పేదవారికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. శుక్రవారం మంత్రి, జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తో కలిసి ఏదులాపురం మునిసిపాలిటీ పరిధిలోని పీవిఆర్ గార్డెన్స్ లో ఏదులాపురం మునిసిపాలిటీ లోని 176 మంది లబ్ధిదారులకు రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ప్రజా ప్రభుత్వం వచ్చిన తర్వాత పేదవారి ఒక స్లాబ్ ఇళ్లలో ఉండాలనే కల, ఆశ ఏదైతే ఉందో అది నెరవేర్చాలనే తపనతో ప్రజా ప్రభుత్వం కృషి చేస్తున్నదని తెలిపారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మొదటి విడతలో 4.5 లక్షల ఇళ్లు, రెండో విడతలో 2.5 లక్షల ఇళ్లు ఇవ్వడం జరిగిందని, హైదరాబాద్ క్యూర్ ప్రాంతంలో మరో లక్ష ఇళ్లు, ఇవన్నీ కలిపి ఈ రెండు విడతల్లో రాష్ట్రవ్యాప్తంగా 8 లక్షల ఇళ్లు 40 వేల కోట్ల రూపాయలతో కట్టే కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం జరిగిందని అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం వంద శాతం పేదోళ్ల మనసును దోచిన, మెచ్చినదని, అర్హులైన ప్రతి పేదవాడికి కులం, మతం, పార్టీ అని చూడకుండా, పూర్తిగా పేదల సంక్షేమమే ధ్యేయంగా అమలు చేయబడుతోందని మంత్రి స్పష్టం చేశారు. సుప్రీంకోర్టు లో మియాపూర్ కు సంబంధించి 560 ఎకరాల భూమి వివాదంలో ప్రయివేటు వ్యక్తులకు అప్పటి ప్రభుత్వం కట్టబెట్టాలని చూస్తే, అప్పుటి పార్లమెంట్ సభ్యుడిగా, ఇప్పుడు ముఖ్యమంత్రిగా ఉన్న రేవంత్ రెడ్డి సుప్రీంకోర్టులో న్యాయమైన వాదనలు పెట్టి ఆ కేసు గెలిచామని తెలిపారు. ప్రతి ఆడబిడ్డకు రూ. 5 లక్షల చొప్పున ఇందిరమ్మ ఇళ్లు కట్టిస్తామని తెలిపారు. ప్రతిపక్షాలు ఎన్ని గావు కేకలు పెట్టినా, ఎన్ని పొర్లు దండాలు పెట్టినా, ఎన్ని క్షుద్ర పూజలు చేసినా ప్రజా ప్రభుత్వం మళ్లీ ప్రజల దీవెనలతో అధికారంలోకి వస్తుందని మంత్రి అన్నారు.కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ, ఏదులాపురం మునిసిపాలిటీ కి మొదటి విడతలో దాదాపు 467 ఇళ్లు మంజూరు కాగా, ఇందులో దాదాపు 400 వరకు ఇళ్లు నిర్మాణం పూర్తై లబ్దిదారులకు అందుబాటులోకి వచ్చాయన్నారు. మరో 45 ఇళ్లు మాత్రమే వివిధ దశలలో నిర్మాణంలో ఉన్నాయని, కొన్ని నెలల క్రితం శాంక్షన్ వచ్చిన 18 మంది లబ్దదారులు కూడా వేగంగా ఇళ్ల నిర్మాణం చేపడుతున్నారని తెలిపారు. లబ్దదారులకు ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు లేకుండా, అత్యంత పారదర్శకంగా ఎంపిక చేయడం జరిగిందని అన్నారు. ఇండ్ల నిర్మాణం స్టేజి పూర్తి కాగానే ఫోటోలు తీసుకుని, కేవలం వారం పది రోజుల్లోనే బిల్లులు చెల్లించడం వల్ల లబ్ధదారులు ఎంతో త్వరగా ఇళ్లను నిర్మించుకోగలిగారన్నారు. మొదటి విడత విజయవంతమైన నేపథ్యంలో, ఇప్పుడు రెండో విడత కింద 176 ఇళ్లను లబ్దదారులకు అందజేస్తున్నామని కలెక్టర్ తెలిపారు. ఈ రెండో విడత ఇళ్ల నిర్మాణాలను కూడా అతి త్వరగా పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో హౌజింగ్ పిడి భూక్యా శ్రీనివాస్, ఏదులాపురం మునిసిపల్ చైర్ పర్సన్ పోకబత్తిని అనిత, వైస్ చైర్మన్ తమ్మినేని నవీన్, మున్సిపల్ కమిషనర్ ఆళ్ల శ్రీనివాస రెడ్డి, కౌన్సిలర్లు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

కళా ప్రతిభకు వేదికగా 'సాధన 2026'

-సంగీతం, నృత్యం, నాటకం, దృశ్యకళల్లో విద్యార్థుల ప్రతిభాపాటవాల ప్రదర్శన

పఠాన్ చేరు, అక్టోబర్ 30 (లోకల్ గైడ్ (ప్రతినిధి కృష్ణ): విద్యార్థుల్లో దాగి ఉన్న కళా నైపుణ్యాలు, సృజనాత్మకతను వెలికితీసే లక్ష్యంతో గీతం స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ లలిత, ప్రదర్శన కళల విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం 'సాధన 2026' కార్యక్రమాన్ని నిర్వహించారు. హైదరాబాద్‌లోని గీతం డాన్స్ స్టూడియోలో జరిగిన ఈ కార్యక్రమం కళా ప్రతిభకు వేదికగా నిలిచింది. ఈ సందర్భంగా విద్యార్థులు కర్ణాటక సంగీతం, భరతనాట్యం, కూచిపూడి, నాటకం, దృశ్యకళల్లో తమ ప్రతిభను ప్రదర్శించారు. అధ్యాపకుల మార్గదర్శకత్వంలో బృందాలుగా ఏర్పడి, తాము నేర్చుకున్న నైపుణ్యాలు, జ్ఞానం, కళాత్మక భావాలను ప్రేక్షకుల ముందుంచారు. సంగీత ప్రదర్శనలకు మృదంగంపై చంద్రకాంత్, వయోలిన్‌పై వాసు శాస్త్రి సహకారం అందించారు. ప్రత్యక్ష వాయిద్య సహకారంతో ప్రదర్శనలు ఇవ్వడం విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, సంగీత సమన్వయం, వేదికపై ప్రదర్శన నైపుణ్యాలను పెంపొందించేందుకు దోహదపడింది. మధ్యంతర మూల్యాంకనంలో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమం విద్యార్థుల అభ్యసన ప్రగతి, సృజనాత్మకత, సాంకేతిక నైపుణ్యాలను చాటిచెప్పింది. విద్యార్థుల అంకితభావం, ఉత్సాహం, కళాత్మక ఎదుగుదలను అధ్యాపకులు, తోటి విద్యార్థులు ప్రశంసించారు. అనుభవపూర్వక అభ్యసనానికి, వర్ధమాన కళాకారులను ప్రోత్సహించడానికి గీతం సంస్థ అందిస్తున్న ప్రాధాన్యతను 'సాధన 2026' మరోసారి చాటిచెప్పింది.

గ్రాడ్యుయేట్ ఎంఎల్సీ ఓటర్ల నమోదుపై కాంగ్రెస్ నేతల విస్తృత పర్యటన

లోకల్ గైడ్ కురవి, అక్టోబర్ 30 : మహబూబాబాద్ జిల్లా కురవి మండలం లో గ్రాడ్యుయేట్ ఎంఎల్సీ ఓటరు నమోదు కార్యక్రమంలో భాగంగా కురవి మండలంలో కాంగ్రెస్ పార్టీ నేతలు గురువారం విస్తృతంగా పర్యటించారు. నెరడ, బాల్య తండా, కాకుల బొడు తండా, చీంలా తండా, ఎలక చెట్టు తండా, తట్టుపల్లి, చంద్య తండా గ్రామాల్లో పర్యటించిన నేతలు, స్థానిక కాంగ్రెస్ నాయకులతో, గ్రాడ్యుయేట్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గ్రాడ్యుయేట్ ఓటరు నమోదుకు నవంబర్ 6 తుది గడువు అని, అర్హులైన ప్రతి గ్రాడ్యుయేట్ ఓటరుగా నమోదు అయ్యేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రతి గ్రామంలో ఓటరు నమోదును వేగవంతం చేయాలని స్థానిక నాయకులను అప్రమత్తం చేశారు. ఈ కార్యక్రమంలో డీసీసీ వైస్ ప్రెసిడెంట్ బండి శ్రీనివాస్ గౌడ్, మండల కన్వీనర్ గార్లపాటి భరద్వాజ్ రెడ్డి, కురవి టౌన్ ప్రెసిడెంట్ ఎన్. రాజేందర్ కుమార్, డాక్టర్స్ సెల్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ ధరావత్ వీరన్న, కురవి టెంపుల్ చైర్మన్ కోర్నీ రవీందర్ రెడ్డి, కోర్నీ చందు తదితరులు పాల్గొన్నారు. వీరితో పాటు ఆయా గ్రామాల కాంగ్రెస్ అధ్యక్షులు, సర్పంచ్ లు, ఉప సర్పంచ్ లు, వార్డు సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నవంబర్ 1న పేటలో ఆర్ ఎస్ ఎస్ పతసంచలనం

పేట నగర సంఘచాలక్

డాక్టర్ మదన్ మోహన్ రెడ్డి



నారాయణపేట అక్టోబర్ 30: నారాయణపేట పట్టణంలో నవంబర్ 1న ఆర్ ఎస్ ఎస్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నారాయణపేట నగర సంఘచాలఖ్ డాక్టర్ మదన్ మోహన్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పతసంచలంలో ఉత్కూ ర ఖండ, దామరిగిద్ద ఖండ, నారాయణపేట ఖండ కార్యకర్తలు పాల్గొంటారని తెలిపారు.ఉత్కుర్ ఖండ కార్యకర్తలు శీలా గార్డెన్ నుంచి, దామరిగిద్ద ఖండ కార్యకర్తలు బారంబావి నుంచి,నారాయణపేట ఖండ కార్యకర్తలు పళ్ళ హనుమాన్ దేవాలయం నుంచి పాల్గొంటారని తెలిపారు.కార్యకర్తలు పురవీధుల్లో పతసంచనం చేస్తూ కాలేజీ మైదానం కు చేరుకుంటారని అక్కడ ముఖ్య వక్తలు పాల్గొని దిశా నిర్దేశం చేస్తారని తెలిపారు.ఈ కార్యక్రమంలో కార్య కర్తలు అదిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ప్రజా మేధావుల సదస్సు

బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మి శ్యామ్

నారాయణపేట అక్టోబర్ 30: ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం నవంబర్ ఒకటవ తేదీ ఆదివారం నాడు ఉదయం 11 గంటలకు నారాయణ పేట జిల్లా కేంద్రంలో శాస నపల్లి రోడ్ లోని లక్ష్మీ బాంకెట్ హాల్ లో మేధా వుల సదస్సు నిర్వహిస్తున్నట్లు జిల్లా బిజెపి ప్రధాన కార్యదర్శి లక్ష్మి శ్యామ్ సుందర్ గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేధావుల సమావేశాని కి ముఖ్య అతిథిగా పాలమూరు పార్లమెంట్ సభ్యులు డి కే అరుణ పాల్గొంటారని తెలిపారు.ఈ సమాజం లోని డాక్టర్లు న్యాయవ దులు లెక్చరర్లు టీచర్లు కుల సంఘాల నాయకులు వ్యాపార వర్తకులు ఇతరే తర మేధావి వర్గాల అందరి కీ ఇదే మా ఆహ్వానం పలుకుతున్నట్లు తెలిపారు. దేశ విచ్చిత్తికి ప్రజాస్వామ్య అపహాస్యానికి వివిధ రకా ల పేర్లతో విదేశీ నిధులతో ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నుకోబడిన వ్యవస్థలను కూల్చి వేయడానికి సిద్ధ మవుతున్న వేళ మేధావు లు కదలివచ్చి మేధావుల ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ మేధావుల సమావేశాన్ని జయప్రదం చేయాలనీ కోరారు.

మహా పాదయాత్రకు తరలి రండి

బిజెపి జిల్లా లీగల్ సెల్ కన్వీనర్ నందు



నారాయణపేట అక్టోబర్ 30: ప్రజాస్వామ్యాన్ని పటిరక్షిద్దాం..అరాచక వాదాన్ని అంతం చేద్దామని బిజెపి ఆధ్వర్యంలో నవం బర్ 2న హైదరాబాద్ లో నిర్వహించే మహా పాద యాత్ర లో పాల్గొని విజయవంతం చేయాలని జిల్లా బిజెపి లీగల్ సెల్ కన్వీనర్ నందు నామాజీ ఒక ప్రకట నలో కోరారు.ఈ పాద యాత్ర లో కేంద్ర హోం మంత్రి అమిత్ షా ముఖ్య అతిథిగా పాల్గొంటారని పాదయాత్ర స్వామి వివే కానంద విగ్రహం నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు సాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యకర్త లు,ప్రజాస్వామ్య పరిరక్ష కులు అధిక సంఖ్య లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం మీఓటును నమోదు చేసుకోండి

పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకటేష్ గౌడ్

నారాయణపేట అక్టోబర్ 30: హైదరాబాద్--రంగారెడ్డి--మహబూబ్‌నగర్ పట్టభ ద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో అర్హులైన పట్టభ ద్రులందరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని నారాయణపేట పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు కర్రె వెంకటేష్ గౌడ్ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో పట్టభద్రుల ఓటు కేవలం ఒక హక్కు మాత్రమే కాదు సమాజ భవిష్యత్తు, విద్యా వంతుల ఆలోచనలు, ప్రజా సమస్యలపై బాధ్యతాయు తమైన అభిప్రాయాలను ప్రతిబింబించే విలువైన అవకాశం అన్నారు. విద్యా వంతులు, మేధావులు, ఉపాధ్యాయులు, ఉద్యో గులు, యువ పట్టభద్రులు తమ ఓటు హక్కును వినియోగించుకునే దిశగా ముందడుగు వేయాలని కోరారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో తమ పేరును నమోదు చేసుకోవడం ద్వారా ప్రజా స్వామ్య ప్రక్రియలో భాగ స్వాములు కావాలని పిలుపునిచ్చారు.పట్టభద్రుల ఓటరు నమోదుకు నవంబర్ 5వ తేదీ చివరి గడువు కావున, చివరి తేదీ వరకు వేచి చూడకుండా అర్హులైన ప్రతి పట్టభద్రుడు వెంటనే దరఖాస్తు చేసు కోవాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా యువత, విద్యావంతులు ఈ అవ కాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ ఓటు హక్కును నమోదు చేసుకో వాలని, తమ కుటుంబ సభ్యులు, స్నేహితులు, సహచర పట్టభద్రులకు కూడా ఈ విషయాన్ని తెలి యజేసి ఓటరు నమోదుపై అవగాహన కల్పించాలని కోరారు.

పాలమూరు వి సి నీ మర్యా ద పూర్వకంగా కలిసిన చెన్నప్ప

నారాయణపేట అక్టోబర్ 30: పాలమూరు యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ జి.ఎన్ శ్రీనివాస్ యాదవ్ ను శుక్రవారం నారాయణపేట జిల్లా బిజెపి నాయకులు చెన్నప్ప యాదవ్ మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు.ఈ కార్యక్రమంలో ఏ బి వి పి నాయకులు పాల్గొన్నారు.

మంచిర్యాల,దండేపల్లి ఘటనలపై ప్రత్యేక దర్యాప్తు బృందం ఏర్పాటు..

సాంకేతిక ఆధారాల సేకరణతో సమగ్ర దర్యాప్తు...

వాస్తవాలను వెలికితీసే దిశగా ప్రత్యేక బృందం...

సీపీ అంబర్ కిషోర్ ఝా...

మంచిర్యాల జిల్లా ప్రతినిధి (లోకల్ గైడ్) : మంచిర్యాల జిల్లాలోని మంచిర్యాల,దండేపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఇటీవల చోటుచేసుకున్న ఘటనలపై పారదర్శకంగా,నిష్పక్షపాతంగా దర్యాప్తు నిర్వహించేందుకు రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఆదేశాల మేరకు సీసీఎస్ ఏసీపీ నేతృత్వంలో ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేశారు.ఈ బృందం సంఘటన స్థలాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి,సంబంధిత వ్యక్తులు,సాక్షులను విచారించడంతో పాటు సాంకేతిక ఆధారాలను సేకరించి విశ్లేషించనుంది.అందుబాటులో ఉన్న ఆధారాల ఆధారంగా సంఘటనల వాస్తవాలను,సంబంధిత వ్యక్తుల పాత్రను నిష్పక్షపాతంగా నిర్ధారించనుంది.దండేపల్లి,మంచిర్యాల పోలీస్ స్టేషన్ల పరిధిలో ప్రజల భద్రతకు ప్రాధాన్యత ఇస్తు,శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా పోలీసులు 24 గంటలు అప్రమత్తంగా విధులు నిర్వహిస్తున్నారని సీపీ తెలిపారు.ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అవసరమైన ముందస్తు భద్రతా చర్యలు చేపడుతున్నట్లు సిపి పేర్కొన్నారు.సోషల్ మీడియాలో ప్రచారమవుతున్న ఊహాజనిత,నిర్ధారణ కాని అసత్య సమాచారాన్ని నమ్మవద్దని,వాటి ఆధారంగా ప్రజలు ఆందోళనకు గురికావద్దని సీపీ సూచించారు.అధికారికంగా పోలీస్ శాఖ విడుదల చేసే సమాచారాన్ని మాత్రమే విశ్వసించాలని కోరారు.ప్రజల భద్రతే పోలీసుల ప్రథమ ప్రాధాన్యత అని శాంతిభద్రతల పరిరక్షణకు రామగుండం పోలీస్ కమిషనరేట్ ఎల్లప్పుడు కట్టుబడి ఉంటుందని సీపీ పేర్కొన్నారు.

పట్టభద్రుల ఓటరు నమోదులో కల్వకుర్తి నియోజకవర్గం ప్రథమ స్థానంలో నిలవాలి!

అర్హులైన ప్రతి పట్టభద్రుడిని ఓటరుగా నమోదు చేయించాలి -- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

లోకల్ గైడ్ ఆమనగల్లు, అక్టోబర్ 30: రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కల్వకుర్తి నియోజకవర్గం ఓటరు నమోదు ప్రక్రియలో ముందంజలో నిలవాలని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పిలుపునిచ్చారు. ఉమ్మడి మహబూబ్‌నగర్, హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల పరిధిలోనే అత్యధిక పట్టభద్రుల ఓటర్లను నమోదు చేయించి కల్వకుర్తి నియోజకవర్గం ప్రథమ స్థానంలో నిలిచేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. శుక్రవారం హైదరాబాద్‌లో నిర్వహించిన నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ విస్తృతస్థాయి సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ నవంబర్ 5వ తేదీలోగా అర్హులైన ప్రతి పట్టభద్రుడిని ఓటరుగా నమోదు చేయించాలని అన్నారు. ఇప్పటికే ఓటర్లుగా ఉన్నవారితో పాటు కొత్తగా డిగ్రీ పూర్తి చేసుకున్న పట్టభద్రులను గుర్తించి ప్రత్యేకంగా ఓటరు నమోదుపై దృష్టి సారించాలని నాయకులకు దిశానిర్దేశం చేశారు. ఓటరు నమోదును ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలిదనియోజకవర్గంలోని మున్సిపల్ చైర్మన్లు, వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు, మార్కెట్ కమిటీ చైర్మన్లు, వైస్ చైర్మన్లు, డైరెక్టర్లు, సహకార సంఘాల అధ్యక్షులు, డైరెక్టర్లు, సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు, మాజీ ప్రజాప్రతినిధులు ఈ కార్యక్రమంలో చురుకుగా పాల్గొనాలని కోరారు. అదేవిధంగా కాంగ్రెస్ పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు, బూత్ స్థాయి ప్రతినిధులు, కమిటీ సభ్యులు, మండల, జిల్లా, రాష్ట్ర నాయకులు, యువజన కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ, మహిళా కాంగ్రెస్, సేవాదళ్, కిసాన్ కాంగ్రెస్, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విభాగాలు, ఐఎన్‌టీయూసీతో పాటు అన్ని అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి అర్హులైన పట్టభద్రులను గుర్తించి ఓటరు నమోదుకు సహకరించాలని సూచించారు. ప్రతి కార్యకర్త బాధ్యతగా పనిచేయాలి నవంబర్ 5వ తేదీలోగా కల్వకుర్తి నియోజకవర్గం నుంచి అత్యధిక పట్టభద్రుల ఓట్లు నమోదయ్యేలా ప్రతి నాయకుడు, కార్యకర్త సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకుని లక్ష్య సాధన కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలని దిశానిర్దేశం చేశారు.

కడ్తాల్‌లో బీజేపీ కదం.. రేపు భారీ పాదయాత్ర, అనంతరం బహిరంగ సభ!

కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా

నేడు భారీ ప్రదర్శన.. ముఖ్య అతిథులుగా ఎంపీ మన్నా లాల్ రావత్, తల్లోజు ఆచారి

లోకల్ గైడ్ ఆమనగల్లు, అక్టోబర్ 30: తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను నిరసిస్తూ భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో అక్టోబర్ 31న కడ్తాల్ మండలంలో భారీ పాదయాత్ర నిర్వహించనున్నట్లు బీజేపీ ఆమనగల్లు మండల అధ్యక్షుడు ఎర్రవోలు శ్రీనివాస్ కేకే తెలిపారు. ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో పాటు ప్రభుత్వ విధానాలపై ప్రజలకు వివరించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ పాదయాత్రకు బీజేపీ జాతీయ ఎస్టీ మోర్చా అధ్యక్షుడు, ఎంపీ డాక్టర్ మన్నా లాల్ రావత్, జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. టోల్‌గేట్ నుంచి కెనరా బ్యాంకు వరకు పాదయాత్ర అక్టోబర్ 31వ తేదీ శనివారం మధ్యాహ్నం 3 గంటలకు కడ్తాల్ టోల్‌గేట్ నుంచి పాదయాత్ర ప్రారంభమై కడ్తాల్‌లోని కెనరా బ్యాంకు వరకు కొనసాగనుంది. అనంతరం అక్కడ బహిరంగ సభ నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, మండల, గ్రామస్థాయి బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరై పాదయాత్రను విజయవంతం చేయాలని ఎర్రవోలు శ్రీనివాస్ కేకే విజ్ఞప్తి చేశారు.

బాల్యం హక్కులపై డి ఎల్ ఎస్ ఏ అవగాహన

నారాయణపేట అక్టోబర్ 30: బాలల హక్కులపై డి ఎల్ ఎస్ ఏ ఆధ్వర్యంలో అవగాహనకల్పించారు.బాలల హక్కులే మన భవి ష్యత్తు , నా బాల్యం – నా హక్కు అంటూ ప్రభుత్వ ఉన్నత పాఠశాల గ్రౌండ్ విద్యార్థులచే సీనియర్ సివిల్ జడ్జి వింధ్య నాయక్,జూనియర్ సివిల్ జడ్జి వడ్లూరివుష్మిత ప్రతిజ్ఞ చేయించారు.

నారాయణపేట పట్టణం, కోస్గిలో "సురక్షిత్ బచ్‌పన్ అభియాన్" లో భాగంగా 5వ రోజు జిల్లా న్యాయ సేవ సంస్థ లీగల్ సర్వీసెస్ సంస్థ ఆధ్వర్యంలో లీగల్ సర్వీసెస్ సంస్థ ఆధ్వర్యం లో అవగాహన కార్యక్ర మలు నిర్వహించారు. ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, నారాయణపే టలో అవగాహన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా సీనియర్ సివిల్ జడ్జి లీగల్ సర్వీసెస్ సంస్థ సెక్రటరీ వింధ్య నాయక్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ముష్రిఫా, కోస్గి లో వడ్లూరి సుష్మిత హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈరోజు నేను దేశవ్యాప్తంగా సాగు తున్న ఒక గొప్ప సామాజిక ఉద్యమం "నా బాల్ వివాహ్, నా బాల్ శోషణ్" (బాల్య వివాహాలు వద్దు – బాలల శోషణ వద్దు) గురించి మాట్లాడబో తున్నాను మాట్లాడుతూ బాల్య వివాహం ఒక నేరం, బాలల శోషణం మహా నేరం. ప్రతి బిడ్డకు చదువు కునే హక్కు ఉంది, ఆడుకు నే హక్కు ఉంది, పెళ్లి చేసు కునే వయసు కాదు అని అన్నారు. బాలల హక్కుల ను కాపాడటం మనందరి బాధ్యత పోక్సో చట్టం 2012 గురించి, మంచి స్పర్శ-చెడు స్పర్శ గురించి, ఏదైనా ఇబ్బంది అనిపిస్తే భయపడకుండా 1098 – చైల్డ్ లైన్, 100 – పోలీస్, టోల్ ఫ్రీ కి కాల్ చేయాలి సూచించారు.విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని, తమ హక్కులపై ప్రతిజ్ఞ చేశారు. బాల్య వివాహ నిరోధక చట్టం అమ్మాయికి 18, అబ్బాయికి 21 ఏళ్ల లోపు పెళ్లి చేయడం నేరం. చేసిన వారికి 2 సంవత్స రాల జైలు, లక్ష రూపాయల జరిమానా పిల్లలపై ఏ విధమైన శోషణ జరిగినా కఠిన శిక్షలు వివరించారు. కోస్గిలో అవగాహన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా జడ్జి వడ్లూరి సుష్మిత జడ్జి మాట్లాడు తూ బాల్యం అనేది ప్రతి ఒక్కరి జీవితంలో అత్యంత మధురమైన, అమూల్య మైన ఘట్టం. నిష్కల మైన నవ్వులు, ఆటపాటలు, అమాయకత్వంతో నిండిన కాలమే బాల్యం. అయితే, ఈ అందమైన బాల్యం ప్రతి బిడ్డకు సంతోషంగా సాగాలంటే వారికి కొన్ని ప్రాథమిక హక్కులు అవసరం. అవే బాలల హక్కులు, ముఖ్యమైన హక్కులు విహరించారు.. జిల్లా సంక్షేమ అధికారి రాజేందర్ గౌడ్ మాట్లా డుతూ బాల్యవివాహాలు వద్దు – బాలల శోషణ వద్దు అనే నినాదంతో నేటి బాలలే రేపటి పౌరులు. వారి చిన్నతనాన్ని, నవ్వు లను చిదిమేసే హక్కు ఎవరికీ లేదు. రండి, మన మందరం కలిసి బాల్యవి వాహాలు లేని, బాలల శోషణ లేని ఒక ఆరోగ్యకర మైన, సురక్షితమైన నారా యణపేట జిల్లాగా నిర్మిద్దాం విజ్ఞాపించారు.ఈ కార్యక్ర మంలోలీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ లక్ష్మీపతి గౌడ, ఎడ్యుకేషనల్ డిపార్ట్మెంట్ సంగీత, చైల్డ్ డిపార్ట్మెంట్ నర్సిములు, భరోసా,సఖి సెంటర్ ప్రమీ ల, నాగ లక్ష్మి, కవిత, పాఠశాల ప్రధానోపాధ్యా యులు, ఉపాధ్యాయులు, ప్యానల్ న్యాయవాదులు, పార లీగల్ వాలంటీర్స్ పాల్గొన్నారు.

మియాపూర్ 100, 101 సర్వే నంబర్లలోని 550.39 ఎకరాలు ప్రభుత్వ భూములే

సుప్రీంకోర్టు తీర్పుపై ఎంసిపిఐ యు హర్షం.. పేదలకు ఇళ్ల స్థలాలుగా పంపిణీ చేయాలి

సైబరాబాద్, అక్టోబర్ 30 (లోకల్ గైడ్ ప్రతినిధి కృష్ణ): మియాపూర్ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్లు 100, 101లో ఉన్న 550.39 ఎకరాల భూమి ప్రభుత్వానిదేనని సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడంపై ఎంసిపిఐ యు పార్టీ హర్షం వ్యక్తం చేసింది. మియాపూర్‌లోని ముజఫర్ అహ్మద్ నగర్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో పార్టీ నాయకత్వం ఈ మేరకు వెల్లడించింది. గత నాలుగు దశాబ్దాలుగా ఈ భూములు ప్రభుత్వానివేనని ఎంసిపిఐ యు ప్రజల్లో అవగాహన కల్పిస్తూ పోరాటాలు చేస్తోందని నాయకులు తెలిపారు. 1986 నుంచే ప్రభుత్వ భూములను భూకబ్జాదారుల నుంచి కాపాడి పేదలకు ఇళ్ల స్థలాలుగా పంపిణీ చేయాలని ఉద్యమాలు చేపట్టినట్లు గుర్తుచేశారు. కొందరు భూకబ్జాదారులు, రియల్ ఎస్టేట్ వ్యక్తులు తప్పుడు పత్రాలు సృష్టించి రెవెన్యూ రికార్డుల్లో పేర్లు నమోదు చేసుకున్నారని ఆరోపించారు. 1994లో పార్టీ వ్యవస్థాపక నేత, అప్పటి ఎమ్మెల్యే కామ్రేడ్ మద్దికాయల ఓంకార్ ఈ భూముల కబ్జా అంశాన్ని అసెంబ్లీలో ప్రస్తావించారని తెలిపారు. అనంతరం 2003లో ఉమ్మడి రాష్ట్ర హైకోర్టు ఈ భూములు ప్రభుత్వానివేనని తీర్పు ఇచ్చిందని పేర్కొన్నారు. భూములను కాపాడే క్రమంలో స్టాలిన్ నగర్, ముజఫర్ అహ్మద్ నగర్ ప్రాంతాల్లో పేదలకు ఇళ్ల స్థలాలు కల్పించేందుకు కామ్రేడ్ మద్దికాయల ఓంకార్, తాండ్ర కుమార్ నాయకత్వంలో పోరాటాలు సాగాయని వివరించారు. తాజాగా సుప్రీంకోర్టు తీర్పుతో ప్రభుత్వ భూములపై స్పష్టత రావడం హర్షణీయమని పేర్కొంటూ, రాష్ట్ర ప్రభుత్వం ఈ భూములను పేదలకు ఇళ్ల స్థలాలుగా పంపిణీ చేయాలని, ప్రజా ప్రయోజనాలకే వినియోగించాలని డిమాండ్ చేశారు. సర్వే నంబర్ 100లో దశాబ్దాలుగా నివాసం ఉంటున్న పేదలకు ఇంటి పట్టాలు ఇచ్చి వారి నివాసాలకు చట్టబద్ధత కల్పించాలని కోరారు. అయితే సుప్రీంకోర్టు తీర్పు వెలువడిన 24 గంటలు గడవకముందే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీలో ఈ భూములను విక్రయిస్తామనే విధంగా ప్రకటించడం విచారకరమని నాయకులు విమర్శించారు. విలువైన ప్రభుత్వ భూములను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించకుండా భవిష్యత్తు తరాల ప్రయోజనాల కోసం కాపాడాలని డిమాండ్ చేశారు. పేదలకు ఈ భూములు దక్కే వరకు ఎంసిపిఐ యు ఆధ్వర్యంలో ప్రజా పోరాటాలు కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఎంసిపిఐ యు రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వనం సుధాకర్, గ్రేటర్ హైదరాబాద్ కార్యదర్శి మైదం శెట్టి రమేష్, సహాయ కార్యదర్శి తుడుం అనిల్ కుమార్, కార్యదర్శివర్గ సభ్యులు ఇస్లావత్ దశరత్ నాయక్, పల్లె మురళి, కమిటీ సభ్యులు జి. శివాని, బి.కె. నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కుతోనే ప్రజాస్వామ్యానికి రక్షణ!

ఓటర్ల హక్కుల పరిరక్షణకు ఉద్యమిద్దాం.. నవంబర్ 1న చలో ఢిల్లీ సభను విజయవంతం చేయాలి!

ఓటర్ల హక్కుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

-- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

లోకల్ గైడ్ ఆమనగల్లు, అక్టోబర్ 30: ఓటు హక్కును కాపాడుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ఓటర్ల హక్కుల పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ చేపట్టిన 'ఓట్ బచావో.. దేశ్ బచావో' ఉద్యమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. నవంబర్ 1న ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో నిర్వహించనున్న 'చలో ఢిల్లీ' సభను విజయవంతం చేయాలని కోరారు.శుక్రవారం ఆమనగల్లు పట్టణంలో టీపీసీసీ సభ్యుడు అయిళ్ల శ్రీనివాస్ గౌడ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ నేనావత్ పత్య నాయక్, డీసీసీ ఉపాధ్యక్షుడు గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ అధ్యక్షుడు అవ్వారి శివలింగంతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థకు ఓటు హక్కు పునాది వంటిదని పేర్కొన్నారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో అర్హులైన ఒక్క ఓటరు కూడా తమ హక్కును కోల్పోకుండా అప్రమత్తంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి ఒక్కరూ ఓటర్ల జాబితాలో తమ పేర్లను పరిశీలించుకోవాలని, ఓటు హక్కు ప్రాధాన్యతపై ప్రజలకు అవగాహన కల్పించాలని పార్టీ నాయకులు, కార్యకర్తలకు సూచించారు. ఓటు హక్కు పరిరక్షణపై జాతీయ స్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించేందుకు నిర్వహిస్తున్న చలో ఢిల్లీ సభకు కాంగ్రెస్ శ్రేణులతో పాటు ప్రజాస్వామ్యవాదులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కోరారు. ఈ సమావేశంలో ఓటరు నమోదు కేంద్రాల ఇన్‌చార్జులు ఎంగలి ప్రసాద్, నాగిళ్ల వెంకటేష్, డైరెక్టర్ వస్పుల శ్రీశైలం, కౌన్సిలర్ అనిత శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్ ప్రశాంతి రవికుమార్, మాజీ ఎంపీపీ అనిత విజయ్, ఆదివాసీ రాష్ట్ర సమన్వయకర్త కృష్ణ నాయక్, ఎం.ఏ. ఖలీల్, పూసల సత్యం, కొండల్‌రెడ్డి, అబ్దుల్ అలీమ్, వస్పుల శ్రీకాంత్, ఎం.డి. ఫరీద్, ఫిరోజ్, శ్రీనాయక్, మల్లేష్ నాయక్, గుద్దేటి శివ, కుమార్ గౌడ్, నాజర్, రఫీ, పూసల పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

జవహర్‌నగర్ డంప్‌యార్డ్ తరలింపు కోసం బీజేపీ పోరాటం

జవహర్‌నగర్ డంప్‌యార్డ్ సమస్యపై బీజేపీ సమరం..

ఈటల పాదయాత్రలో తల్లోజు ఆచారి.. సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్

లోకల్ గైడ్ ఆమనగల్లు, అక్టోబర్ 30: జవహర్‌నగర్ డంప్‌యార్డ్‌ను తరలించి పరిసర ప్రాంతాల ప్రజలకు ఉపశమనం కల్పించాలనే డిమాండ్‌తో బీజేపీ మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ చేపట్టిన మహా పాదయాత్రకు మద్దతుగా జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి నాలుగో రోజు పోరాటంలో పాల్గొన్నారు. గత మూడు దశాబ్దాలుగా జవహర్‌నగర్ డంప్‌యార్డ్ సమస్యతో పరిసర ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ప్రతిరోజూ భారీగా పేరుకుపోతున్న వ్యర్థాల వల్ల ప్రజల ఆరోగ్యం, పర్యావరణం, జీవన పరిస్థితులపై ప్రతికూల ప్రభావం పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు.డంప్‌యార్డ్ సమస్యను కేవలం తాత్కాలిక చర్యలతో కాకుండా శాశ్వత పరిష్కారం చూపే విధంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈటల రాజేందర్ చేపట్టిన మహా పాదయాత్ర విజయవంతమై జవహర్‌నగర్ ప్రజలకు న్యాయం జరగాలని ఆకాంక్షించారు. ప్రజల ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని డంప్‌యార్డ్ సమస్య పరిష్కారమయ్యే వరకు బీజేపీ పోరాటం కొనసాగిస్తుందని పార్టీ నాయకులు స్పష్టం చేశారు.

కాగ్న నదిలో అక్రమ ఇసుక తవ్వకాలు!

– హిటాచీలతో ఇసుక తరలింపుపై రైతుల ఆగ్రహం..

– పట్టా భూములు కోతకు గురవుతున్నాయని ఆవేదన

లోకల్ గైడ్ /తాండూర్: వికారాబాద్ జిల్లా యాలాల్ మండల కేంద్రంలోని కాగ్న నది నుంచి కొడంగల్‌లో కొనసాగుతున్న అభివృద్ధి పనులకు భారీగా ఇసుక తరలిస్తుండటంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పట్టా భూములకు ఆనుకుని ఉన్న నదిలో హిటాచీలతో ఇష్టానుసారంగా ఇసుక తవ్వకాలు చేపడుతున్నారని రైతులు ఆరోపించారు. ఈ సందర్భంగా యాలాల్ మండల కేంద్రానికి చెందిన రైతు శెట్టి రమేష్ మాట్లాడుతూ.. నది ప్రవాహం కారణంగా తమ భూములు కోతకు గురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నది మధ్యలో నుంచి మాత్రమే ఇసుకను తరలించాల్సి ఉండగా, అడ్డదిడ్డంగా తవ్వకాలు చేపట్టడం వల్ల నది ప్రవాహం దిశ మారి పట్టా భూములు కోతకు గురవుతున్నాయని తెలిపారు. ఇసుక వ్యాపారులు నిబంధనలు పట్టించుకోకుండా భారీ యంత్రాలతో తవ్వకాలు చేపడుతున్నారని ఆరోపించారు. ఈ విషయంపై అధికారులు వెంటనే స్పందించి ఇసుక తవ్వకాలను నియంత్రించాలని, తమ భూములను కాపాడేందుకు చర్యలు తీసుకుని న్యాయం చేయాలని శెట్టి రమేష్ డిమాండ్ చేశారు.

నా ప్లాట్ కబ్జా చేశారు.. న్యాయం చేయండి!

– నా స్థలం నాకు దక్కేవరకు పోరాటం చేస్తా.

– న్యాయం జరగకపోతే ఆత్మహత్య చేసుకుంటా!

– మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ బాల్‌రెడ్డిపై భారతీ రెడ్డి ఆరోపణలు

లోకల్ గైడ్ /తాండూర్ : తాండూర్ నియోజకవర్గ పరిధిలోని యాలాల్ మండలం రసూల్‌పూర్ సమీపంలోని సర్వే నంబర్ 3లో తనకు చెందిన ప్లాటుతో పాటు మరో 9 మంది ప్లాట్లను ఆక్రమించారని బంట్వారం మండల పరిధిలోని బస్వాపూర్ గ్రామానికి చెందిన భారతీ రెడ్డి ఆరోపించారు. శుక్రవారం మీడియాతో ఆమె మాట్లాడుతూ... సుమారు 22 సంవత్సరాల క్రితం తాండూర్ కు చెందిన రాజన్ గౌడ్ వద్ద తన భర్త వెంకట్ రెడ్డి కొనుగోలు చేసిన స్థలంలో హద్దులు తొలగించి 15 అడుగుల మేర ఆక్రమణకు పాల్పడ్డారని తాండూర్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బాల్‌రెడ్డిపై ఆరోపణలు చేశారు. 22 ఏళ్ల క్రితం రసూల్‌పూర్ సమీపంలోని సర్వే నంబర్ 3లో భారతీ రెడ్డి పేరుపై 313 గజాల ప్లాటు, ఆమె సొంత సోదరి విజయభారతి రెడ్డి పేరుపై మరో 300 గజాల ప్లాటు ఉన్నట్లు తెలిపారు. మొత్తం 613 గజాల స్థలాన్ని సుమారు 22 సంవత్సరాల క్రితం రాజన్ గౌడ్ వద్ద నుంచి కొనుగోలు చేసినట్లు పేర్కొన్నారు. అయితే ప్రస్తుతం తమ ప్లాటుకు సంబంధించిన హద్దులను తొలగించి 15 అడుగుల స్థలాన్ని బాల్ రెడ్డి ఆక్రమించారని ఆమె ఆరోపించారు.

ఒంటరి మహిళనని చూడకుండా బెదిరింపులు!

తాను భర్త లేని ఒంటరి మహిళనని కూడా చూడకుండా బాల్ రెడ్డి బెదిరింపులకు గురిచేశారని భారతీ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై ప్రశ్నించినప్పుడు ఎవరికి చెప్పుకుంటావో చెప్పుకో.. ఏం చేసుకుంటావో చేసుకో అంటూ హెచ్చరించినట్లు ఆరోపించారు. అధికార బలం, ఎమ్మెల్యే అండదండలతోనే తన స్థలాన్ని ఆక్రమించారని ఆరోపిస్తూ కన్నీరు కార్చారు. ఏదేమైనా తనకు న్యాయం జరిగే వరకు పోరాటం ఆపబోనని భారతీ రెడ్డి స్పష్టం చేశారు. తన స్థలం తిరిగి దక్కకపోతే ఆత్మహత్య చేసుకుంటానని ఆవేదనతో పేర్కొన్నారు. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించి సర్వే నంబర్ 3లోని స్థలాన్ని పరిశీలించి, హద్దులను నిర్ధారించి ఆక్రమణకు గురైనట్లు చెబుతున్న 15 అడుగుల స్థలాన్ని తిరిగి తనకు అప్పగించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

పంటలపై యువకుడి ఆవేదన

నారాయణపేట అక్టోబర్ 30:
ఎండిపోయిన కంది పంట... కన్నీటిలో
రైతన్న బతుకు!

పొలమంతా కంది మొక్కలు...
రైతు గుండెల నిండా ఆశలు...
పంట పండితే అప్పులు తీరుతాయని,
కుటుంబం నవ్వుతుందని ఎన్నో
కలలు...

చినుకు కోసం ఆకాశం వైపు చూపులు,
వాన కోసం ఎదురుచూస్తూ ఎన్నో
రోజులు...
మబ్బులు కమ్ముకున్నా చినుకులు రాక,
ఎండకు మాడిపోయాయి పచ్చని
మొక్కలు...

అయ్యో రైతన్నా... నీ కష్టమెవరికి
తెలుసు?
నీ కన్నీటి వెనుక దాగిన కథ ఎవరికి
తెలుసు?
నువ్వు చిందించిన చెమట చుక్కలకు
విలువేది?
నువ్వు పెంచిన పంటకు దక్కే
ప్రతిఫలమేది?

ఎల్‌నినో ప్రభావమో... ప్రకృతి
వైపరీత్యమో,
రైతన్న జీవితంలో మిగిలింది
విషాదమే...
విత్తనానికి పెట్టుబడి... ఎరువులకు
అప్పులు,
చేతికొచ్చే పంట ఎండిపోతే గుండెల్లో
గుబులు...

నిన్నటి వరకు పచ్చగా నవ్విన కంది
మొక్కలు,
నేడు ఎండిపోయి చెబుతున్నాయి రైతు
కష్టాలు...
పొలం అంచున నిలబడి పంటను
చూస్తుంటే,
రైతన్న కళ్లలో కన్నీళ్లు నిశ్శబ్దంగా
జారుతుంటే...

ఆ ఎండిన మొక్కల్లో కనిపిస్తున్నది పంట
నష్టం మాత్రమే కాదు,
రైతు కుటుంబం రేపటి జీవనంపై
అలుముకున్న చీకటి...

ఆ మట్టిలో కలిసిపోయింది విత్తనమే
కాదు,
రైతు ఎన్నో నెలల శ్రమ... ఎన్నో
ఆశలు...!

ఓ పాలకులారా... రైతన్న గోడు
వినండి,
ఎండిన కంది పంటను పరిశీలించి
ఆదుకోండి...
నష్టపోయిన రైతుకు న్యాయం జరిగేలా
చూడండి,
అన్నం పెట్టే రైతన్నకు అండగా
నిలవండి...

రైతు నవ్వితేనే పల్లెకు పండుగ,
రైతు బతికితేనే దేశానికి వెలుగు...
ఎండిన కంది పంటను చూసి కన్నీరు
పెట్టే రైతన్నకు,
భరోసా ఇచ్చే రోజే నిజమైన పండుగ!

రైతన్నా... నీ కన్నీటికి విలువ రావాలి,
నీ కష్టానికి తగిన ఫలితం దక్కాలి...
ఎండిపోయిన ఈ పంట మళ్లీ
పచ్చబడకపోయినా,
నీ జీవితంలో ఆశల మొలకలు మళ్లీ
చిగురించాలి!

రైతన్నకి అంకితం

గత్పరాములు
దామరగిద్ద మండలం
మొగల్ మద్క

ఎల్ నినో ప్రభావాన్ని సమిష్టిగా ఎదుర్కొందాం చైర్ పర్సన్: మొగుదాల పావని రమేష్ గౌడ్

-రూ. 85 లక్షలు తాగునీటి అవసరాలకు కేటాయింపు

యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి చౌటుప్పల్ అక్టోబర్ 30 (లోకల్ గైడ్) : చౌటుప్పల్ పురపాలక సంఘం కౌన్సిల్ సాధారణ సమావేశం చైర్‌పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్ అధ్యక్షతన కౌన్సిల్ హాల్‌లో నిర్వహించారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ఎన్. వెంకటేశ్వర నాయక్, వైస్ చైర్మన్ గోషిక వినయ్ కుమార్, కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు పలు శాఖల అధికారులు పాల్గొన్నారు. రానున్న ఎల్‌నినో ప్రభావాల నేపథ్యంలో పట్టణంలో తాగునీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టేందుకు కౌన్సిల్ రూ. 85 లక్షలు కేటాయించేందుకు ఆమోదం తెలిపింది. ఇందులో భాగంగా కొత్త బోర్లు, మోటార్లు, పైప్‌లైన్ల ఏర్పాటు, ప్రైవేటు బోర్ల లీజు , ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా పనులను ప్రాధాన్యత క్రమంలో చేపట్టనున్నారు. అదేవిధంగా వివిధ వార్డులలో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, కల్వర్టుల నిర్మాణం, ఊర చెరువు పూడికతీత తదితర అభివృద్ధి పనులకు రూ. 1.06 కోట్లకు పైగా, మున్సిపల్ కార్యాలయ సాధారణ పరిపాలన, నిర్వహణ ఇతర అవసరాలకు రూ. 28.27 లక్షల నిధులకు కలిపి మొత్తం రూ. 2.28 కోట్లకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఆదేశాల మేరకు ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడం, రాబోయే వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టడం, చౌటుప్పల్ పట్టణాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లడమే లక్ష్యంగా కౌన్సిల్ ఈ నిర్ణయాలు తీసుకుంది. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు కోసనం రాకేష్ రెడ్డి, పాలేపల్లి లక్ష్మి, పల్లె లావణ్య, ఉడుతల యాదయ్య, శ్రీ కొయ్యడ శేఖర్, ఆరె శైలజ, కాసర్ల మంజుల,బట్టి గాలయ్య, దేవి రమ్య, పాక చిరంజీవి, బత్తుల వాణి, ఉడుగు జ్యోతి, గడ్డం ఇందిర, బత్తుల జయమ్మ, చింతల ఉమామహేశ్వరి, బుడ్డ సురేష్, పిల్లలమర్రి మధుసూదన్, హన్ను మహమ్మద్ కో-ఆప్షన్ సభ్యులు శ్రీ పస్తం గంగారాములు, సందగట్ల విజయ, షేక్ సబీనా. అధికారుల డాక్టర్ డి. చంద్రశేఖర, ఎం. గోవర్ధన్, బి. నవీన్, జి. శ్రీలక్ష్మి ,ఇ. గురువారావు, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అరుదైన బ్రెయిన్ స్ట్రోక్ తో బాధపడుతున్న యువతికి యశోద ఆసుపత్రి ప్రాణదానం

నల్లగొండ ఉమ్మడి జిల్లా ప్రతినిధి .లోకల్ గైడ్ : 20 ఏళ్ల యువతికి బ్రెయిన్ స్ట్రోక్ - యశోదా వైద్యుల అధునాతన చికిత్సతో ప్రాణగండం తప్పింది. కుడివైపు చెయ్యి, కాలు కదలకపోవడం - అకస్మాత్తుగా మాట కోల్పోవడం బ్రెయిన్‌లో 5 మిల్లీమీటర్ల మిడ్‌లైన్ షిఫ్ట్ - తీవ్రమైన పొటాషియం లోపంతో సంక్లిష్టమైన పరిస్థితి లొ నల్గొండకు చెందిన యువతి కి అకస్మాత్తుగా మాట కోల్పోవడం, కుడిచెయ్యి, కుడికాలు కదలకపోవడం వంటి తీవ్రమైన లక్షణాలతో ఆసుపత్రికి వచ్చిన 20 ఏళ్ల యువతికి హైదరాబాద్ మలక్‌పేట్ యశోదా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి వైద్యులు సమగ్ర చికిత్స అందించి ఆరోగ్య పరిస్థితిని మెరుగుపరిచారు. బ్రెయిన్ స్కానింగ్‌లో ఎడమ యాంటీరియర్ సెరిబ్రల్ ఆర్టరీ (ఏసీఏ) పరిధిలో అక్యూట్ ఇస్కీమిక్ స్ట్రోక్ ఉన్నట్లు నిర్ధారణ అయింది. ఎడమ పారాసాజిటల్ ఫ్రంటోపారియటల్ ప్రాంతంలో ఇన్‌ఫార్క్ట్ ఏర్పడి, మాస్ ఎఫెక్ట్ కారణంగా మెదడు మధ్యరేఖ కుడివైపునకు 5 మిల్లీమీటర్లు మారినట్లు గుర్తించారు. ప్రారంభ పరీక్షల్లో యువతి కుడిచెయ్యి, కుడికాలు కండరాల శక్తి 0/5గా నమోదైంది. అఫేసియా కూడా ఉన్నట్లు గుర్తించారు. దీంతో న్యూరో ఐసీయూలో నిరంతర పర్యవేక్షణలో ఉంచి చికిత్స అందించారు. న్యూరోసర్జన్ పరీక్షల అనంతరం బ్రెయిన్ సర్జరీ అవసరం లేకుండా కన్జర్వేటివ్ మెడికల్ మేనేజ్‌మెంట్ కొనసాగించారు. అదే సమయంలో రక్తంలోని పొటాషియం స్థాయి లీటరుకు 1.8 మిల్లీమోల్స్‌కు పడిపోవడం, నియంత్రణకు కష్టమైన అధిక రక్తపోటు, సోడియం స్థాయుల్లో హెచ్చుతగ్గులు కనిపించాయి. దీంతో న్యూరాలజీ, క్రిటికల్ కేర్, నెఫ్రాలజీ, ఎండోక్రైనాలజీ సహా వివిధ విభాగాల నిపుణులు సమన్వయంతో చికిత్స అందించారు. హార్మోన్ల సంబంధిత సమస్య ఉండవచ్చనే అనుమానంతో ప్రత్యేక పరీక్షలు కూడా నిర్వహించారు. అయితే కంజెనిటల్ అడ్రినల్ హైపర్‌ప్లాసియా, 17-ఆల్ఫా హైడ్రాక్సిలేస్ డెఫిషియెన్సీ నిర్ధారణ కాలేదు. చిన్న వయసులో బ్రెయిన్ స్ట్రోక్ వచ్చినప్పుడు ఇతర అంతర్లీన ఆరోగ్య సమస్యలను కూడా సమగ్రంగా పరిశీలించాల్సి ఉంటుందని, ఈ యువతికి తీవ్రమైన స్ట్రోక్‌తో పాటు రక్తపోటు, ఎలక్ట్రోలైట్ అసమతుల్యత ఉండటంతో నిపుణుల సమన్వయంతో చికిత్స అందించినట్లు కన్సల్టెంట్ న్యూరో ఫిజీషియన్ డా. సూరిశెట్టి భరత్ కుమార్ తెలిపారు. ఇటువంటి క్లిష్టతరమైన కేసుల్లో అనుమానిత హార్మోన్ల సమస్యపై మరిన్ని పరీక్షలు అవసరమని కన్సల్టెంట్ ఎండోక్రైనాలజిస్ట్ డా. జయాదిత్య ఘోష్ పేర్కొన్నారు. బ్రెయిన్ స్కానింగ్ ఫలితాలను పరిశీలించి కన్జర్వేటివ్ మెడికల్ మేనేజ్‌మెంట్ సూచించినట్లు సీనియర్ కన్సల్టెంట్ న్యూరోసర్జన్ డా. బి. గేయానంద్ సుధీర్ తెలిపారు. చికిత్స అనంతరం యువతి ఆరోగ్య పరిస్థితిలో సంతృప్తికరమైన మెరుగుదల కనిపించడంతో హీమోడైనమికల్‌గా స్థిరమైన పరిస్థితిలో డిశ్చార్జి చేశారు.

కామారెడ్డి జిల్లా బాన్సువాడ ఏరియా

హాస్పిటల్ లో సదరంక్యాంప్ నిర్వహించడం జరిగింది..

(లోకల్ గైడ్ 30.అక్టోబర్ కామారెడ్డి (ప్రతినిధి) : దివ్యంగులకు సదరం క్యాంపు ను "ఏర్పాటు చేసి నిర్వాహకులు నిర్వహించడం. జరిగినది. ఇట్టి కార్య నిర్వహణ క్రమములో లోకోమీటర్, గాతీష్ట్రశీ, పక్ష వాతం కి సంబంధించిన వారు హాజరు కావడం జరిగినది. అత్యధిక సంఖ్యలో హాజరు కావడం జరిగినది. వీరికి కౌన్సిలింగ్ చేసి వీరికి సదరం సర్టిఫికెట్, ఖణ×ణ కార్డు లను ఇవ్వడం జరుగుతున్నది. డాక్టర్లు వెరిఫికేషన్ చెయ్యడం జరిగినది. ఈ రోజు నాడు 35 మంది హాజరు కావడం జరిగినది. ఈ కార్య క్రమంలో డాక్టర్లు ప్రవీణ్ కుమార్, సాయిలు ణ=ణూ- సదరం క్యాంపు ఆఫీసర్స్ షర్బని రాజేశం, పోచయ్య, సంతోష్ కుమార్ ఇతర సిబ్బంది వారు పాల్గొన్నారు.

దీపావళి టపాసుల విక్రయాలకు లైసెన్స్ దరఖాస్తు గడువు కుదింపు

-నవంబర్ 4వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి --

సైబరాబాద్ పోలీస్ కమిషనర్

సైబరాబాద్, అక్టోబర్ 30 **(లోకల్ గైడ్ ప్రతినిధి కృష్ణ):** దీపావళి పండుగ సందర్భంగా సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో తాత్కాలికంగా బాణసంచా (టపాసులు) విక్రయించాలనుకునే వ్యాపారులు తప్పనిసరిగా లైసెన్స్ పొందాలని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ తెలిపారు. ఈ మేరకు గతంలో అక్టోబర్ 27న జారీ చేసిన నోటిఫికేషన్‌లో దరఖాస్తుల సమర్పణకు నవంబర్ 7వ తేదీ వరకు గడువు విధించారు. అయితే, తాజాగా అక్టోబర్ 30న జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం దరఖాస్తుల గడువును సవరించి నవంబర్ 4వ తేదీగా నిర్ణయించారు. ఆసక్తి గల దరఖాస్తుదారులు నవంబర్ 4వ తేదీలోగా ఆన్‌లైన్‌లో మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. గడువు ముగిసిన తర్వాత అందే దరఖాస్తులను ఎట్టి పరిస్థితుల్లోనూ స్వీకరించబోమని స్పష్టం చేశారు. బాణసంచా విక్రయాలకు తాత్కాలిక లైసెన్స్‌లను పేలుడు పదార్థాల చట్టం-1884, నిబంధనలు-1983 (2008 సవరణలతో) ప్రకారం సంబంధిత జోన్ల డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ జారీ చేస్తారని తెలిపారు. దరఖాస్తుదారులు ఎఎఎజూఎర్.వశ్రీఖఅస్త్రుఖు.స్త్రశీజ.అఅ లేదా ఖఖఖ.ఎఎఎవతీఖఘఃజూశీశ్రీఅఎవ.స్త్రశీజ.అఅ వెబ్‌సైట్ల ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ సూచించారు.

ఏఐసీసీ పీసీసీ పిలుపు మేరకు చలో ఢిల్లీ.

మంచిర్యాల జిల్లా ప్రతినిధి (లోకల్ గైడ్) : నవంబర్1న కేంద్ర ప్రభుత్వ వ్యతిరేక విధానాలకు నిరసనగా ఢిల్లీలోని రాంలీల మైదానంలో జరగబోయే భారీ బహిరంగ సభకు మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు,మంచిర్యాల జిల్లా మాజీ డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ ల ఆధ్వర్యంలో మంచిర్యాల నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు శుక్రవారం చలో ఢిల్లీ బయలుదేరి వెళ్లారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతు ఓటు చోరీకి వ్యతిరేకంగా ఎన్నికల సంఘంలో జరుగుతున్న అక్రమాలకు బాధ్యత వహిస్తు ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి,టీపీసీసీ అధ్యక్షులు,ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ నాయకత్వంలో నిర్వహించనున్న ఈ నిరసన కార్యక్రమాన్ని ఎన్ని శక్తులు ఎదురు వచ్చినా విజయవంతం చేస్తామని తెలిపారు.

తాడ్వాయి మండల స్థాయి క్రీడలలో పాల్గొన్న ఎమ్మెల్యే మదన్ మోహన్

లోకల్ గైడ్ (30అక్టోబర్ కామారెడ్డి టౌన్) : బ్రాహ్మణపల్లిగ్రాూ పాఠశాలలో నిర్వహించిన గా+ఖీ తాడ్వాయి మండల స్థాయి క్రీడా పోటీల్లో పాల్గొన్న ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ గారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని, క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, పట్టుదలను పెంపొందిస్తాయని తెలిపారు. అలాగే బ్రాహ్మణపల్లి గ్రాూ పాఠశాల అభివృద్ధికి నాబార్డ్ (చీూదీూ=ణ) నిధుల కింద రూ.1 కోటి 8 లక్షల వ్యయంతో 8 అదనపు తరగతి గదులు మరియు కిచెన్ షెడ్‌ను ప్రత్యేకంగా మంజూరు చేయించినట్లు ఎమ్మెల్యే గారు వెల్లడించారు. విద్యార్థులకు మెరుగైన తరగతి గదులు, అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలనే లక్ష్యంతో ఈ నిధులు మంజూరు చేయించినట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు క్రీడల్లోనూ తగిన ప్రోత్సాహం అందించేందుకు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. విద్య, క్రీడలు, మౌలిక సదుపాయాల అభివృద్ధే లక్ష్యంగా ఎల్లారెడ్డి నియోజకవర్గ ప్రగతికి కృషి చేస్తున్నానని ఎమ్మెల్యే మదన్ మోహన్ గారు తెలిపారు

ఓటు హక్కు పరిరక్షణ కోసం ఢిల్లీకి వికారాబాద్ జిల్లా కాంగ్రెస్ నాయకులు

ఓట్ చోరీకి వ్యతిరేకంగా గళమెత్తుదాం -- చలో ఢిల్లీ!

లోకల్ గైడ్ వికారాబాద్ జిల్లా బ్యూరో ప్రతినిధి : దేశంలో ఓటు హక్కు పరిరక్షణే లక్ష్యంగా, ఓట్ చోరీకి వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ పిలుపునిచ్చిన "చలో ఢిల్లీ" కార్యక్రమానికి వికారాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు మరియు పార్టీ శ్రేణులు శుక్రవారం పెద్ద ఎత్తున బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... దేశంలో ప్రజాస్వామ్య విలువలను కాపాడటం, ప్రతి పౌరుడి పవిత్రమైన ఓటు హక్కును పరిరక్షించడం మనందరి ప్రాథమిక బాధ్యత అని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేందుకు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఈ పోరాటాన్ని ఉధృతం చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వికారాబాద్, పరిగి, తాండూరు నియోజకవర్గాలకు చెందిన కాంగ్రెస్ నాయకులతో పాటు వికారాబాద్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మల్లేశం, పార్టీ ముఖ్య నాయకులు కర్ణాకర్ రెడ్డి, భాస్కర్, నర్సప్ప, ప్రవీణ్, విజయ్ కుమార్, రాజు తదితరులు పాల్గొన్నారు.

చలో ఢిల్లీ బయలుదేరిన బెల్లంపల్లి కాంగ్రెస్ నాయకులు....

బెల్లంపల్లి (లోకల్ గైడ్) : బ్రిటిష్ పాలకుల వారసత్వాన్ని కొనసాగిస్తున్న బిజెపి మోదీ అమిత్ షా చెపరాశి సిఈసి జ్ఞానేష్ కుమార్ ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తు ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ,పార్లమెంటు సభ్యురాలు ప్రియాంక గాంధీ వాద్రాల ఆధ్వర్యంలో జరిగే భారీ నిరసన కార్యక్రమం,నవంబర్1న చేపట్టిన ర్యాలీకి బెల్లంపల్లి శాసనసభ్యులు గడ్డం వినోద్ పిలుపు మేరకు పెద్ద ఎత్తున బెల్లంపల్లి కాంగ్రెస్ నాయకులు శుక్రవారం ఢిల్లీ బయలుదేరి వెళ్లారు.బెల్లంపల్లి పట్టణ అధ్యక్షులు బండి ప్రభాకర్ యాదవ్,టిపిసిసి సభ్యులు చిలుముల శంకర్ ల ఆధ్వర్యంలో పట్టణ కాంగ్రెస్ అధికార ప్రతినిధి దేవసాని ఆనంద్ వారికి కాంగ్రెస్ సిద్ధాంతాలు తెలిపి ప్రేరణ చేసి నిరసనను విజయవంతం చేసేందుకు వెనుకడుగు వేయకుండా ముందుకు సాగేందుకు కృత నిశ్చయంతో ఉండాలని తెలిపారు.భారత ప్రజాస్వామ్యం కల్పించిన ఓటు హక్కును దుర్వినియోగం చేస్తున్న దేశద్రోహి భారత ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ గో బ్యాక్ వరకు ప్రజాస్వామ్యం,ఓటు హక్కుల కోసం జరుగుతున్న పోరాటానికి వెనక అడుగు వేసే ప్రసక్తే లేదని అన్నారు.ఇది ఒక పార్టీ కొట్లాట కాదని భారతీయుల ఆత్మగౌరవం అని అన్నారు.సామాన్యులకు భరోసా దేశానికి నమ్మకమైన పాలన రావాలంటే కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావాల్సిందేనని,రాహుల్ గాంధీని ప్రధానమంత్రిని చేసేందుకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో కె రాజేష్,డి రమేష్ పట్టణ జనరల్ సెక్రటరీ,ఎండి వాజిద్,కలీల్,కాంపెల్లి సతీష్,కె శ్రీనివాస్,చుంచుల వెంకటేష్,అలీ,సాయికుమార్,గద్దల కుమార్,పోతు మురళి,గట్టయ్య,చక్రధర్,మల్లయ్యతదితరులు పాల్గొన్నారు.

మంత్రి కోమటిరెడ్డి సహకారంతో నల్లగొండలో కోట్లాది రూపాయలతో అభివృద్ధి

నగర మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాసరెడ్డి.

నల్లగొండ ఉమ్మడి జిల్లా ప్రతినిధి . లోకల్ గైడ్ : సాగర్ రోడ్డులో వైయస్సార్ విగ్రహం నుంచి చర్లగౌరారం రోడ్డు వరకు ఆరు లైన్ల రోడ్డు విస్తరణకు శంకుస్థాపన నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ లో అన్ని డివిజన్లో పార్టీల కతీతంగా అభివృద్ధి చేయడం జరుగుతుందని నగర మేయర్ శ్రీమతి బుర్రి చైతన్య శ్రీనివాసరెడ్డి అన్నారు.మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి గారి ఆదేశాల మేరకు శుక్రవారం నల్లగొండ పట్టణం సాగర్ రోడ్డు వైయస్సార్ విగ్రహం నుంచి చర్లగౌరారం రోడ్డు వరకు ఆరు లైన్ల రోడ్డు విస్తరణ పనులకు స్థానిక కార్పొరేటర్, పార్టీ శ్రేణులతో కలిసి ఆమె శంకుస్థాపన చేశారురోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని తెలియడంతో ఇటీవల ఈ రోడ్డును పరిశీలించడం జరిగిందని అన్నారు. డివైడర్, సెంట్రల్ లైటింగ్ లో ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. ఈ విషయాన్ని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి గారి దృష్టికి తీసుకువెళ్లడంతో ఆయన వెంటనే స్పందించి ఆరు లైన్ల రోడ్డు విస్తరణకు నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు. ఇప్పటికే నల్గొండ పట్టణంలో కోట్లాది రూపాయలతో ఎన్నో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని తెలిపారు. ఇటీవల పానగల్ ఛాయా సోమేశ్వరాలయ అభివృద్ధికి మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి రూ. 20 కోట్లు నిధులు మంజూరు చేశారని అన్నారు. పానగల్ నుంచి డీఈఓ ఆఫీస్ వరకు కూడా రోడ్డు విస్తరణ పనులు చేపట్టడం జరుగుతుందని వెల్లడించారు.నల్లగొండలో పర్యాటకంగా, ఆధ్యాత్మికంగా మరింత అభివృద్ధి చేసేందుకు బ్రహ్మంగారి గుట్ట, లతీఫ్ సాబ్ గుట్టలకు ఘాట్ రోడ్డు నిర్మించడం జరుగుతుందని తెలిపారు. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సహకారంతో నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ ను స్మార్ట్ సిటీగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ముందుకు పోతున్నామని పేర్కొన్నారు.కార్పొరేషన్ లోని అన్ని డివిజన్లో అభివృద్ధి చేయడం జరుగుతుందని స్పష్టం చేశారు. ఛాయా సోమేశ్వరాలయం అభివృద్ధికి, సాగర్ రోడ్డు ఆరు లైన్ల రోడ్డు విస్తరణ పనులకు నిధులు మంజూరు చేసిన సందర్భంగా నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ పాలకవర్గం, పట్టణ ప్రజల తరఫున మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి ఈ సందర్భంగా మేయర్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి గుమ్ముల మోహన్ రెడ్డి నల్లగొండ మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, డిప్యూటీ మేయర్ మహమ్మద్ అష్రఫ్ అలీ అమేర్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్ గౌడ్, స్థానిక కార్పొరేటర్ పాలకూరి సుమలత సంతోష్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎడ్ల శ్రీనివాస్ యాదవ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్, కార్పొరేటర్లు, మాజీ కౌన్సిలర్లు గుండబోయిన వెంకన్న యాదవ్, మామిడి కార్తీక్, రేగట్ట లింగస్వామి గౌడ్, ఇటికాల శ్రీనివాస్, ఏదుళ్ళ శ్రీధర్ రెడ్డి, వజ్జ రమేష్ యాదవ్, ప్రదీప్ నాయక్, చిన్నాల జానయ్య, దీప్లా నాయక్, పిల్లి కృష్ణంరాజు, సట్టు శంకర్, జూలకంటి శ్రీనివాస్, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ రాష్ట్రం లో అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చెయ్యాలి.

రాష్ట్రం లో పది సెంటర్ లు ఏర్పాటు చేయాలీ .

అగ్రిగోల్డ్ బాధితుల సంఘం జిల్లా అధ్యక్షులు పల్లా దేవేందర్ రెడ్డి

నల్లగొండ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.లోకల్ గైడ్ : తెలంగాణ రాష్ట్రంలో అగ్రిగోల్డ్ బాధితుల బాండ్ల పరిశీలనకు 10 కేంద్రాలు ఏర్పాటు చేయాలని, విజయవాడ కేంద్రంగా ఏర్పాటుచేసిన ప్రత్యేక కోర్టు వెంటనే అమల్లోకి తేవాలని, త్వరితగతిలో అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయాలని తెలంగాణ అగ్రిగోల్డ్ బాధితుల సంఘం నల్గొండ జిల్లా అధ్యక్షులు పల్లా దేవేందర్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. .అగ్రిగోల్డ్ బాధితుల సంఘం సమావేశం దేవరకొండ సిపిఐ కార్యాలయం లో శుక్రవారం ఏం యాదగిరి అధ్యక్షత న జరిగింది. ఈ సందర్భంగా పల్లా దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ గడిచిన 12 సంవత్సరాలు గా పోరాడుతున్నా పాలకులు పట్టించుకోవటం లేదని భాదను వ్యక్తం చేసారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వెంటనే సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.అగ్రిగోల్డ్ బాధితుల బాండ్ల పరిశీలనకు రాష్ట్రంలో 10 కేంద్రాలు ఏర్పాటు చేయాలని లేకపోతే బాధితులు వందల కిలోమీటర్ల దూరం ప్రయాణం చేయాల్సి వస్తుందని, తద్వారా వారిపై ఆర్థిక భారం పడుతుందని చెప్పారు. తెలంగాణలో 3 సెంటర్ లకు బదులు 10 కేంద్రాలు ఏర్పాటు చేస్తే బాధితులకు సౌలభ్యంగా ఉంటుందని సూచించారు. అగ్రిగోల్డ్ భాదితులు ధైర్యంగా ఉండాలని సమస్య పరిష్కారానికి అసోసియేషన్ నాయకులు చిత్తశుద్ధితో పనిచేస్తున్నారని చెప్పారు. కోర్టు పర్యవేక్షణలో అగ్రిగోల్డ్ భూములకు వేలం నిర్వహించాలని, భూములను చిన్నచిన్న కమతాలుగా చేసి బహిరంగ వేలం ద్వారా విక్రయించడం వలన అధిక మొత్తంలో డబ్బు సమకూరుతుందని చెప్పారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో వెరిఫికేషన్ సెంటర్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో అగ్రిగోల్డ్ బాధితుల సంఘం నాయకులు ఏం యాదగిరి జి శ్రీనివాస్ , వి కేశవులు, బి కుమార్, డి సతీష్, ఆర్ వెంకన్న, వనం భాస్కర్, సిహెచ్ రాజేష్,ఎ సుమతి ,జి హేమలత, వి బాబు, సంతోష లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

RNI NO. APBIL/2013/50718
LOCAL GUIDE Bi-Lingual Daily Published From Rangareddy
లోకల్ గైడ్
ఎడిటర్: చిలకమర్రి రంరెడ్డి
ద్విభాషా దినపత్రిక
www.localguidenews.com

ఉసిరితో కలిపి..

చలికాలం మొదలైంది. వాతావరణంలో మార్పులతో వైరల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉంటుంది. కాబట్టి, ఆహారం, ఆరోగ్యం విషయంలో ప్రత్యేక శ్రద్ధ చూపాల్సిన అవసరం ఉన్నది. ముఖ్యంగా, సీజనల్ పండ్లతో కలిగే ఆరోగ్య ప్రయోజనాలు అందిపుచ్చుకోవడం మంచిది. చలికాలంలో ఉసిరికాయలు ఎక్కువగా దొరుకుతాయి. కాలానుగుణంగా కాసే ఉసిరితో ఆరోగ్యానికి ఎన్నో రకాలుగా ప్రయోజనం కలుగుతుంది. ఇక ఒంట్లో వేడిని పెంచడంలో మిరియాలు ముందుంటాయి. ఈ రెండిటినీ కలిపి తీసుకోవడం ద్వారా.. పలు అనారోగ్య సమస్యలు దూరమవుతాయి. ఉసిరిలో విటమిన్ ఎ, సి, ఇతోపాటు ఐరన్, క్యాల్షియం, ఫైబర్, వివిధ రకాల యాంటి ఆక్సిడెంట్లు పుష్కలంగా లభిస్తాయి. మిరియాల్లోనూ విటమిన్ ఎ, కె, ఇ, బి1, బి2, బి5, బి6, కాపర్, మాంగనీస్, ఐరన్, క్యాల్షియం, పొటాషియం, సెలీనియం, జింక్, క్రోమియం వంటి క్రియాశీల సమ్మేళనాలు అనేకం ఉంటాయి. ఈ రెండూ కలిస్తే.. శక్తిమంతమైన ఔషధం తయారవుతుంది. చలికాలంలో ఎదురయ్యే సాధారణ సమస్య.. జలుబు. దీనికి ఉసిరి, మిరియాలకు మించిన ఇంటి ఔషధం లేదు. ఈ రెండిటినీ కలిపి తీసుకుంటే.. సర్వరోగ నివారిణిగా పనిచేస్తుందని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు. ఉసిరిలోని విటమిన్ సి.. రోగనిరోధక శక్తిని పెంచుతుంది. శరీరాన్ని సమతుల్యం చేస్తుంది. మిరియాలు శరీరానికి అంతర్గతంగా వెచ్చదనాన్ని అందిస్తాయి. శ్లేష్మం పేరుకుపోకుండా నివారిస్తాయి. ఉసిరి, మిరియాలలో యాంటి బ్యాక్టీరియల్, యాంటి వైరల్ లక్షణాలు పుష్కలం. చలికాలం ఇన్ఫెక్షన్లను దూరం చేయడంలో ఇవి ముందుంటాయి. శ్వాసకోశ వ్యవస్థను శుభ్రం చేయడంతోపాటు వివిధ రకాల ఫ్లూ జ్వరాల నుంచి రక్షణ కల్పిస్తాయి. ఉసిరిలో విటమిన్ సి పుష్కలంగా లభిస్తుంది. దీనిని శరీరం పూర్తిగా శోషించుకోవడానికి,

మిరియాలలోని పైపెరిన్ సాయపడుతుంది. చర్మం, జుట్టు ఆరోగ్యంలో ఉసిరి కీలకంగా ఉంటుంది. దాన్ని మిరియాలతో కలిపి తీసుకుంటే.. ఆయా ప్రయోజనాలు రెట్టింపవుతాయి. వీటిలోని విటమిన్ సి.. కొల్లాజెన్ ఉత్పత్తిని ప్రోత్సహిస్తుంది. అది చర్మం ముడతలు పడకుండా కాపాడుతుంది. వృద్ధాప్య ఛాయలను దూరం చేస్తుంది. జుట్టుకు కావాల్సిన పోషణ అంది.. బలంగా తయారవుతుంది. ఈ రెండిటినీ కలిపి తినడం వల్ల శరీరంలో తెల్ల రక్త కణాలతోపాటు రోగనిరోధక శక్తి పెరుగుతుంది. జీర్ణవ్యవస్థ, కాలేయం ఆరోగ్యానికి ఉసిరి, మిరియాలు రెండూ భరోసా ఇస్తాయి. శరీరంలోని విష పదార్థాలను బయటికి పంపడంలో సాయపడతాయి. జీర్ణక్రియనూ మెరుగుపరుస్తాయి.

రోజూ అసలు వాకింగ్ ఎంత సేపు చేయాలి..? ఎన్ని క్యాలరీలు ఖర్చవుతాయి..?

పూర్వం ఒకప్పుడు ప్రజలు రోజూ శారీరక శ్రమ చేసేవారు. గంటల తరబడి ఏదో ఒక పనిచేస్తూనే ఉండేవారు. కనుకనే వారు ఎక్కువ కాలం పాటు ఎలాంటి రోగాలు రాకుండా ఆరోగ్యంగా జీవించగలిగేవారు. కానీ ప్రస్తుతం అధిక శాతం మంది గంటల తరబడి కూర్చుని పనిచేసే ఉద్యోగాల్లోనే ఉంటున్నారు. శారీరక శ్రమ పూర్తిగా తగ్గింది. చాలా మంది అసలు రోజూ కనీసం వ్యాయామం కూడా చేయడం లేదు. దీని వల్ల అనేక రోగాలు వస్తున్నాయి. అయితే ఆరోగ్యంగా ఉండేందుకు సరైన ఆహారం తీసుకోవడం ఎంత ముఖ్యమో రోజూ వ్యాయామం చేయడం కూడా అంతే అవసరమని వైద్యులు చెబుతున్నారు. రోజూ వ్యాయామం చేయడం వల్ల అనేక లాభాలు ఉంటాయని వారు అంటున్నారు. అయితే రోజూ కఠినమైన వ్యాయామాలను చేయాల్సిన అవసరం లేదు. వాకింగ్ చేసినా చాలు, అనేక లాభాలు కలుగుతాయని వారు సూచిస్తున్నారు. వాకింగ్‌ను రోజువారి దినచర్యలో భాగం చేసుకోవాలని అంటున్నారు.

వాకింగ్ వల్ల కలిగే లాభాలు..

వాకింగ్ చేయడం వల్ల మనకు అనేక లాభాలు కలుగుతాయి. శరీరంలో రక్త సరఫరా మెరుగు పడి బీపీ నియంత్రణలో ఉంటుంది. హైబీపీ ఉన్నవారికి వాకింగ్ ఎంతో మేలు చేస్తుంది. దీని వల్ల గుండె జబ్బులు, స్ట్రోక్స్ రాకుండా చూసుకోవచ్చు. కొలెస్ట్రాల్ స్థాయిలు సైతం నియంత్రణలో ఉంటాయి. వాకింగ్ చేయడం వల్ల శరీరం క్యాలరీలను సులభంగా ఖర్చు చేస్తుంది. దీంతో శరీరంలో పేరుకుపోయిన కొవ్వు కరిగిపోతుంది. దీంతో అధిక బరువు తగ్గుతారు. వాకింగ్ వల్ల డయాబెటిస్ ఉన్నవారికి ఎంతో మేలు జరుగుతుంది. షుగర్ లెవల్స్‌ను ఎల్లప్పుడూ నియంత్రణలో ఉంచుకోవచ్చు. వాకింగ్ చేస్తే ఎముకలు, కండరాలు దృఢంగా మారి ఆరోగ్యంగా ఉంటాయి. శారీరక దృఢత్వం లభిస్తుంది. దేహం దృఢంగా మారి ఆరోగ్యంగా ఉంటుంది. మానసిక ఆరోగ్యానికి కూడా వాకింగ్ మేలు చేస్తుంది. వాకింగ్ వల్ల మూడ్ మారుతుంది. ఒత్తిడి, ఆందోళన, డిప్రెషన్ తగ్గి మైండ్ రిలాక్స్ అవుతుంది. మానసిక ప్రశాంతత లభిస్తుంది. రాత్రి పూట చక్కగా నిద్ర పడుతుంది. పడుకున్న వెంటనే గాఢ నిద్రలోకి జారుకుంటారు. నిద్రలేమి తగ్గుతుంది.

ఎంత సేపు చేయాలి..?

ఇక వాకింగ్ చేయడం వల్ల లాభాలు కలుగుతాయని అందరికీ తెలుసు. కానీ రోజూ ఎన్ని నిమిషాల పాటు వాకింగ్ చేయాలని చాలా మంది సందేహాలు వ్యక్తం చేస్తుంటారు. ఇందుకు ఫిట్ నెస్ నిపుణులు ఏమని సమాధానాలు చెబుతున్నారంటే.. అమెరికన్ హార్ట్ అసోసియేషన్, అమెరికన్ డయాబెటిస్ అసోసియేషన్ చెబుతున్న ప్రకారం ప్రతి మనిషికి వారానికి కనీసం 150 నిమిషాల వ్యాయామం అవసరం. అంటే వారంలో కనీసం 5 రోజుల పాటు రోజుకు 30 నిమిషాల పాటు అయినా సరే వ్యాయామం చేయాల్సి ఉంటుందన్నమాట. దీని వల్ల ఆరోగ్యంగా ఉండవచ్చు. కనుక వాకింగ్ కూడా ఇలా చేస్తే సరిపోతుంది. రోజుకు 30 నిమిషాల పాటు వాకింగ్ చేయాలి. వారంలో అలా 5 రోజుల పాటు చేస్తే చాలు, దీంతో వారానికి 150 నిమిషాల కోటా పూర్తవుతుంది. ఇలా వాకింగ్ చేస్తున్నా ఆరోగ్యంగా ఉండవచ్చు. అయితే సమయం ఉందని భావించే వారు రోజుకు కనీసం 60 నిమిషాల పాటు వాకింగ్ చేస్తే ఇంకా ఎంతో మేలు జరుగుతుందని ఫిట్ నెస్ నిపుణులు చెబుతున్నారు.

ఎన్ని క్యాలరీలు ఖర్చవుతాయి..?

ఇక వాకింగ్‌ను మొదలు పెట్టేవారు ముందుగా రోజుకు 10 నిమిషాలపాటు వాకింగ్ చేయాలి. శరీరం అలవాటు పడే కొద్దీ సమయాన్ని పెంచుతూ పోవాలి. ఇలా క్రమం తప్పకుండా చేస్తుంటే రోజుకు 60 నిమిషాల పాటు వాకింగ్‌ను చాలా సులభంగా చేయవచ్చు. ఒక మోస్తరు వేగంతో వాకింగ్ చేస్తే గంటకు సుమారుగా 200 క్యాలరీల వరకు ఖర్చు చేయవచ్చు. అదే సాధారణ వేగంతో వాకింగ్ చేస్తే గంటకు సుమారుగా 150 క్యాలరీల వరకు ఖర్చు చేయవచ్చు. ఉదయం ఖాళీ కడుపుతో వాకింగ్ చేస్తే ఇంకా ఎక్కువ క్యాలరీలను ఖర్చు చేసేందుకు అవకాశం ఉంటుంది. ఈ విధంగా రోజూ వాకింగ్ చేయడం వల్ల ఎన్నో లాభాలను పొందవచ్చు.

మీ కిడ్నీలు ఎల్లప్పుడూ శుభ్రంగా, ఆరోగ్యంగా ఉండాలంటే.. ఈ ఆహారాలను తప్పనిసరిగా తినాల్సిందే..!

మన శరీరంలో ఎప్పటికప్పుడు ఉత్పత్తి అయ్యే వ్యర్థాలను కిడ్నీలు మూత్రం ద్వారా బయటకు పంపిస్తాయి. దీంతో శరీరంలో వ్యర్థాలు పేరుకుపోకుండా ఉంటాయి. ఆరోగ్యంగా ఉంటాము. అయితే మనం పాటించే ఆహారపు అలవాట్లు, జీవనశైలి, దీర్ఘకాలిక వ్యాధులు, వాడే మందులు వంటి కారణాల వల్ల మన కిడ్నీల పనితీరు మందగిస్తుంది. దీంతో వ్యర్థాలను కిడ్నీలు సరిగ్గా బయటకు పంపలేకపోతాయి. దీని వల్ల దీర్ఘకాలంలో శరీరంలో వ్యర్థాలు పేరుకుపోతాయి. ఇవి అనేక వ్యాధులను కలగజేస్తాయి. అందువల్ల కిడ్నీలను మనం ఆరోగ్యంగా ఉంచుకోవాలి. కిడ్నీలు ఎప్పటికప్పుడు వ్యర్థాలను బయటకు పంపిస్తూ శుభ్రంగా ఉండాలి. అప్పుడే మనం ఆరోగ్యంగా ఉంటాం. అయితే పలు రకాల ఆహారాలను తీసుకోవడం వల్ల కిడ్నీలను శుభ్రంగా, ఆరోగ్యంగా ఉంచుకోవచ్చు. దీని వల్ల ఇతర వ్యాధులు రాకుండా కూడా అడ్డుకోవచ్చు.



బీట్ రూట్, నిమ్మరసం..

మనం బీట్‌రూట్‌ను అప్పుడప్పుడు తింటుంటాం. కానీ బీట్‌రూట్‌ను రోజువారి ఆహారంలో కచ్చితంగా భాగం చేసుకోవాలి. బీట్ రూట్‌లో పొటాషియం, నైట్రేట్లు, యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇవి కిడ్నీలను శుభ్రం చేసి ఆరోగ్యంగా ఉంచుతాయి. రోజూ ఒక కప్పు బీట్ రూట్ ముక్కలను తింటుండాలి. లేదా ఒక కప్పు బీట్ రూట్ జ్యూస్‌ను అయినా తాగవచ్చు. దీని వల్ల కిడ్నీల ఆరోగ్యం మెరుగు పడుతుంది. కిడ్నీ వ్యాధులు రాకుండా ఉంటాయి. అలాగే కిడ్నీల ఆరోగ్యానికి నిమ్మరసం కూడా ఎంతగానో పనిచేస్తుంది. నిమ్మరసంలో విటమిన్ సి ఉంటుంది. ఇది కిడ్నీలను శుభ్రం చేస్తుంది. కిడ్నీ స్టోన్లు ఏర్పడకుండా రక్షిస్తుంది. కిడ్నీల పనితీరు మెరుగు పడేలా చేస్తుంది. అదేవిధంగా అల్లం రసం కూడా ఎంతగానో మేలు చేస్తుంది. రోజూ ఉదయం పరగడుపునే అల్లం రసాన్ని ఒక టీస్పూన్ మోతాదులో తాగుతుంటే ఎంతగానో ఫలితం ఉంటుంది. దీని వల్ల కిడ్నీలు క్లీన్ అవడమే కాదు, జీర్ణ వ్యవస్థ ఆరోగ్యంగా ఉంటుంది. దగ్గు, జలుబు వంటి శ్వాసకోశ సమస్యలు తగ్గుతాయి. బరువు తగ్గేందుకు కూడా అల్లం రసం పనిచేస్తుంది.

కొబ్బరినీళ్లు, యాపిల్ సైడర్ వెనిగర్..

కొబ్బరినీళ్లను రోజూ తాగడం వల్ల శరీరానికి ఎంతో మేలు జరుగుతుంది. దీని వల్ల శిరోజాలు, చర్మం సురక్షితంగా, ఆరోగ్యంగా ఉంటాయి. అలాగే కిడ్నీ సమస్యలు రాకుండా అడ్డుకోవచ్చు. కిడ్నీలు శుభ్రంగా మారుతాయి. కొబ్బరినీళ్లలో ఉండే ఎలక్ట్రోలైట్స్ కిడ్నీలను సురక్షితంగా ఉంచుతాయి. అయితే వీటిని రోజుకు 1 గ్లాస్ కు మించి తాగకూడదు. అలాగే కిడ్నీల ఆరోగ్యానికి యాపిల్ సైడర్ వెనిగర్ కూడా పనిచేస్తుంది. రోజూ ఉదయం పరగడుపునే ఒక గ్లాస్ గోరు వెచ్చని నీటిలో ఒక టీస్పూన్ యాపిల్ సైడర్ వెనిగర్ కలిపి తాగుతుంటే కిడ్నీలు క్లీన్ అయి ఆరోగ్యంగా ఉంటాయి. అలాగే బరువు తగ్గేందుకు కూడా ఇది ఎంతగానో పనిచేస్తుంది. షుగర్, కొలెస్ట్రాల్ స్థాయిలను సైతం అదుపులో ఉంచుతుంది. ఇక కిడ్నీలను ఆరోగ్యంగా ఉంచేందుకు గాను పలు పండ్లు కూడా సహాయం చేస్తాయి. స్ట్రాబెర్రీలు, చెర్రీలు, యాపిల్స్, క్రాన్ బెర్రీలు, ద్రాక్ష, పైనాపిల్ వంటి పండ్లను తింటుంటే మేలు జరుగుతుంది.

ఈ ఆహారాలు కూడా అవసరమే..

అరటి పండ్లు, నారింజ పండ్లలో పొటాషియం అధికంగా ఉంటుంది. ఇది శరీరంలోని సోడియం స్థాయిలను తగ్గిస్తుంది. దీని వల్ల కిడ్నీలు శుభ్రంగా మారి ఆరోగ్యంగా ఉంటాయి. అలాగే కాలిఫ్లవర్, క్యాబేజీ, ఎరుపు రంగు క్యాప్సికం, ముల్లంగి వంటి కూరగాయలను తింటున్నా కూడా కిడ్నీలు ఆరోగ్యంగా ఉంటాయి. కోడిగుడ్డు తెల్ల సొన, స్కిన్ లెస్ చికెన్, చేపలు, ఆలివ్ ఆయిల్, వెల్లుల్లి, ఉల్లిపాయలు వంటి ఆహారాలను కూడా తీసుకోవచ్చు. అయితే కిడ్నీలు ఎల్లప్పుడూ శుభ్రంగా, ఆరోగ్యంగా ఉండేందుకు గాను ఆహారంలో ఉప్పు తీసుకోవడం తగ్గించాలి. సోడియం తక్కువగా ఉండే ఆహారాలను తినాలి. మద్యం సేవించడం, పొగ తాగడం మానేయాలి. ఆకుకూరలు, కూరగాయలను, పండ్లను తినేందుకు అధిక ప్రాధాన్యతను ఇవ్వాలి. అలాగే రోజూ నీళ్లను తగిన మోతాదులో తాగాలి. ఇలా ఆహారపు అలవాట్లను పాటిస్తుంటే కిడ్నీలు శుభ్రంగా ఆరోగ్యంగా ఉంటాయి.

వేసవి హీట్‌కు స్మార్ట్ ట్రీట్.. సమ్మర్ స్పెషల్ గాడ్జెట్స్!

వేసవిలో వేడి ఎంత పెరిగినా, మిమ్మల్ని కూల్‌గా, కంఫర్ట్‌గా ఉంచే, బెస్ట్ హెల్పర్స్.. ఈ సమ్మర్ స్పెషల్ గాడ్జెట్స్!

అరచేత్తో ఐస్ గోలా!

వేసవిలో చల్లచల్లగా ఐస్ గోలా తినాలని అనిపిస్తుందా? కానీ హైజీన్ గురించి ఆలోచించి వెనక్కి తగ్గుతున్నారా? అయితే ఇక టెన్షన్ అవసరం లేదు. ఎందుకంటే, మీ కళ్ల ముందే స్వచ్ఛమైన 'గోలా'ను తయారుచేసి ఇస్తుంది ఈ ఐస్ గోలా మేకర్! పైగా దీనికి కరెంట్‌తో పనిలేదు. ఎందుకంటే ఇది చేత్తో తిప్పే మాన్యువల్ మ్యాజిక్ మెషిన్. ఇందులో ఉన్న తుప్పుపట్టని షార్ప్ బ్లేడ్లు క్షణాల్లో గట్టి ఐస్ గడ్డలను 'మంచు పొడి'గా మార్చేస్తాయి. దీనితో పాటు 3 బౌల్స్, 6 రీయూజబుల్ స్టిక్స్, ఒక గ్లాస్ కూడా వస్తాయి. ఇంట్లో ఉన్న ఐస్ ముక్కలు వేయడం, హ్యాండిల్ తిప్పడం, మీ ఫేవరెట్ ఫ్లేవర్ వేసుకోవడం.. అంతే, హోమ్ మేడ్ ఐస్ గోలా రెడీ! ధర రూ. 460 మాత్రమే.

పోర్టబుల్ వాటర్ కంటైనర్

పిక్నిక్‌లో 'నీళ్లు ఎక్కడ?' అన్న ప్రశ్నకు స్టయిల్‌గా సమాధానం చెప్పండి. బ్యాగ్‌లో నుంచి ఈ పోర్టబుల్ డ్రింక్ స్టోరేజ్‌ను తెరిచి, ఒకేసారి క్షణంలో పదిమందికి పైగా నీళ్లను అందించండి. ఎందుకంటే, ఇది మామూలు కంటైనర్ కాదు, ఎక్కడికైనా ఈజీగా తీసుకెళ్లి, వెంటనే వాడుకునే స్మార్ట్ డ్రింక్ స్టోరేజ్! వాడనప్పుడు సైలెంట్‌గా మడుచుకుని బ్యాగ్‌లో కూర్చుంటుంది. కానీ ఓపెన్ చేస్తే ఒక్కసారిగా 5.5 లీటర్ల 'డ్రింక్ స్టేషన్' గా మారిపోతుంది! జ్యూస్, నీళ్లు లేదా కూల్ డ్రింక్స్ నింపి ట్యాప్ ద్వారా సులభంగా సర్వ్ చేసుకోవచ్చు. లైట్‌వెయిట్ కాబట్టి మోసుకెళ్లడం ఈజీ. ధర రూ. 599 మాత్రమే!

చల్లగా.. వేడిగా.. ఒక్క బౌల్‌లోనే!

పార్టీలు, గెట్ టుగెదర్స్ లేదా ఇంట్లో స్పెషల్ సర్వింగ్ కోసం మీ ఫుడ్ ఎక్కువసేపు అదే టెంపరేచర్‌లో ఉండాలని అనుకుంటున్నారా? అయితే ఈ డిప్ చిల్లర్ బౌల్ మీకు పర్ఫెక్ట్ చాయిస్! ఇది మామూలు గిన్నె కాదు, మీ ఫుడ్‌ను చల్లగా లేదా వేడిగా ఎక్కువసేపు అలాగే ఉంచే స్మార్ట్ సర్వింగ్ సొల్యూషన్. దీనిలో డబుల్ వాల్ ఇన్సులేషన్ ఉంటుంది. చల్లని వంటకాలకు బౌల్‌లో నీళ్లు నింపి ఫ్రీజ్ చేస్తే, సాల్సా, ఐస్‌క్రీమ్, డ్రింక్స్ లాంటి వాటిని ఎక్కువసేపు చల్లగా ఉంచుతుంది. అలాగే వేడి నీళ్లు పోస్తే, నూడుల్స్, సూప్, పాస్తా లాంటి వేడి వంటకాలు కూడా ఎక్కువసేపు వేడిగా ఉంటాయి. ఫుడ్ గ్రేడ్ స్టెయిన్లెస్ స్టీల్‌తో తయారైన ఈ బౌల్ స్ట్రాంగ్‌గా ఉంటుంది. ధర రూ. 1,200 మాత్రమే!

శరీరంలో రక్త సరఫరా సరిగ్గా లేకపోతే కనిపించే లక్షణాలు ఇవే.. ఈ ఆహారాలను తినాలి..!

మన శరీరంలో అన్ని భాగాలకు, కణాలకు ఆక్సిజన్, పోషకాలు సరిగ్గా రవాణా అయ్యేందుకు గాను రక్త సరఫరా వ్యవస్థ నిరంతరాయంగా పనిచేస్తూనే ఉంటుంది. రక్త సరఫరా సరిగ్గా ఉంటేనే అన్ని భాగాలకు పోషకాలు, ఆక్సిజన్ లభిస్తాయి. దీంతో మనం ఆరోగ్యంగా ఉంటాం. అయితే కొన్ని రకాల కారణాల వల్ల కొందరిలో రక్త సరఫరా సరిగ్గా ఉండదు. దీంతో పలు వ్యాధులు వస్తుంటాయి. పెరిఫెరల్ ఆర్టరీ డిసీజ్ అనే వ్యాధి ఉన్నవారిలో, డయాబెటిస్ ఉన్నా, అధికంగా బరువు ఉన్నవారిలో, పొగ తాగేవారిలో, డీప్ వీన్ థ్రాంబోసిస్ (డీవీటీ) అనే సమస్య ఉన్నవారిలో, క్రానిక్ వీనస్ ఇన్‌సఫిషియెన్సీ (సీవీఐ) అనే సమస్య ఉన్నవారిలో రక్త సరఫరా సరిగ్గా ఉండదు. అలాగే నిత్యం గంటల తరబడి ఒకే చోట కూర్చుని పనిచేసేవారు, బీపీ, కొలెస్ట్రాల్ అధికంగా ఉన్నవారిలో కూడా రక్త సరఫరా సక్రమంగా ఉండదు.

రక్త సరిగ్గా లేకపోతే కనిపించే లక్షణాలు..

రక్త సరఫరా సరిగ్గా లేకపోతే మన శరీరం పలు లక్షణాలను, సంకేతాలను తెలియజేస్తుంది. చేతులు, పాదాల్లో స్పర్శ లేనట్లు అనిపిస్తుంది. కొన్ని సార్లు ఆయా భాగాల్లో సూదులతో గుచ్చినట్లు కూడా అనిపిస్తుంది. పాదాలు, మడమలు వాపులకు గురవుతాయి. వేలితో నొక్కితే సొట్ట పడుతుంది. తరచూ కండరాల నొప్పులు ఉంటాయి. ముఖ్యంగా రాత్రి పూట కాలి పిక్కలు తరచూ పట్టుకుపోతుంటాయి. రక్త సరఫరా సక్రమంగా లేనివారి శరీరం మొత్తం పాలిపోయినట్లు కనిపిస్తుంది. కళ ఉండదు. గాయాలు, పుండ్లు నెమ్మదిగా మానుతాయి. తీవ్రమైన అలసట, నీరసం ఉంటాయి. జుట్టు రాలిపోతుంది. కాళ్లు, చేతులపై ఉండే వెంట్రుకలు కూడా బాగా రాలిపోతుంటాయి. ఇవన్నీ శరీరంలో రక్త సరఫరా సక్రమంగా జరగడం లేదని తెలియజేసే లక్షణాలు.

ప్రాణాంతకం కావచ్చు..

శరీరంలో రక్త సరఫరా సక్రమంగా సరిగ్గా ఉండకపోతే దీర్ఘకాలంలో పలు అనారోగ్య సమస్యలు వస్తాయి. ముఖ్యంగా రక్త నాళాల్లో బ్లడ్ క్లాట్స్ ఏర్పడే ప్రమాదం ఉంటుంది. దీని వల్ల హార్ట్ ఎటాక్ వస్తుంది. సాధారణంగా దీన్ని కనిపెట్టలేరు. కానీ పైన తెలిపిన లక్షణాలు కనిపిస్తే మాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే డాక్టర్‌ను కలిసి పరీక్షలు చేయించుకోవాలి. ఏదైనా సమస్య ఉన్నట్లు తేలితే వెంటనే చికిత్స తీసుకోవాలి. రక్త సరఫరా సక్రమంగా లేని వారికి డాక్టర్లు మందులను సూచిస్తారు. వాటిని క్రమం తప్పకుండా వాడాల్సి ఉంటుంది. అలాగే రోజూ తప్పనిసరిగా 30 నిమిషాల పాటు వ్యాయామం చేయాలి. వేళకు భోజనం చేయాలి. నిద్రపోవాలి. రోజుకు తగినంత మోతాదులో నీళ్లను కూడా తాగాల్సి ఉంటుంది. అలాగే ఆహారం విషయంలోనూ పలు మార్పులు చేసుకోవాలి. దీని వల్ల ఈ సమస్య నుంచి బయట పడవచ్చు.

ఈ ఆహారాలను తినాలి..

రక్త సరఫరా సక్రమంగా లేని వారు కచ్చితమైన డైట్‌ను పాటించాల్సి ఉంటుంది. దీంతో ప్రాణాంతక పరిస్థితులు రాకుండా నివారించవచ్చు. ముఖ్యంగా బీట్ రూట్, పాలకూర, చేపలు, వాల్ నట్స్, అవిసె గింజలు వంటి ఆహారాలను తింటుండాలి. వీటిల్లో అనేక సమ్మేళనాలతోపాటు ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు ఉంటాయి. ఇవి రక్త నాళాలను ఆరోగ్యంగా ఉంచుతాయి. రక్త సరఫరా మెరుగు పడేలా చేస్తాయి. అలాగే ఫ్లేవనాయిడ్స్ అధికంగా ఉండే స్ట్రాబెర్రీలు, క్రాన్ బెర్రీలు, రాస్ప్ బెర్రీలను తింటున్నా కూడా ఉపయోగం ఉంటుంది. సిట్రస్ జాతికి చెందిన నిమ్మ, నారింజ వంటి పండ్లు కూడా మేలు చేస్తాయి. డార్క్ చాక్లెట్, వెల్లుల్లి, క్యాప్సికం, పసుపు వంటి ఆహారాలను తింటున్నా కూడా సమస్య తగ్గుతుంది. ఇలా రక్త సరఫరాను మెరుగు పరుచుకుని గుండెను ఆరోగ్యంగా ఉంచుకోవచ్చు.

ఏయే రకాల కూరగాయల జ్యూస్‌లను తాగితే ఎలాంటి లాభాలు కలుగుతాయో తెలుసా..?

మనం రోజూ వారి ఆహారంలో భాగంగా అనేక రకాల కూరగాయలను లేదా ఆకుకూరలను కూరలుగా చేసుకుని తింటుంటాం. ఇందులో భాగంగానే అనేక రకాల కూరగాయలు మనకు అందుబాటులో ఉన్నాయి. ఎవరైనా తమకు నచ్చిన లేదా అందుబాటులో ఉన్న కూరగాయలు లేదా ఆకుకూరలనే తరచూ తింటుంటారు. అయితే కూరగాయలను పచ్చిగా కూడా తినవచ్చు. కూరగా చేసి తినడం కన్నా కొన్ని రకాల కూరగాయలను పచ్చిగా తింటేనే మనకు ఎక్కువ ప్రయోజనాలు కలుగుతాయి. అయితే కూరగాయలను నేరుగా అలా పచ్చిగానే తినేకంటే వాటిని జ్యూస్‌లా తయారుచేసి తాగితే ఇంకా ఎక్కువ ఫలితం ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. కూరగాయలను పచ్చిగా తినడం కొందరికి కష్టమవుతుంది. అలాంటి వారు వాటితో జ్యూస్ తయారు చేస్తే చాలా సులభంగా తాగవచ్చు. ఇక ఒక్కో రకమైన కూరగాయల జ్యూస్‌ను తాగడం వల్ల మనకు భిన్న రకాల ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయి.

టమాటాలు, క్యారెట్లు..

మనకు సంవత్సరం పొడవునా అందుబాటులో ఉండే కూరగాయల్లో టమాటాలు ఒకటి. టమాటాలను నేరుగా అలాగే పచ్చిగా తినవచ్చు. కానీ జ్యూస్ చేసుకుని తాగితే ఎంతో రుచిగా ఉంటుంది. రోజూ చాలా సులభంగా తాగవచ్చు. టమాటా జ్యూస్‌ను రోజూ తాగితే రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. శరీరానికి ఐరన్ లభిస్తుంది. రక్తం వృద్ధి చెందుతుంది. రక్తహీనత తగ్గుతుంది. టమాటాల్లో ఉండే విటమిన్ ఎ కళ్లను ఆరోగ్యంగా ఉంచుతుంది. కంటి చూపును మెరుగు పరుస్తుంది. టమాటా జ్యూస్‌ను తాగడం వల్ల శిరోజాలు, చర్మం ఆరోగ్యంగా ఉంటాయి. ఎముకలు దృఢంగా మారుతాయి. షుగర్, కొలెస్ట్రాల్, బీపీ తగ్గుతాయి. గుండె ఆరోగ్యంగా ఉంటుంది. జీర్ణ వ్యవస్థ పనితీరు మెరుగు పడుతుంది. అలాగే క్యారెట్ జ్యూస్‌ను రోజూ తాగడం వల్ల కూడా మనకు ఎంతో మేలు జరుగుతుంది. ఈ జ్యూస్ వల్ల కంటి చూపు మెరుగు పడుతుంది. అధిక బరువు సులభంగా తగ్గవచ్చు. జీర్ణ సమస్యలు ఉండవు. కొలెస్ట్రాల్, బీపీ నియంత్రణలో ఉంటాయి. దీంతో గుండె ఆరోగ్యంగా ఉంటుంది. అలాగే రోగ నిరోధక వ్యవస్థ పటిష్టంగా మారుతుంది.

పాలకూర, క్యాబేజీ..

పాలకూర జ్యూస్‌ను రోజూ తాగడం వల్ల రోగ నిరోధక శక్తిని పెంచుకోవచ్చు. కళ్లు ఆరోగ్యంగా ఉంటాయి. కంటి చూపు మెరుగు పడుతుంది. క్యాన్సర్ కణాలు నాశనం అవుతాయి. క్యాన్సర్లు రాకుండా అడ్డుకోవచ్చు. హైబీపీ ఉన్నవారు ఈ జ్యూస్‌ను రోజూ తాగుతుంటే ఎంతో ఫలితం ఉంటుంది. దీని వల్ల చర్మం, శిరోజాలు ఆరోగ్యంగా ఉంటాయి. ఎముకలకు బలం లభిస్తుంది. కీళ్ల నొప్పులు, వాపులు తగ్గిపోతాయి. ఆర్థరైటిస్ నుంచి ఉపశమనం లభిస్తుంది.

అలాగే రక్తహీనత తగ్గుతుంది. అలాగే రోజూ క్యాబేజీ జ్యూస్‌ను కూడా సేవించవచ్చు. దీని వల్ల మన శరీరానికి అనేక పోషకాలు లభిస్తాయి. ఫ్రీ ర్యాడికల్స్ తొలగించబడతాయి. దీంతో కణాలకు జరిగే నష్టం నివారించబడుతుంది. గుండె పోటు, క్యాన్సర్ రాకుండా నివారించవచ్చు. శరీరం అంతర్గతంగా శుభ్రంగా మారుతుంది. చర్మం సురక్షితంగా ఉంటుంది. అధిక బరువు సులభంగా తగ్గుతారు. లివర్ ఆరోగ్యంగా ఉంటుంది.

కొత్తిమీర, బీట్ రూట్..

చిలగడ దుంపలను రోజూ నేరుగా తినవచ్చు. జ్యూస్‌గా తయారు చేసి కూడా తాగవచ్చు. ఈ జ్యూస్‌ను తాగితే ఎముకలు దృఢంగా మారి ఆరోగ్యంగా ఉంటాయి. రోగ నిరోధక వ్యవస్థ పటిష్టంగా మారుతుంది. అధిక బరువును తగ్గించుకోవచ్చు. కంటి చూపు మెరుగు పడుతుంది. బీపీ, కొలెస్ట్రాల్, షుగర్ లెవల్స్ నియంత్రణలో ఉంటాయి. జీర్ణ శక్తి మెరుగు పడుతుంది. అల్సర్లు ఉన్నవారికి ఔషధంగా పనిచేస్తుంది. అలాగే రోజూ కొత్తిమీర జ్యూస్‌ను కూడా తాగవచ్చు. ఇది రోగ నిరోధక శక్తి పెరిగేలా చేస్తుంది. ఎముకలను ఆరోగ్యంగా ఉంచుతుంది. క్యాన్సర్ కణాలు వృద్ధి చెందకుండా చేస్తుంది. గుండె సురక్షితంగా ఉంటుంది. ఇన్‌ఫెక్షన్లు తగ్గుతాయి. అలాగే బీట్ రూట్ జ్యూస్‌ను కూడా రోజూ సేవిస్తుండవచ్చు. దీని వల్ల హైబీపీ తగ్గుతుంది. కొలెస్ట్రాల్ నియంత్రణలో ఉంటుంది. గుండె ఆరోగ్యంగా ఉంటుంది. లివర్, కిడ్నీల్లో ఉండే వ్యర్థాలు బయటకు వెళ్లిపోతాయి. ఇలా ఆయా రకాల కూరగాయల జ్యూస్‌లను రోజూ తాగుతుంటే భిన్న రకాల లాభాలను పొందవచ్చు. అయితే రోజూ ఏదైనా ఒక జ్యూస్‌ను మాత్రమే తాగాలి. ఉదయం పరగడుపున తాగితే ఎక్కువ ఫలితం ఉంటుంది. ఒక కప్పు మోతాదులో ఏ జ్యూస్‌ను అయినా సరే తాగవచ్చు.

భక్తులకు అలర్ట్..

శబరిమల మకరజ్యోతి సీజన్ వర్చువల్ క్యూ స్లాట్లు ఓపెన్!

తిరువనంతపురం: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శబరిమల అయ్యప్ప స్వామి ఆలయంలో అత్యంత ప్రాముఖ్యత సంతరించుకున్న ప్రధాన పండుగ మకరజ్యోతి (మకరవిళక్కు) దర్శనానికి సంబంధించి కీలక అప్‌డేట్ వెలువడింది. మకరజ్యోతి సీజన్‌కు సంబంధించి జనవరి నెల వర్చువల్ క్యూ స్లాట్లు అందుబాటులోకి వచ్చాయి. శబరిమలను దర్శించు కోవాలనుకునే భక్తులు అధికారిక వెబ్‌సైట్ ద్వారా ఉచితంగా తమ స్లాట్లను బుక్ చేసుకోవచ్చని ట్రావెన్‌కోర్ దేవస్థానం బోర్డు వెల్లడించింది. రద్దీని దృష్టిలో ఉంచుకుని భక్తులు ముందుగానే ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించింది. సాధారణంగా ప్రతి సంవత్సరం జనవరి మధ్యలో (సంక్రాంతి పండుగ రోజున జనవరి 14,15 తేదీల్లో) ఈ వేడుక అత్యంత వైభవంగా జరుగుతుంది. ఈ సీజన్‌లోని అత్యంత ముఖ్యమైన ఘట్టం మకరజ్యోతి దర్శనం. సంక్రాంతి రోజున శబరిమలకు సమీపంలోని పొన్నంబలమేడు కొండపై దివ్యమైన జ్యోతి రూపం దర్శనమిస్తుంది. దీనిని స్వామివారి దివ్య రూపంగా భావించి భక్తులు ఎంతో భక్తిశ్రద్ధలతో తిలకిస్తారు. అయ్యప్ప స్వామి ధరించే పవిత్ర ఆభరణాలను పందళం రాజభవనం నుంచి ప్రత్యేక ఊరేగింపుగా శబరిమలకు తీసుకొస్తారు. మకరవిళక్కు రోజున స్వామివారికి ఈ ఆభరణాలను అలంకరించి మహాదీపారాధన నిర్వహిస్తారు. నవంబర్ నెలలో ప్రారంభమయ్యే మండల పూజ సీజన్ ముగిసిన తర్వాత, కొద్ది రోజులు ఆలయాన్ని మూసివేసి తిరిగి మకరవిళక్కు కోసం తెరుస్తారు. ఈ మకరవిళక్కుతో శబరిమల వార్షిక తీర్థయాత్ర సీజన్ ఘనంగా ముగుస్తుంది. ఈ పవిత్ర ఘట్టాన్ని కళ్లారా వీక్షించి, అయ్యప్ప స్వామి కృపకు పాత్రులు అయ్యేందుకు దేశం నలుమూలల నుంచి లక్షలాది మంది భక్తులు శబరిమలకు తరలి వెళ్లనున్నారు.

కూలిన హెలికాప్టర్.. ఆరుగురి ఆచూకీ గల్లంతు

డెహ్రాడూన్: దేవభూమి ఉత్తరాఖండ్‌లో హెలికాప్టర్ ప్రమాదం చోటు చేసుకుంది. బద్రీనాథ్‌ను దర్శించుకుని తిరిగి డెహ్రాడూన్ వెళ్తుండగా భారత్ ఏవియేషన్‌కు చెందిన ఓ హెలికాప్టర్ ప్రమాదానికి గురైంది. ఉత్తరాఖండ్‌లోని చమోలి జిల్లా జోషిమఠ్ – బద్రీనాథ్ మార్గంలో జోషిమఠ్ సమీపంలోని చాయీ గ్రామం వద్ద ఈ హెలికాప్టర్ రాడార్‌తో సంబంధాలు (సిగ్నల్) కోల్పోయింది. ప్రమాద సమయంలో హెలికాప్టర్‌లో పైలట్‌తో పాటు ఐదుగురు ప్రయాణికులు ఉన్నారు. ఒకవైపు దట్టమైన మంచు, మరోవైపు భారీ వర్షం కురుస్తుండటమే ఈ ప్రమాదానికి ప్రధాన కారణమైనట్లు ప్రాథమికంగా భావిస్తున్నారు. శనివారం మధ్యాహ్నం 2.15 గంటల సమయంలో బద్రీనాథ్ నుంచి బయలుదేరిన కొద్దిసేపటికే ఈ ఘటన జరిగిందని ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్ సింగ్ ధామి తెలిపారు.

ముమ్మరంగా సహాయక చర్యలు

ప్రమాదంపై సమాచారం అందుకున్న రాష్ట్ర సహాయక బృందాలు, ఆర్మీ ఘటనా స్థలానికి చేరుకుని గాలింపు చర్యలను ముమ్మరం చేశాయి. జిల్లా యంత్రాంగం, విపత్తు నిర్వహణ శాఖ, ఎస్డీఆర్ఎఫ్ సంయుక్తంగా సహాయక చర్యలు చేపడుతున్నట్లు సీఎం పుష్కర్ సింగ్ ధామి ఎక్స్ (ట్విట్టర్) వేదికగా వెల్లడించారు. 'నేనే స్వయంగా ఈ మొత్తం ఘటనను నిరంతరం పర్యవేక్షిస్తున్నాను. తీవ్రంగా గాయపడిన వారిని మెరుగైన చికిత్స కోసం వెంటనే ఉన్నత కేంద్రాలకు హెలికాప్టర్ ద్వారా తరలించాలని ఆదేశాలు జారీ చేశాను. ప్రయాణికులు క్షేమంగా తిరిగి రావాలని దేవుడిని ప్రార్థిస్తున్నాను' అని పేర్కొన్నారు. కాగా, గత ఏడాది జూన్‌లోనూ ఉత్తరాఖండ్‌లోని కేదార్‌నాథ్ ఆలయం నుంచి గుప్తకాశికి ప్రయాణికులను తీసుకువెళు _న్న హెలికాప్టర్ అడవిలో కూలిపోవడంతో ఏడుగురు మృతి చెందిన విషయం తెలిసిందే. తాజా ఘటనతో యాత్రికుల్లో ఆందోళన నెలకొంది.

గ్యాస్, ఎరువుల కొరతపై తప్పుడు ప్రచారం..

విపక్షాలపై ప్రధాని మోదీ ఫైర్

గుజరాత్: ఇరాన్ యుద్ధం నేపథ్యంలో దేశంలో ఎల్పీజీ గ్యాస్, ఎరువుల కొరత ఏర్పడుతుందంటూ ప్రతిపక్షాలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయని ప్రధాని నరేంద్ర మోదీ ఆరోపించారు. దేశం కష్టాల్లో ఉన్నప్పుడు కొందరు సంతోషం పొందుతున్నారని, తనకు చెడ్డపేరు తీసుకురావడమే వారి లక్ష్యమని ఆయన విమర్శించారు. గుజరాత్‌లోని బనస్కాంత జిల్లా ఖీల్డీలో శుక్రవారం జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. గల్ఫ్ ప్రాంతంలో ఉద్రిక్తతలు కొనసాగుతున్నప్పటికీ, ఎరువుల ధరల పెరుగుదల భారాన్ని రైతులపై పడకుండా తమ ప్రభుత్వం చర్యలు తీసుకుందని ప్రధాని మోదీ తెలిపారు. భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేస్తున్నారని చెప్పారు. కానీ కొందరికి మాత్రం దేశ అభివృద్ధి నచ్చడం లేదని, దేశం సంక్షోభంలో ఉన్నప్పుడే వారు సంతోషిస్తారని ప్రతిపక్షాలను ఉద్దేశించి ప్రధాని విమర్శించారు. దేశం కష్టాల్లో పడాలని కోరుకునే వ్యక్తులు కూడా ఉన్నారని ఆయన ఆరోపించారు. దేశ ప్రజలకు తన చివరి శ్వాస వరకు సేవ చేస్తానని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా రూ.14 వేల కోట్ల విలువైన అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. అలాగే పీఎం కిసాన్ సమ్మాన్ నిధి 24వ విడతగా దేశవ్యాప్తంగా దాదాపు 10 కోట్ల మంది రైతుల ఖాతాల్లో రూ.18 వేల కోట్లకు పైగా జమ చేశారు. గుజరాత్‌లో 50 లక్షల మందికి పైగా రైతులకు రూ.1,000 కోట్లకు పైగా నిధులు అందాయని తెలిపారు. బనస్కాంతలో 127 ఎకరాల్లో ఏర్పాటు చేసిన భారత్ బోవైన్ బ్రీడింగ్ అండ్ రీసెర్చ్ సెంటర్‌ను ఆయన ప్రారంభించారు. కంక్రేజ్ పశు జాతి అభివృద్ధి, నాణ్యమైన పశు ఉత్పత్తి లక్ష్యంగా ఈ కేంద్రం పనిచేయనుంది. బనాస్ డెయిరీ ఆధ్వర్యంలో రెండు బయో సీఎన్‌జీ ప్లాంట్లు, బంగాళాదుంపల ప్రాసెసింగ్ కేంద్రం విస్తరణ సహా పలు అభివృద్ధి ప్రాజెక్టులను కూడా ప్రధాని మోదీ ప్రారంభించారు.

చంద్రబాబూ.. నీ తప్పులు చాలా దూరం వెళ్తాయి!

వైఎస్సార్ జిల్లా: మీరు ఏం చేశారని ప్రజలు ఓట్లు వేస్తారంటూ చంద్రబాబు సర్కార్‌ను వైఎస్సార్‌సీపీ ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి నిలదీశారు. శుక్రవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. హౌసింగ్ కాలనీల్లో ఒక్క రూపాయి పనులైనా చేశారా?. పులివెందులకు మెడికల్ కాలేజీ వస్తే మీరే వద్దన్నారు. ఎన్నికల్లో ఇస్తామన్న హామీలు ఏమయ్యాయి?. ఈ మూడేళ్లల్లో ఏం చేశారో చెప్పి ఓట్లు అడగగలరా?" అంటూ అవినాష్‌రెడ్డి ప్రశ్నించారు. "చంద్రబాబు ఎంత బలహీనుడో రాష్ట్రం మొత్తానికి అర్థమైంది. బీటెక్ రవి ప్రచారం వింతగా, ఆశ్చర్యకరంగా ఉంది. ఏ హామీ నెరవేర్చారని టీడీపీ నేతలు ఓట్లు అడుగుతున్నారు?. వైఎస్సార్‌సీపీ కార్పొరేట్, కౌన్సిలర్ అభ్యర్థులను నామినేషన్‌లు వేయకుండా అడ్డుకున్నారు. మధ్యాహ్నం 1:30కు నామినేషన్లు వేసుకోవచ్చని చెప్పి పోలీసులే అడ్డుకున్నారు. మున్సిపల్ ఆఫీస్ ముందు ఆగి నామినేషన్లు వేసుకోవడానికి అనుమతి అడిగాం. నామినేషన్లకు అనుమతివ్వమని పోలీసులు స్పష్టంగా చెప్పారు" అని వైఎస్ అవినాష్‌రెడ్డి పేర్కొన్నారు. "ప్రచారం కూడా వైఎస్సార్‌సీపీ నేతలను ప్రశాంతంగా చేసుకోనివ్వడం లేదు. ప్రచారంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నేతల ఆస్తులపై దాడులు చేస్తున్నారు. వైఎస్సార్‌సీపీ నేతల ఆస్తులపై దాడులు చేసిన వారికి కనీసం నోటీసులు కూడా ఇవ్వలేదు. పనికి మాలిన పనుల్నీ చంద్రబాబు హయాంలో జరుగుతున్నాయి. ఇలాంటి దాడులు గతంలో ఏనాడూ జరగలేదు ..వేలాది మందిని బయట నుంచి తీసుకొస్తున్నారు. బయట నుంచి వచ్చిన వారికి పోలీసులే సదుపాయాలు కల్పిస్తున్నారు. ఏజెంట్లను, ఓటర్లను బ్లాక్ చేసి దొంగ ఓట్లు వేసుకోవడానికి స్కెచ్. టీడీపీ నీచ ప్రణాళికలకు కోయ ప్రవీణ్ పూర్తిగా సహకరిస్తున్నాడు. టీడీపీ కుట్రలను ఎస్ఈసీ దృష్టికి వైఎస్సార్‌సీపీ తీసుకెళ్లింది. ఫ్యాక్షనిజాన్ని చంద్రబాబు తట్టి లేపుతున్నాడు. చంద్రబాబు.. నీవు చేసే తప్పుడు పనులు చాలా దూరం వెళ్తాయి' అని వైఎస్ అవినాష్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.

గ్లోబల్ హెల్త్ ఎమర్జెన్సీ!

భూతాపోన్నతి వల్ల తీవ్ర అగాధంలోకి ప్రజారోగ్యం
గత 11 ఏళ్లు చరిత్రలోనే అత్యంత ఉష్ణోగ్రత కలిగిన సంవత్సరాలుగా నమోదయ్యాయి
వాతావరణ సంక్షోభం ఇప్పుడు 'గ్లోబల్ హెల్త్ ఎమర్జెన్సీ'గా మారింది
ప్రతిష్ఠాత్మక 'లాన్సెట్ కౌంట్‌డౌన్ 2026' తాజా నివేదిక హెచ్చరిక

(స్పెషల్ డెస్క్): పారిస్ ఒప్పందం అమల్లోకి వచ్చి పదేళ్లు పూర్తయినా, కర్బన ఉద్గారాలు పెరిగిపోతుండటంతో భూతాపోన్నతి వల్ల ప్రజారోగ్యం తీవ్ర అగాధంలోకి కూరుకుపోతోందని ప్రతిష్ఠాత్మక 'లాన్సెట్ కౌంట్‌డౌన్ 2026' తాజా నివేదిక స్పష్టం చేసింది. మానవాళి చరిత్రలోనే గత 11 ఏళ్లు అత్యంత అధిక ఉష్ణోగ్రత సంవత్సరాలుగా నమోదయ్యాయని, వాతావరణ సంక్షోభం ఇప్పుడు ఏకంగా 'గ్లోబల్ హెల్త్ ఎమర్జెన్సీ'గా మారిందని హెచ్చరించింది.

అధిక ఉష్ణోగ్రతలతో రికార్డు మరణాలు

ఎండల తీవ్రత కార్మికుల ఆరోగ్యాన్ని, జీవనోపాధిని దెబ్బతీస్తోంది. 2025లో ప్రపంచవ్యాప్తంగా 573 బిలియన్ పని గంటలు వృథా అయ్యాయి. దీనివల్ల 1.07 లక్షల కోట్ల డాలర్లకు పైగా శ్రామికుల ఆదాయానికి నష్టం వాటిల్లింది. ఇందులో ఒక్క వ్యవసాయ రంగ నష్టమే 37.8 శాతం మేరకు ఉంది. 2016-- 2023 మధ్య కాలంలో ప్రపంచవ్యాప్తంగా ఏటా సగటున 5.4 లక్షల మరణాలు అధిక ఉష్ణోగ్రతలతో ముడిపడి ఉన్నాయి. ఇందులో 68.4 శాతం మరణాలకు మానవ తప్పిదాల వల్ల ఏర్పడిన వాతావరణ మార్పులే కారణమని నివేదిక నిర్ధారించింది. 2023 ఒక్క సంవత్సరంలోనే అత్యధికంగా 7.10 లక్షల మంది తీవ్ర ఎండల వల్ల మృత్యువాత పడ్డారు. ఉష్ణోగ్రతల పెరుగుదలతో దోమల ద్వారా వ్యాపించే డెంగ్యూ అనుకూలత 31 శాతం పెరిగింది. సముద్ర తీరాల వాతావరణంలో వేడిమి పెరగటంతో 'విబ్రియో' బ్యాక్టీరియా ముప్పు విస్తరించింది. అలాగే కరువులు, వడగాలుల వల్ల 2024లో అదనంగా 12.79 కోట్ల మంది ఆహార అభద్రతతో అలమటించారు.

అభివృద్ధి చెందుతున్న దేశాలకు రిక్తహస్తం

వాతావరణ సంబంధిత ఆరోగ్య సవాళ్లను ఎదుర్కొనేందుకు ఏటా కనీసం 330 కోట్ల డాలర్ల సహాయ నిధులు అవసరమని అభివృద్ధి చెందుతున్న 48 దేశాలు కోరాయి. అయితే, 2024లో అంతర్జాతీయంగా సమకూరిన నిధులు కేవలం 110 కోట్ల డాలర్లు మాత్రమే కావటం గమనార్హం. వాతావరణ--ఆరోగ్య సంబంధిత పరిశోధనా నిధులు 2016-- 2024 మధ్యలో 4.2 కోట్ల డాలర్ల నుంచి 31.6 కోట్ల డాలర్లకు పెరిగినప్పటికీ, ఈ గ్రాంట్లలో 88% నిధులు కేవలం సంపన్న దేశాల పరిశోధకులకే దక్కాయి. అత్యధిక ముప్పును ఎదుర్కొంటున్న అల్పాదాయ దేశాలకు కేవలం 1% మాత్రమే లభించాయి.

భారత్‌పై తీవ్ర ప్రభావం

మధ్యస్థ మానవ అభివృద్ధి సూచిక (హెచ్‌డీఐ) గల దేశాల విభాగంలో, ముఖ్యంగా భారత్‌లో, ఆరుబయట శ్రమించే సాధారణ ప్రజలు వేడి ఒత్తిడి బారిన పడే గంటలు ఏడాదికి సగటున తలసరి 2,430 గంటలుగా నమోదయ్యాయి. ఇది ప్రపంచంలోనే అత్యధిక స్థాయి. భారత్‌లోని పది ప్రధాన నగరాల్లో సుమారు 36 లక్షల మరణాలపై జరిగిన విశ్లేషణను నివేదిక ఉటంకించింది. అధిక ఉష్ణోగ్రతల నేపథ్యంలో పీఎం 2.5 గాలి కాలుష్య తీవ్రతతో సంభవించే మరణాల ముప్పు మున్ముందు ఐదు రెట్లు పెరుగుతుందని నివేదిక వెల్లడించింది.

నష్టంలో మనది మూడో స్థానం

2016--25 దశాబ్దంలో ఎండల వల్ల పని గంటలు తగ్గి అంతర్జాతీయంగా శ్రామిక ఆదాయ నష్టం బాగా పెరిగింది. అధిక నష్టం చవిచూసిన చైనా, అమెరికా తర్వాత మూడో స్థానంలో నిలిచిన భారత్ వాటా ఏకంగా 12.4 శాతంగా ఉంది. శిలాజ ఇంధనాల వినియోగాన్ని తగ్గించాల్సిన అవసరం ఉన్నప్పటికీ, 2024లో శిలాజ ఇంధనాలకు అనేక దేశాలు అత్యధికంగా నికర సబ్సిడీలు ఇస్తున్నాయి. 5 వేల కోట్ల డాలర్లకు పైగా సబ్సిడీలిచ్చిన దేశాల్లో రష్యా, ఇరాన్, చైనాతో పాటు భారత్ కూడా ఉందని నివేదిక ఎత్తిచూపింది. శిలాజ ఇంధనాల వినియోగాన్ని దశలవారీగా తగ్గిస్తూ స్వచ్ఛమైన పునరుత్పాదక ఇంధన రంగాన్ని వేగంగా విస్తరించాలని, ముందస్తు ఆరోగ్య హెచ్చరిక వ్యవస్థలను పటిష్టం చేయాలని పిలుపునిచ్చింది.

స్తోత్కర్షలు సరే, సాయం ఏది?

ఆంధ్రప్రదేశ్‌లో మున్సిపాలిటీలు, ఎంపీటీసీ, జెడ్‌పీటీసీ ఎన్నికలకు నామినేషన్ల పర్వంనుంచీ కూటమి మూకలు చెలరేగి సృష్టించిన భీతావహ పరిస్థితులు సద్దుమణగక ముందే ఆంధ్రప్రదేశ్‌పై పెను తుపాను అర్నబ్ విరుచుకుపడింది. వివిధ ఘటనల్లో ఏడుగురు ప్రాణాలు కోల్పోయారు. ఉత్తరాంధ్రపైనా, గోదావరి జిల్లాలపైనా దీని ప్రభావం ఎక్కు వుంది. కోతకొచ్చిన లక్షలాది హెక్టార్ల వరి పంట నీట మునగడం, అరటి, మొక్కజొన్న తీవ్రంగా దెబ్బతినడం, వేలాది కొబ్బరి చెట్లు, మహావృక్షాలు కుప్పకూలడం తుపాను బీభత్సం ఏ స్థాయిలో ఉన్నదో వెల్లడిస్తుంది. తీరం దాటిన సమయంలో దాదాపు 150 కిలోమీటర్ల వేగంతో వీచిన పెనుగాలులతో విజయనగరం, శ్రీకాకుళం, విశాఖపట్నం, ఉమ్మడి పశ్చిమ గోదావరి, పార్వతీపురం, మన్యం జిల్లాలతోపాటు కాకినాడ, కోనసీమ జిల్లాలు చిగురుటాకుల్లా వణికాయి. భారీవర్షాలతో వాగులు, వంకలు ఉప్పొంగి జనం తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ తుపాను బీభత్సం సృష్టించిన భారీ నష్టాలనుంచి ఇంకా కోలుకోకముందే అండమాన్ దగ్గర మరో అల్పపీడనం ఏర్పడిందన్న వార్తలు సహజంగానే ఆందోళన కలిగిస్తున్నాయి. అదింకా బలపడి వాయుగుండమై, తుపానుగా మారు తుందా అన్నది వాతావరణ విభాగం ఇంకా చెప్పలేకపోతోంది. కుండపోత వర్షాలైతే తప్పక పోవచ్చంటున్నారు. తుపాను తీరం దాటకముందే వందిమాగధ బృందాల భజన మొదలైంది. సీఎంచంద్రబాబు తెల్లవార్లూ నిరంతరాయంగా టెలికాన్ఫరెన్స్‌లు నిర్వహించారని కూడా చెప్పుకున్నారు. కూటమిలో పరస్పరం అభినందనల పర్వం, తమను తాము వేనోళ్ల పొగుడుకోవటం వగైరాలన్నీ సరేసరి. కానీ తన సుదీర్ఘ పాలనలో పదులకొద్దీ తుపానులు చూసిన ముఖ్యమంత్రిగా ముందస్తు ఆలోచనతో చంద్రబాబు రైతులకు చేసిందేమిటి? ఒక లెక్క ప్రకారం సుమారు 34 లక్షల ఎకరాల్లో వరిపంట దెబ్బతిన్నది. ఒక్కో రైతు ఎకరానికి సగటున రూ. 40,000 పెట్టుబడి పెట్టారనుకున్నా, ఇన్ని లక్షల ఎకరాల్లో రైతులు ఎంత నష్టపోయి ఉంటారు? ఆ నష్టాన్ని గరిష్ఠంగా పూడ్చడానికి ఏం చేయాలన్న ఆలోచనేదీ లేకుండా... పంటల బీమా పథకాన్ని పక్కనపెట్టినందుకు పశ్చాత్తాపపడకుండా ఈ స్తోత్రపాఠాలేమిటి? వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అయిదేళ్లూ అమలు చేసిన ఉచిత పంటల బీమా పథకం

సౌకర్యాన్ని కొనసాగించివుంటే రైతులకు కలిగిన నష్టం పూడ్చుకొనేందుకు అవకాశం ఉండేది. అది లేదు సరిగదా... ఇన్‌పుట్ సబ్సిడీలు సైతం నిర్లక్ష్యం చేయటంవల్ల రైతులకు సాగు వ్యయం అపారంగా పెరిగింది. దీన్నెలా భర్తీ చేస్తారు? నిరుడొచ్చిన మొంథా తుపానుకు రూ. 5,244 కోట్ల నష్టం వచ్చిందన్న సర్కారు ఈనాటికీ రైతులకు పైసా పరిహారం ఇవ్వలేదు. కృష్ణా గోదావరి డెల్టాలో కోతకు సిద్ధంగా ఉన్న వరిపంట నీట మునిగింది. డ్రెయినేజి వ్యవస్థలు సక్రమంగా ఉంటే ఈ నీటిని వెంటనే బయటకు పంపటం సాధ్యమయ్యేది. కానీ అన్నిచోట్లా ఆ పరిస్థితి ఉందా? ఈసారి సూపర్ ఎల్‌నినో ముంచుకొస్తున్నదనీ, వర్షాభావ పరిస్థితులతోపాటు తుపానువంటి ప్రకృతి వైపరీత్యాలు, వరదల తీవ్రత కూడా ఎక్కువే ఉండొచ్చనీ వాతావరణ శాస్త్రవేత్తలు ఏడెనిమిది నెలలుగా హెచ్చరిస్తున్నారు. కానీ ఆ విషయంలో ఏం చేయగలమన్న ఆలోచనే కూటమి సర్కారుకు కరువైంది. ఎంతసేపూ ప్రత్యర్థుల్ని కష్టాలుపాలు చేయడం ఎలాగన్న వ్యూహాలతోనే దానికి పొద్దుపోతోంది. పర్యవసానంగా డ్రయినేజీ వ్యవస్థ అస్తవ్యస్థంగా ఉంది. తుపాను విపత్తు విషయంలో ఆదుకుంటామని కేంద్ర హోంమంత్రి అమిత్ షా హామీ ఇచ్చారని లీకులీయటం కాదు. నష్టపోయిన రైతులకు తక్షణం చేసేదేమిటో చెప్పాలి. వరితోపాటు కోనసీమలో కోటికిపైగా ఉండే కొబ్బరిచెట్లలో లక్షల చెట్లు నేలకొరిగాయి. అరటి తోటలు, మొక్కజొన్న తీవ్రంగా దెబ్బతిన్నాయి. మొత్తం అయిదున్నర లక్షల ఎకరాల ఆక్వా సాగు పైనా ప్రభావం పడిందంటున్నారు. తుపాను ఉపశమించి 24గంటలు గడిచినా చాలాచోట్ల విద్యుత్ పునరుద్ధరణ జరగక ఆక్వా సాగు దెబ్బతింటు న్నదని రైతులు మొత్తుకుంటున్నారు. తక్షణం పంటల నష్టాన్ని మండలాలవారీగాఅంచనా వేసి త్వరగా పరిహారం అందిస్తే తదుపరి సీజన్‌కు రైతు కోలుకునే అవకాశంఉంటుంది. స్తోత్కర్షలవల్ల ప్రజానీకానికి ఒరిగేదేమీ ఉండదని గుర్తించాలి.

ఇజ్రాయెల్‌లో హై టెన్షన్.. నెతన్యాహు ఇంటి వద్ద ఉద్రిక్తత

జెరూసలేం: ఇజ్రాయెల్ రాజకీయాల్లో ఎన్నికల ఫలితాలు తీవ్ర ఉత్కంఠకు తెరలేపాయి. ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన మెజారిటీ ఏ కూటమికీ రాకపోవడంతో రాజకీయ అనిశ్చితి నెలకొంది. ఈ నేపథ్యంలో ప్రధాని బెంజమిన్ నెతన్యాహు రాజీనామా చేయాలంటూ ప్రజలు రోడ్డెక్కారు. ప్రతిపక్ష పార్టీలన్నీ ఏకమై అరబ్ పార్టీలతో కలిసి ఉమ్మడి ప్రభుత్వం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఇజ్రాయెల్‌లో గురువారం రాత్రి జరిగిన నిరసనల్లో పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. నగరంలోని ప్రధాన రహదారులపై బైఠాయించి ట్రాఫిక్‌ను అడ్డుకున్నారు. నెతన్యాహుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఆయన ఎన్నికల ప్రచార పోస్టర్లను తొక్కుతూ నిరసన వ్యక్తం చేశారు. ఆందోళనకారులను చెదరగొట్టేందుకు పోలీసులు ప్రయత్నించడంతో కొన్ని ప్రాంతాల్లో ఉద్రిక్తత నెలకొంది. కాగా, నెతన్యాహు నివాసం ఎదుట కూడా నిరసనలు జరిగాయి. ఈ సందర్భంగా గాజాపై యుద్ధానికి ముగింపు పలకాలని ఆందోళనకారులు డిమాండ్ చేశారు. యూదులు, అరబ్బులు కలిసి రాజకీయ భాగస్వామ్యాన్ని ఏర్పరచుకోవాలని కోరుతూ ప్లకార్డులు ప్రదర్శించారు. 'అరబ్బులు, యూదులు.. కలిసుంటేనే విజయం సాధిస్తాం' అంటూ నిరసనకారులు నినాదాలు చేశారు.

ఐసెన్‌కాట్‌కు ప్రతిపక్షాల పిలుపు

మరోవైపు యాషర్ పార్టీ అధినేత గాడి ఐసెన్‌కాట్ నివాసం ఎదుట కూడా నిరసన జరిగింది. అరబ్ పార్టీలతో కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే దిశగా ముందుకు రావాలని ఆందోళనకారులు ఆయనను కోరారు. 'భాగస్వామ్యం లేకుండా మార్పు సాధ్యం కాదు' అంటూ వారు నినాదాలు చేశారు. టెల్ అవీవ్–జాఫా డిప్యూటీ మేయర్ అమీర్ బద్రాన్ కూడా ఈ ప్రతిపాదనకు మద్దతు తెలిపారు.

ప్రభుత్వ ఏర్పాటుకు 61 సీట్లు అవసరం

ఇజ్రాయెల్ పార్లమెంట్ నెస్సెట్‌లో మొత్తం 120 స్థానాలు ఉన్నాయి. ప్రభుత్వ ఏర్పాటుకు కనీసం 61 మంది సభ్యుల మద్దతు అవసరం. అయితే తాజా ఎన్నికల్లో నెతన్యాహు కూటమికి 53 స్థానాలు మాత్రమే వచ్చాయి. ప్రధాన నాలుగు ప్రతిపక్ష పార్టీలకు కలిపి 48 సీట్లు దక్కాయి. దీంతో ఏ పక్షానికీ స్పష్టమైన మెజారిటీ లభించలేదు. నెతన్యాహు నేతృత్వంలోని లికుడ్ పార్టీ 27 స్థానాలతో అతిపెద్ద పార్టీగా నిలిచింది. ఐసెన్‌కాట్ నేతృత్వంలోని యాషర్ పార్టీ 21 స్థానాలతో ప్రధాన ప్రతిపక్ష పార్టీగా అవతరించింది.

అరబ్ పార్టీల చేతిలో కీలక సంఖ్యాబలం

ప్రభుత్వ ఏర్పాటులో అరబ్ పార్టీల పాత్ర కీలకంగా మారింది. జాయింట్ లిస్ట్‌కు 11 స్థానాలు, మన్సూర్ అబ్బాస్ నేతృత్వంలోని రామ్ పార్టీకి 8 స్థానాలు వచ్చాయి. ఈ రెండు పార్టీలకు కలిపి 19 మంది సభ్యుల బలం ఉంది. ప్రతిపక్షాలు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలంటే వీరి మద్దతు అవసరమయ్యే పరిస్థితి కనిపిస్తోంది. అయితే ఈ ప్రయత్నాలకు అవిగ్దోర్ లీబర్‌మన్ అడ్డంకిగా మారారు. ఆయన నేతృత్వంలోని ఇజ్రాయెల్ బీటెనూ పార్టీకి ఏడు స్థానాలు వచ్చాయి. అరబ్ పార్టీల మద్దతుపై ఆధారపడే ప్రభుత్వంలో తాము భాగస్వాములం కాబోమని లీబర్‌మన్ స్పష్టం చేసినట్లు సమాచారం. దీంతో ప్రతిపక్షాల ఐక్యతపై సందిగ్ధత నెలకొంది. మరోవైపు ఇజ్రాయెల్ అధ్యక్షుడు ఐజాక్ హెర్జోగ్ మరోసారి ఎన్నికలకు వెళ్లకుండా రాజకీయ పార్టీలు పరిష్కారం కనుగొనాలని ప్రయత్నిస్తున్నారు. అయితే అరబ్ పార్టీల మద్దతు తీసుకోవడంపై ప్రతిపక్షాల్లోనే భిన్నాభిప్రాయాలు ఉండటంతో ప్రభుత్వ ఏర్పాటుపై ఉత్కంఠ కొనసాగుతోంది.

RNI NO. APBIL/2013/50718 LOCAL GUIDE Bi-Lingual Daily Published From Rangareddy
లోకల్ గైడ్ ద్విభాషా దినపత్రిక
www.localguidenews.com

అందానికి అదృష్టం తోడైతే ఇలాగే ఉంటుంది మరి!

'మిరాయ్'తో మెప్పించిన రితికా

బలమైన కథ కోసమే తీసుకున్న గ్యాప్

'కొరియన్ కనకరాజు'తో భారీ హిట్

మరిన్ని అవకాశాలతో దూసుకుపోయే ఛాన్స్

ఒకప్పుడు మీనా .. రంభ .. నగ్మా వంటి బొద్దుగా ఉన్న బ్యూటీలు తెలుగు తెరను ఒక ఊపు ఊపేశారు. స్టార్ హీరోలతో కలిసి వరుస విజయాలను అందుకుంటూ, తమ కెరియర్ ను పరుగులు తీయించారు. అలా కాస్త బొద్దుగా కనిపిస్తూ .. క్యూట్ ఎక్స్ ప్రెషన్స్ తో ఈ మధ్య కాలంలో యూత్ ను ఆకట్టుకున్న బ్యూటీగా రితికా నాయక్ కనిపిస్తుంది. 'మిరాయ్' సినిమాలో ఈ సుందరిని చూసిన కుర్రాళ్లు, థియేటర్స్ దగ్గరే మనసులు పోగొట్టుకున్నారు. ఈ ముద్దుగుమ్మ నెలకో సినిమా చేస్తే బాగుండునే అనుకున్నారు. కానీ 'మిరాయ్' మాదిరిగానే తనకి బాగా నచ్చే కంటెంట్ కోసం రితికా ఎదురుచూస్తూ వచ్చిందనే విషయం, 'కొరియన్ కనకరాజు' రిలీజ్ తరువాతనే అర్థమవుతోంది. రీసెంటుగా విడుదలైన ఈ సినిమా, అనూహ్యమైన రెస్పాన్స్ ను అందుకుంది. కొంత కాలంగా అసంతృప్తిగా ఉన్న వరుణ్ తేజ్ కి ఈ సినిమా ఫలితం ఊరటను ఇచ్చింది .. కొత్త ఉత్సాహాన్ని ఇచ్చింది.

ఈ సినిమాలోను నటన పరంగా .. గ్లామర్ పరంగా రితికా మంచి మార్కులు కొట్టేసింది. అందానికి అదృష్టం తోడైతే ఇలాగే ఉంటుందని అనిపించింది. కొంత కాలంగా టాలీవుడ్ లో హీరోయిన్స్ వైపు నుంచి సందడి తగ్గిందనే చెప్పాలి. ఒకటి రెండు సినిమాలు చేసుకుపోతున్నారే తప్ప, నిలకడగా ఎవరూ సక్సెస్ లు సాధించలేకపోతున్నారు. టాప్ త్రీ .. టాప్ 5 అంటూ గతంలో మాదిరిగా ఒక జాబితా చూసుకుంటే, ఎవరూ కనిపించని ఒక గందరగోళం ఉంది. అలాంటి పరిస్థితుల్లో మరో భారీ హిట్ ను అందుకున్న రితికా, మరిన్ని అవకాశాలతో బిజీ అవుతుందేమో చూడాలి.

ప్రళయ్.. ధురంధర్ తర్వాత రణ్‌వీర్ సింగ్ కొత్త ప్రాజెక్టు ఇదే..

సెట్స్‌పైకి భారీ సర్వైవల్ థ్రిల్లర్

'ప్రళయ్' అనే కొత్త సినిమా షూటింగ్‌ను ప్రారంభించిన రణ్‌వీర్ సింగ్

ముంబై నేపథ్యంలో భారీ స్థాయిలో పోస్ట్-అపోకలిప్టిక్ సర్వైవల్ థ్రిల్లర్

'స్కామ్ 1992' ఫేమ్ జై మెహతా దర్శకత్వం, కీలక పాత్రలో కళ్యాణి ప్రియదర్శన్

సుమారు రూ.300 కోట్ల బడ్జెట్‌తో బిర్లా, హన్సల్ మెహతా, రణ్‌వీర్ సంయుక్త నిర్మాణం

'ధురంధర్' సిరీస్ బ్లాక్‌బస్టర్ విజయం తర్వాత రణ్‌వీర్ నటిస్తున్న చిత్రం

భారత సినీ చరిత్రలోనే అత్యధిక వసూళ్లు సాధించిన 'ధురంధర్: ది రివెంజ్' తర్వాత బాలీవుడ్ ఎనర్జిటిక్ స్టార్ రణ్‌వీర్ సింగ్ తన తదుపరి భారీ ప్రాజెక్ట్‌ను పట్టాలెక్కించారు. 'ప్రళయ్' పేరుతో తెరకెక్కుతున్న ఈ ప్రతిష్ఠాత్మక చిత్రం షూటింగ్ ఆదివారం ముంబైలో ప్రారంభమైంది. పోస్ట్-అపోకలిప్టిక్ సర్వైవల్ థ్రిల్లర్‌గా రూపొందుతున్న ఈ సినిమా చిత్రీకరణను ముంబై పరిసర ప్రాంతాల్లోని లైవ్ లొకేషన్లలో నిర్వహిస్తున్నారు. 'స్కామ్ 1992: ది హర్షద్ మెహతా స్టోరీ', 'లూటేరే' వంటి విమర్శకుల ప్రశంసలు పొందిన సిరీస్‌లకు దర్శకత్వం వహించిన జై మెహతా ఈ చిత్రానికి దర్శకుడు. ప్రముఖ దర్శకుడు హన్సల్ మెహతా కుమారుడైన జై, చాలాకాలంగా ఈ కథపై పనిచేస్తున్నట్లు తెలుస్తోంది. ఇక ఈ చిత్రంలో రణ్‌వీర్ సింగ్‌కు జోడీగా కాకుండా, ఓ కీలక పాత్రలో 'లోకా' ఫేమ్, మలయాళ నటి కళ్యాణి ప్రియదర్శన్ నటిస్తున్నారు. కుప్పకూలుతున్న ప్రపంచంలో మనుగడ, ధైర్యం, విలువైన వాటి కోసం సాగే పోరాటమే ఈ చిత్ర కథాంశం. సుమారు రూ.300 కోట్ల భారీ బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నట్లు సమాచారం. భారతదేశంలో ఇంత భారీ స్థాయిలో ఇలాంటి కథాంశంతో సినిమా రావడం ఇదే తొలిసారని దర్శకుడు హన్సల్ మెహతా పేర్కొన్నారు. రణ్‌వీర్ సింగ్ ఈ ప్రాజెక్ట్‌పై చూపిన ఆసక్తి, నిబద్ధత వల్లే ఇది సాధ్యమైందని ఆయన తెలిపారు. ఈ చిత్రాన్ని ప్రముఖ పారిశ్రామికవేత్త అనన్య బిర్లాకు చెందిన బిర్లా స్టూడియోస్, హన్సల్ మెహతా-సాహిల్ సైగల్‌కు చెందిన ట్రూ స్టోరీ ఫిలింస్, రణ్‌వీర్ సింగ్ సొంత నిర్మాణ సంస్థ మా కసమ్ ఫిలింస్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. జై మెహతా, విశాల్ కపూర్ కలిసి రాసిన ఈ ఒరిజినల్ కథపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ప్రస్తుతం చిత్రీకరణ

పవర్ స్టార్ 'OG2' పై బిగ్ అప్‌డేట్..

ఏర్పాట్లు పూర్తి కాగానే రెగ్యులర్ అప్‌డేట్స్!

పవర్ స్టార్ పవన్ కల్యాణ్ అభిమానులకు పండుగలాంటి వార్త బయటకు వచ్చింది. టాలీవుడ్‌లో ఎంతోమంది ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'దే కాల్ హిమ్ 'OG' సీక్వెల్ ''OG 2'పై ఒక క్రేజీ అప్‌డేట్ సోషల్ మీడియాను ఊపేస్తోంది. ఇక పవన్ కల్యాణ్ ఈ ప్రాజెక్ట్ కోసం డేట్స్ కేటాయించినట్లు వార్తలు వస్తుండటంతో అభిమానుల ఆనందానికి అవధులు లేవు. ప్రాజెక్ట్‌కి సంబంధించిన కొన్ని ముఖ్యమైన పనులు పూర్తయిన వెంటనే వరుస అప్‌డేట్స్ ఇచ్చేందుకు చిత్రబృందం సమాయత్తమవుతోంది. ఆ విశేషాలు చూద్దాం.. ాశ్రీంశీ =ముం - రామ్ చరణ్ తర్వాత బుచ్చిబాబు కథ ఎవరికి? హీరోల లిస్ట్‌లో ఎవరెవరు ఉన్నారంటే? డేట్స్ ఇచ్చేసిన పవన్ కల్యాణ్: దర్శకుడు సుజీత్ రూపొందించిన ''OG' ప్రపంచంలో పవన్ కల్యాణ్ 'ఓజస్ గంభీర' అలియాస్ ''OG'గా చూపించిన స్టైల్, పవర్‌ఫుల్ స్క్రీన్ ప్రెజెన్స్ అభిమానులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఇక ఇప్పుడు పార్ట్ 2 కోసం పవన్ కల్యాణ్ డేట్స్ కేటాయించారని తెలుస్తుండటంతో షూటింగ్ పనులు త్వరలోనే ఊపందుకోనున్నాయి. మేకర్స్ ప్రాథమిక ఏర్పాట్లలో నిమగ్నమై ఉన్నారు. సెప్టెంబర్ 2న బర్త్‌డే స్పెషల్ ప్రోమో?: ఇప్పటికే ఫిల్మ్ నగర్‌లో వినిపిస్తున్న సమాచారం ప్రకారం.. ''OG 2' కోసం ఒక ప్రత్యేకమైన యానిమేషన్ ప్రోమోను సిద్ధం చేయాలని చిత్రయూనిట్ ప్లాన్ చేస్తోంది. ఇక పవన్ కల్యాణ్ పుట్టినరోజైన సెప్టెంబర్ 2న ఈ స్పెషల్ ప్రోమోను విడుదల చేసే ఆలోచనలో ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి. అయితే దీనిపై మేకర్స్ నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ప్రస్తుతం సినిమాకు సంబంధించి కొన్ని కీలకమైన ప్రీ-ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఇవి పూర్తి కాగానే అభిమానుల కోసం రెగ్యులర్ అప్‌డేట్స్ ఇవ్వడం ప్రారంభించాలని ప్రొడక్షన్ టీమ్ భావిస్తోంది. ఇక పవన్ క్యారెక్టరైజేషన్, యాక్షన్ ఎపిసోడ్స్ ఈ సీక్వెల్‌లో మరింత పవర్‌ఫుల్‌గా ఉండబోతున్నట్లు టాక్. మరింత వినూత్నంగా సుజీత్ మేకింగ్: మొదటి భాగంలో పవన్ కల్యాణ్‌ను ఒక రేంజ్‌లో చూపించిన సుజీత్, ''OG 2'ని అంతకుమించి తీర్చిదిద్దేందుకు పక్కా స్క్రిప్ట్‌ను సిద్ధం చేశారు. ఇక యాక్షన్, ఎమోషన్ కలగలిపి గ్లోబల్ స్థాయిలో ఈ చిత్రాన్ని తెరకెక్కించేందుకు ఏర్పాట్లు ముమ్మరం చేశారు. పవర్ స్టార్ అభిమానులకు ''OG 2' ఒక గ్రాండ్ విజువల్ ట్రీట్‌లా ఉండబోతోందనడంలో ఎలాంటి సందేహం లేదు. పవన్ కల్యాణ్ గ్రాండ్ ఎంట్రీ, సుజీత్ విజన్ కలగలిసి థియేటర్లలో ఏ స్థాయి సంచలనం సృష్టిస్తాయో వేచి చూడాలి.

'స్పిరిట్' లో ప్రభాస్ ఇంట్రోపై భారీ హైప్.. వంగా కొత్త ప్లాన్ ఇదేనా?

: టాలీవుడ్ రెబల్ స్టార్ ప్రభాస్, సంచలన దర్శకుడు సందీప్ రెడ్డి వంగా కాంబినేషన్‌లో వస్తున్న 'స్పిరిట్' సినిమాపై అంచనాలు ఆకాశాన్ని తాకుతున్నాయి. పాన్-ఇండియా స్థాయిలో హైప్ వున్నా మూవీస్ స్పిరిట్ కూడా ఒకటి. ఇందులో ప్రభాస్ ఒక శక్తివంతమైన పోలీస్ ఆఫీసర్‌గా కనిపిస్తున్నారు. ముఖ్యంగా ఇందులో ఆయన పాత్రను ఎలా పరిచయం చేయబోతున్నారనే దానిపై రోజుకో ఆసక్తికరమైన వార్త బయటకు వస్తూ, అభిమానుల్లో క్యూరియాసిటీని రెట్టింపు చేస్తోంది. సెంట్రల్ జైల్లో అసలైన విధ్వంసం: తాజా సమాచారం ప్రకారం, 'స్పిరిట్' సినిమా ఒక సెంట్రల్ జైలు వాతావరణంలో ప్రారంభమవుతుందట. జైల్లో ఉన్నట్టుండి పెద్ద గందరగోళం చెలరేగడం, నేరస్థులు నియంత్రణ కోల్పోవడం, అక్కడున్న పోలీసులు కూడా ఆ పరిస్థితిని అదుపు చేయలేక చేతులెత్తేయడం వంటి సన్నివేశంతో కథ మొదలవుతుంది. ఇక ఈ రచ్చ జరుగుతున్న సమయంలోనే ప్రభాస్ క్యారెక్టర్ ఎంట్రీకి వేదిక సిద్ధమవుతుందని తెలుస్తోంది. భయంతో వణికించే పేరు: అయితే ఈ సీన్‌లో ప్రభాస్‌ను వెంటనే చూపించకుండా, అక్కడి నేరస్థుల భయం ద్వారా ఆయన పవర్‌ను చూపిస్తారట. ఆ పోలీస్ ఆఫీసర్ పేరు వినగానే ఖైదీల ముఖాల్లో స్పష్టమైన భయం కనిపిస్తుందట. ఇక ఎటువంటి డిజైన్డ్ ఫైట్స్ లేదా భారీ డైలాగులు లేకుండా, కేవలం ఆయన పేరుతోనే ఆ పాత్ర ఎంత ప్రమాదకరమైనదో దర్శకుడు సందీప్ వంగా చాలా పవర్‌ఫుల్‌గా ఎస్టాబ్లిష్ చేయబోతున్నారట. పాత హిందీ పాటతో వినూత్నంగా ఇంట్రో: ప్రభాస్ ఎంట్రీ ఎంతో సైలెంట్‌గా, సైకోటిక్ రేంజ్‌లో ఉండబోతోందని టాక్. ఖాకీ యూనిఫామ్‌లో ఉన్న ప్రభాస్ చాలా ప్రశాంతంగా, పాత హిందీ పాటలు వింటూ కేజువల్‌గా జైల్లోకి అడుగుపెడతారట. ఇక చుట్టూ ఉన్న నేరస్థులు భయంతో వణుకుతుంటే, ప్రభాస్ మాత్రం క్లాసిక్ సాంగ్ వింటూ కూల్‌గా కనిపించే ఈ కాంట్రాస్ట్ షాట్ సినిమాలోనే అతిపెద్ద హైలైట్‌గా నిలుస్తుందని అంటున్నారు.



మంత మరో స్టార్ కి నో చెప్పిందా?

టాలీవుడ్ - కోలీవుడ్ పరిశ్రమల్లో తనకంటూ ప్రత్యేకమైన స్థానాన్ని ఏర్పరచుకున్న స్టార్ హీరోయిన్ సమంత గురించి ప్రస్తుతం ఫిల్మ్ నగర్ సర్కిల్స్‌లో ఓ వార్త చర్చనీయాంశమవుతోంది. అగ్ర నిర్మాణ సంస్థ నిర్మిస్తున్న ఓ ప్రతిష్టాత్మక చిత్రంలో నటించే అవకాశాన్ని సామ్ సున్నితంగా తిరస్కరించినట్లు తెలుస్తోంది. టాలీవుడ్ కు చెందిన ఓ స్టార్ హీరో సరసన నటించాల్సిన ఈ భారీ ప్రాజెక్ట్‌కు సమంత నో చెప్పడం సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. హీరోల లిస్ట్‌లో ఎవరెవరు ఉన్నారంటే? విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం ఈ ప్రాజెక్ట్ ఇప్పుడే పట్టాలెక్కేది కాదని, సరిగ్గా ఏడాది తర్వాత ప్రారంభం కానున్నట్లు తెలుస్తోంది. సుదీర్ఘ కాలం పాటు సెట్స్‌లో ఉండాల్సిన ఈ ప్రాజెక్ట్ షెడ్యూల్స్ ... భవిష్యత్ ప్రణాళికలు తన ప్రస్తుత వ్యక్తిగత, వృత్తిపరమైన ఆలోచనలకు సరిపడకపోవడంతోనే సమంత ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ఈ భారీ బడ్జెట్ చిత్రానికి సామ్ డేట్స్ కేటాయించలేనని స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. గత కొంతకాలంగా సమంత సినిమాల ఎంపికలో ఆచితూచి వ్యవహరిస్తున్న సంగతి తెలిసిందే. గ్లామర్ పాత్రలకే పరిమితం కాకుండా నటనకు ఆస్కారం ఉన్న బలమైన పాత్రలను మాత్రమే ఎంచుకుంటున్నారు. అలాగే సమంత ఆరోగ్యం, మానసిక ప్రశాంతతకు ప్రాధాన్యతనిస్తూ ప్రాజెక్ట్‌లను అంగీకరిస్తున్నారు. ఏడాది తర్వాత ప్రారంభమయ్యే ఈ ప్రాజెక్ట్ కోసం ఇప్పుడే కమిట్ అయితే ఇతర ప్రణాళికలకు ఆటంకం ఏర్పడుతుందనే ఉద్దేశంతోనే సమంత ఈ ఆఫర్‌ను వదులుకుంటుంది అన్నది మరో వెర్షన్. మరోవైపు అగ్ర నిర్మాణ సంస్థ - స్టార్ హీరో సినిమా కావడంతో సమంత ఈ ఆఫర్‌ను తిరస్కరించడం పలువురిని ఆశ్చర్యానికి గురి చేస్తుంది. సాధారణంగా ఇలాంటి పెద్ద ప్రాజెక్ట్‌లను నటీనటులు వదులుకోవడానికి సాహసించరు. కానీ సమంత మాత్రం తాను తీసుకునే నిర్ణయాలపై ఎంతో స్పష్టతతో ఉంటానని మరోసారి నిరూపించారు. కథలో కొత్తదనం .. పాత్ర ప్రాధాన్యతను బట్టే అడుగులు వేస్తున్నారని ఈ ఘటన ద్వారా స్పష్టమవుతోంది. ప్రస్తుతం సమంత దృష్టిని వెబ్ సిరీస్‌లు, పాన్-ఇండియా ప్రాజెక్ట్‌లు , సొంత ప్రొడక్షన్ వెంచర్లపై ఎక్కువగా కేంద్రీకరిస్తున్నారు. సినిమాల ఎంపికలో సామ్ అనుసరిస్తున్న సెలెక్టివ్ అప్రోచ్ ఆమె కెరీర్‌ను మరింత భిన్నమైన మార్గంలో నడిపిస్తోంది. భారీ ఆఫర్లను సైతం వ్యక్తిగత ప్రాధాన్యతల కోసం పక్కన పెట్టే సమంత తెగింపు ఇండస్ట్రీలో ప్రత్యేక చర్చకు దారితీస్తోంది.



నాకు అండగా ఆ ఇద్దరు హీరోలు

తన కష్టకాలంలో ఇద్దరు హీరోలు అండగా నిలుస్తారన్న అనుపమ

బాధలో ఉన్నప్పుడు దుల్కర్ సల్మాన్ నుంచి మెసేజ్ వస్తుందని వెల్లడి

దుల్కర్ తర్వాత రామ్ పోతినేనిని ఎక్కువగా విశ్వసిస్తానని స్పష్టం

మాజీ ప్రేయుడి నుంచి ఎదుర్కొన్న మానసిక వేధింపుల గురించి ప్రస్తావన

దుల్కర్‌తో కలిసి గతంలో మలయాళ చిత్రంలో నటించిన అనుపమ

ప్రముఖ నటి అనుపమ పరమేశ్వరన్ తన సినీ జీవితంలో తనకు అండగా నిలిచే ఇద్దరు హీరోల గురించి ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన ఆమె, తాను మనసు బాగోలేనప్పుడు, కష్టకాలంలో ఉన్నప్పుడు తనను ఓదార్చే స్నేహితులు ఇండస్ట్రీలో ఉన్నారని తెలిపారు. వారిలో మలయాళ స్టార్ హీరో దుల్కర్ సల్మాన్, టాలీవుడ్ హీరో రామ్ పోతినేని ఉన్నారని వెల్లడించారు. తాను బాధలో ఉన్నప్పుడు గుర్తుకొచ్చే మొదటి పేరు దుల్కర్ సల్మాన్‌దేనని అనుపమ అన్నారు. "నేను ఎప్పుడు డల్‌గా ఉన్నా, దుల్కర్ నుంచి నాకు ఒక మెసేజ్ వస్తుంది. నేను బాధలో ఉన్న విషయం ఆయనకు ఎలా తెలుస్తుందో అని ఆశ్చర్యపోతాను. ఆయనతో కాసేపు మాట్లాడితే నా బాధ అంతా మాయమైపోతుంది" అని ఆమె వివరించారు. దుల్కర్ తర్వాత, తాను ఎక్కువగా విశ్వసించే మరో వ్యక్తి టాలీవుడ్ హీరో రామ్ అని అనుపమ తెలిపారు. వీరిద్దరితో ఉన్న స్నేహబంధం తనకెంతో విలువైందని ఆమె పేర్కొన్నారు. గతంలో అనుపమ, దుల్కర్ కలిసి మలయాళ చిత్రం 'జోమోంటే సువిశేషంగళ్'లో నటించిన విషయం తెలిసిందే. ఇదే సందర్భంగా, తన గత ప్రేమ సంబంధంలో ఎదుర్కొన్న మానసిక వేధింపుల (నార్సిసిస్టిక్ అబ్యూజ్) గురించి కూడా ఆమె ప్రస్తావించారు. అలాంటి వ్యక్తులు ఇతరులను ఎప్పుడూ తమ నియంత్రణలో ఉంచుకోవాలని ప్రయత్నిస్తారని, ఇది చాలా నిశ్శబ్దంగా జరిగే వేధింపు అని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.

RNI NO. APBIL/2013/50718 LOCAL GUIDE Bi-Lingual Daily Published From Rangareddy
లోకల్ గైడ్ ద్విభాషా దినపత్రిక

రక్తదానం చేసి మరో ముగ్గురి ప్రాణాలను కాపాడండి

రక్తదానం ప్రాణదానంతో సమానం: పెద్దపల్లి డీసీపీ భూక్య రామ్ రెడ్డి

పెద్దపల్లి జిల్లా అక్టోబర్ 30 (లోకల్ గైడ్) : రక్తదానం చేసి ఆపదలో ఉన్న మరో ముగ్గురి ప్రాణాలను కాపాడాలని పెద్దపల్లి డీసీపీ భూక్య రామ్ రెడ్డి అన్నారు.పోలీస్ అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా సుల్తానాబాద్ సర్కిల్ పోలీసుల ఆధ్వర్యంలో స్థానిక ఎస్ఆర్ గార్డెన్‌లో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన డీసీపీ భూక్య రామ్ రెడ్డి, ఏసీపీ గజ్జి కృష్ణ మాట్లాడుతూ అత్యవసర పరిస్థితుల్లో ఉన్నవారికి రక్తాన్ని అందించడం ద్వారా విలువైన ప్రాణాలను కాపాడవచ్చని తెలిపారు. రక్తదానం చేయడం వల్ల ఎలాంటి ఆరోగ్య సమస్యలు తలెత్తవు, దానం చేసిన రక్తం కొద్ది రోజుల్లోనే తిరిగి శరీరంలో ఉత్పత్తి అవుతుందని వివరించారు. రక్తదాన శిబిరాల్లో సాధారణంగా 250 నుంచి 300 మిల్లీలీటర్ల వరకు రక్తాన్ని సేకరించి అవసరమైన వారికి అందిస్తారని తెలిపారు. రానున్న రోజుల్లో సుల్తానాబాద్ సర్కిల్ పరిధిలో సుమారు 1,000 మంది రక్తదాతలను గుర్తించి రక్తదానానికి ప్రోత్సహించేలా సర్కిల్ పరిధిలోని ఎస్ఐలు ప్రత్యేక కృషి చేయాలని డీసీపీ సూచించారు.ఈ కార్యక్రమంలో సర్కిల్ ఇన్స్పెక్టర్ పొన్నమనేని రంజిత్ రావు, ఎస్ఐలు చంద్రకుమార్, మధుకర్, సుధాకర్, రెడ్‌క్రాస్ సొసైటీ, లయన్స్ క్లబ్ సభ్యులు, పోలీస్ సిబ్బంది, పెద్ద సంఖ్యలో యువకులు పాల్గొన్నారు.

దళిత, గిరిజన జర్నలిస్టులకు అన్యాయం జరిగితే ఊరుకోం

-తెలంగాణ ఎస్సీ, ఎస్టీ వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కాదెపు రు గంగన్న

లోకల్ గైడ్ (30కామారెడ్డి ప్రతినిధి) : తెలంగాణ రాష్ట్రంలో దళిత, గిరిజన జర్నలిస్టులపై దాడులు, అన్యాయాలు జరుగుతున్నాయని వాటిని తీవ్రంగా ఖండిస్తున్నానని, తమ దళిత, గిరిజన జర్నలిస్టులపై అన్యాయం జరిగితే ఊరుకోబోమని తెలంగాణ ఎస్సీ, ఎస్టీ వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కాదేపూరు గంగన్న హెచ్చరించారు. హైదరాబాద్ లోని పద్మిని హోటల్ లో జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ దళిత, గిరిజన జర్నలిస్టులపై జరుగుతున్న దాడులు, అన్యాయాలపై వివిధ రాజకీయ పార్టీల నాయకులు, అధికారులు ముఖ్యంగా పోలీసులు వెంటనే నిలిపివేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఇటీవల సిరిసిల్లకు చెందిన ఇద్దరు జర్నలిస్టులపై కేసీఆర్ పోలీసులు థర్డ్ డిగ్రీ ఉపయోగించడం దారుణమని ఈ విషయంలో బాధ్యులైన పోలీసులపై చర్యలు తీసుకోవాలని అన్నారు. వారిపై చర్యలు తీసుకునే వరకు ఊరుకునే ప్రసక్తేలేదన్నారు. అదేవిధంగా రాష్ట్ర వ్యాప్తంగా దళిత, గిరిజన జర్నలిస్టులను ఐక్యమత్యం చేస్తూ, జిల్లా కమిటీలు లేని అన్ని జిల్లాలలో జిల్లా కమిటీలను పూర్తి చేస్తున్నామన్నారు. అలాగే జిల్లా కమిటీల నిర్మాణం పూర్తయిన తరువాత త్వరలోనే రాష్ట్ర ద్వితీయ మహాసభలను నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం జర్నలిస్టులకు అందించే అక్రిడిటేషన్ జారీ విషయంలో రాష్ట్రంలోని అన్ని జిల్లాలలో దళిత, గిరిజన జర్నలిస్టులకు తీవ్ర అన్యాయం జరిగిందని, ఇంకా జరుగుతూనే ఉందని, దీనికి ప్రధాన కారణం దళిత, గిరిజన జర్నలిస్టులు అక్రిడిటేషన్ కమిటీలలో లేకపోవడమేనని అన్నారు. అర్హులైన దళిత, గిరిజన జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్లు, ఇండ్ల స్థలాలు అందించే వరకు తమ ఎస్సీ, ఎస్టీ వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ పోరాడుతూనే ఉంటుందని ఆయన అన్నారు. ఈ విషయంలో సమాచార మరియు పౌర సంబంధాల శాఖ కమిషనరేట్ కార్యాలయాన్ని ముట్టడి చేసినప్పటికి ప్రభుత్వం విధానంలో మార్పు లేదని విమర్శించారు. ప్రభుత్వ విధానం, రాష్ట్ర ముఖ్యమంత్రి పద్ధతి మార్చుకోకపోతే తమ తఢాఖా ఏంటో చూపిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వ్యవస్థాపక నాయకులు అరెల్లి మల్లేష్, రాష్ట్ర ఉపాధ్యక్షులు కుంటోళ్ల వెంకటస్వామి, తెడ్డు సాయిలు, చించు బాబు, సంయుక్త కార్యదర్శి ఆరోళ్ల పురుషోత్తం, ఆర్గనైజింగ్ కార్యదర్శి అరుణ్, ఉత్తర కమిటీ రాష్ట్ర చైర్మన్ సంతోష్, కో కన్వీనర్ సురేష్, నాయకులు వెంకన్న, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

సుల్తానాబాద్ లో అండర్ 17 వాలీబాల్ టోర్నమెంట్ ప్రారంభం

క్రీడాకారులకు అండగా రేవంతన్న సర్కార్

తెలంగాణ పబ్లిక్ స్కూల్ కు రూ.8 కోట్లు మంజూరు

సుల్తానాబాద్ కాలేజ్ గ్రౌండ్ ఆవరణలో త్వరలోనే తెలంగాణ పబ్లిక్ స్కూల్ ను ఏర్పాటు చేయడం జరుగుతుంది.రాష్ట్ర ప్రభుత్వ విప్, పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయ రమణారావుసుల్తానాబాద్ పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో 70వ్ ఎస్ జీ ఫ్ ఈస్టువిలే కరీంనగర్ జిల్లా వాలీబాల్ అండర్ 17 బాలురు, బాలికల టోర్నమెంట్ సి యూ ఎం సెలక్షన్స్ కార్యక్రమంలో ముఖ్యతిథిగా పాల్గొని ట్రాస్ వేసి వాలీబాల్ టోర్నమెంట్ ను ప్రారంభించి అనంతరం క్రీడాకారుల ఆటలను తిలకించిన ప్రభుత్వ విప్ పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు సుల్తానాబాద్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజ్ ఆవరణలో రూ.1.40 కోట్లతో నిర్మిస్తున్న హై స్కూల్ భవన తరగతి గదుల నిర్మాణాలను స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి పరిశీలించిన ప్రభుత్వ విప్ పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే విజయరమణ రావు మాట్లాడుతూ పెద్దపల్లి నియోజకవర్గానికి మంజూరైన తెలంగాణ పబ్లిక్ స్కూల్లో సుల్తానాబాద్ పట్టణంలో ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. జూన్ మాసంతం వరకు ఈ ప్రక్రియ పూర్తి అవుతుందని తెలిపారు. పట్టణంలోని పలు ప్రభుత్వ విద్యాసంస్థలకు విద్యాసంస్థలలో మౌలిక సదుపాయాల కల్పనకు, అదనపు గదుల నిర్మాణానికి రూ.3 కోట్లు వెచ్చించడం జరుగుతుందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యారంగం అభివృద్ధికి అనేక చర్యలు తీసుకుంటున్నారని, ఇందులో భాగంగానే మెరుగైన విద్య ప్రమాణాలతో సకల సౌకర్యాలతో ప్రతి నియోజకవర్గానికి ఒకటి చొప్పున తెలంగాణ పబ్లిక్ స్కూల్ లను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బిరుదు కృష్ణ, మార్కెట్ కమిటీ చైర్మన్ మినపాల ప్రకాష్ రావు, సింగిల్ విండో చైర్మన్లు శ్రీగిరి శ్రీనివాస్ , కౌన్సిలర్లు గాజుల రాజమల్లు, ఊట్ల వరప్రదీప్, అబ్బయ్య గౌడ్, గా దాసు రవి, వాలీబాల్ జిల్లా అధ్యక్షులు ముత్యాల రవీందర్, పిడిలు, పిఈటిలు, పలువురు అధికారులు ,ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు ధన నాయక్ దామోదర్ రావు, కుమార్ కిషోర్, రఫిక్, తిరుపతి,, కార్యకర్తలు క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

సింగిల్ విండో వరి కొనుగోలు కేంద్రం ప్రారంభం

నారాయణపేట అక్టోబర్ 30:నారాయణపేట : పిఎసిఎస్ ఆధ్వర్యంలో సింగారం సెంటర్ వరి కొనుగోలు కేంద్రాన్ని జిల్లా సహకార అధికారి ఆంజనేయులు శుక్రవారం ప్రారంభించారు. అసిస్టెంట్ రిజిస్టర్ మాట్లాడుతూ వరి ధాన్యం ఏ గ్రేడ్ కనీస మద్దతు ధర 2461 రూపాయలు బి గ్రేడ్ సాధారణ ధర 2441 రూపాయి గాను ప్రభుత్వ నిర్ణయించినట్టు తెలిపారు, దీనితోపాటు ఏడు రకాల సన్న రకాలకు 500 రూపాయలూ బోనస్ ఇస్తున్నట్టు తెలిపారు. బిపిటి 5204, ఆర్ఎన్ఆర్ 15048, హెచ్ఎంటి సోనా, జైశ్రీరామ్ సిగ్మెంట్, కేఎన్ ఎమ్ 1638, డబ్ల్యూ జి ఎల్ 44, కేఎన్ఎం 7715, వీటికి క్వింటాలుకు 500 రూపా యల బోనస్ ఇస్తున్నట్టు తెలిపారు. ఇట్టి కార్యక్రమానికి లావణ్య మానిటరింగ్ ఆఫీసర్ ,అసిస్టెంట్ రిజిస్టర్, శ్రీనివాస్ రెడ్డి సింగారం మాజీ సర్పంచ్ , లక్ష్మప్ప ఉపసర్పంచ్ సింగారం, రైతులు సెక్రటరీ అశోక్ కుమార్ సిబ్బంది పాల్గొన్నారు.

పోలీస్ అమరవీరుల స్ఫూర్తితో ప్రజాసేవ...

పోలీస్ స్టేషన్‌లో మెగా రక్తదాన శిబిరం,ఉచిత కంటి పరీక్షలు....

మంచిర్యాల జిల్లా ప్రతినిధి (లోకల్ గైడ్) : పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను పురస్కరించుకుని సమాజ రక్షణ కోసం ప్రాణాలర్పించిన పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటు వారి సేవా స్ఫూర్తిని కొనసాగించే లక్ష్యంతో రామగుండం పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు,మంచిర్యాల డీసీపీ,జైపూర్ ఏసీపీ పర్యవేక్షణలో చెన్నూరు రూరల్ సర్కిల్ పోలీసుల ఆధ్వర్యంలో కోటపల్లి పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం మెగా రక్తదాన శిబిరం,ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు.చెన్నూరు రూరల్ సర్కిల్ కార్యాలయం,కోటపల్లి పోలీస్ స్టేషన్ వేదికగా నిర్వహించిన ఈ సామాజిక సేవా కార్యక్రమానికి మంచిర్యాల డీసీపీ ఎ భాస్కర్,జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా పోలీస్ అమరవీరుల సేవలు,త్యాగాలను స్మరించుకుంటు అధికారులు వారి అంకితభావాన్ని కొనియాడారు.సమాజంలో శాంతిభద్రతలను కాపాడుతు ప్రజల ప్రాణాలు,ఆస్తుల రక్షణ కోసం విధి నిర్వహణలో ప్రాణాలను సైతం త్యాగం చేసిన పోలీస్ అమరవీరుల త్యాగాలు ఎప్పటికీ మరువలేనివని పేర్కొన్నారు.వారు చూపిన ధైర్యం,కర్తవ్యనిష్ఠ,సేవా స్ఫూర్తి ప్రతి పోలీస్ అధికారికి ఆదర్శమని తెలిపారు.అమరవీరుల ఆశయాలకు అనుగుణంగా ప్రజలకు సేవలందిస్తు,సమాజ శ్రేయస్సు కోసం నిరంతరం కృషి చేయడమే వారికి అందించే నిజమైన నివాళి అని పేర్కొన్నారు.

రక్తదానానికి యువత విశేష స్పందన..

మెగా రక్తదాన శిబిరానికి యువత, స్థానిక ప్రజల నుంచి విశేష స్పందన లభించింది.రక్తదానం ప్రాణదానంతో సమానమని,ప్రమాదాలు,అత్యవసర వైద్య పరిస్థితులు,శస్త్రచికిత్సలు,ఇతర అనారోగ్య సమస్యల సమయంలో రక్తం ఎంతోమంది ప్రాణాలను కాపాడుతుందని అధికారులు తెలిపారు.ప్రతి ఒక్కరు రక్తదానంపై అవగాహన పెంపొందించుకోవాలని,ఆరోగ్యపరంగా అర్హులైన వారు స్వచ్ఛందంగా రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు.పోలీసుల పిలుపుకు స్పందించిన యువకులు,స్థానిక ప్రజలు ఉత్సాహంగా రక్తదానం చేయగా,ఈ శిబిరంలో మొత్తం134యూనిట్ల రక్తాన్ని సేకరించడం విశేషం.అత్యవసర సమయాల్లో రక్తం అవసరమైన వారికి ఈ రక్తం ఉపయోగపడనుందని,రక్తదానం ద్వారా ప్రాణాలను కాపాడే మహత్తర కార్యక్రమంలో భాగస్వాములైన దాతలను అధికారులు అభినందించారు.అదేవిధంగా ప్రజల ఆరోగ్య పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని ఉచిత కంటి పరీక్షల శిబిరాన్ని నిర్వహించారు.ఈ శిబిరంలో సుమారు100మందికి కంటి పరీక్షలు నిర్వహించి,కంటి సమస్యలతో బాధపడుతున్న వారికి అవసరమైన వైద్య సలహాలు అందించారు.సాధారణంగా ఆరోగ్య పరీక్షల పట్ల నిర్లక్ష్యం వహించే ప్రజలకు ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలు ఎంతో ఉపయోగకరమని,సమయానికి కంటి పరీక్షలు చేయించుకోవడం ద్వారా కంటి సమస్యలను ముందుగానే గుర్తించి తగిన జాగ్రత్తలు తీసుకోవచ్చని అధికారులు పేర్కొన్నారు.పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను కేవలం సంస్మరణ కార్యక్రమాలకే పరిమితం చేయకుండా,ప్రజల అవసరాలకు అనుగుణంగా వివిధ సంక్షేమ,సామాజిక సేవా కార్యక్రమాలను చేపట్టడం ద్వారా పోలీస్ శాఖ ప్రజలకు మరింత చేరువ కావాలనే లక్ష్యంతో ముందుకు సాగుతోంది.ఈ కార్యక్రమాల్లో భాగంగా మహిళలకు చీరల పంపిణీ,గ్రామీణ ప్రాంత యువతలో క్రీడాస్ఫూర్తిని ప్రోత్సహించేందుకు వాలీబాల్ కిట్లు పంపిణీ కార్యక్రమాలను చేపట్టడంతో పాటు,చెన్నూరు రూరల్ సర్కిల్ పరిధిలోని డ్రైవర్లకు ఎలాంటి మధ్యవర్తుల ప్రమేయం లేకుండా ఉచితంగా డ్రైవింగ్ లైసెన్సులు పొందేలా ప్రత్యేక చొరవ తీసుకోవడం వంటి ప్రజా ఉపయోగ కార్యక్రమాలకు ప్రణాళిక రూపొందించారు.మహిళలకు అండగా నిలవడం,గ్రామీణ యువతను క్రీడల వైపు ప్రోత్సహించడం,డ్రైవర్లకు చట్టబద్ధమైన డ్రైవింగ్ లైసెన్సులు సులభంగా పొందేలా సహకరించడం వంటి చర్యలు సమాజంలోని వివిధ వర్గాల సంక్షేమానికి దోహదపడనున్నాయి.ముఖ్యంగా ఎలాంటి మధ్యవర్తుల ప్రమేయం లేకుండా డ్రైవింగ్ లైసెన్సుల కల్పనకు సహకరించాలనే పోలీసుల చొరవ పారదర్శకతకు,ప్రజలకు ఇబ్బందులు లేకుండా సేవలు అందించాలనే లక్ష్యానికి నిదర్శనంగా నిలుస్తుంది.సామాజిక బాధ్యతతో ప్రజలకు అండగా నిలుస్తు సమాజ శ్రేయస్సు కోసం నిరంతరం కృషి చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో చెన్నూరు రూరల్ సిఐ ఆర్ కృష్ణ,కోటపల్లి ఎస్సై రాజశేఖర్,నీల్వాయి ఎస్సై నాగరాజు,రెడ్‌క్రాస్ మంచిర్యాల జిల్లా జనరల్ సెక్రటరీ మహేందర్,తలసేమియా వెల్ఫేర్ సొసైటీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కాసర్ల రంజిత్ కుమార్,ఉత్తమ్,కోటపల్లి మండల సర్పంచులు, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు,పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యాసంస్థలు,ఆసుపత్రులలో సౌకర్యాల మెరుగుదలకు ప్రత్యేక చర్యలు

జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాల జిల్లా ప్రతినిధి (లోకల్ గైడ్) : జిల్లాలోని ప్రభుత్వ విద్యాసంస్థలు,ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు,ఇతర ప్రభుత్వ కార్యాలయాలను సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తు ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు.శుక్రవారం జిల్లాలోని దండేపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,జూనియర్ కళాశాలను మండల తహసిల్దార్ రోహిత్ దేశ్ పాండే,మండల పరిషత్ అభివృద్ధి అధికారి ప్రసాద్ లతో కలిసి సందర్శించి కళాశాల భవన నిర్మాణ పనులను పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతు అసంపూర్తిగా ఉన్న భవన నిర్మాణ పనులను టెండర్ ప్రక్రియ ద్వారా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకొని పనులను త్వరితగతిన పూర్తిచేసి జూనియర్ కళాశాలకు భవనాన్ని అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు.కళాశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు.జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి10వ తరగతి విద్యార్థులకు స్వయంగా గణిత పాఠ్యాంశాలను బోధించి,విద్యార్థుల అభ్యసన స్థాయిని పరిశీలించారు.అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి ఆసుపత్రిలోని వార్డులు,రిజిస్టర్లు,పడకలు,రోగులకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు.ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవాల సంఖ్య,ప్రైవేట్ ఆసుపత్రులలో ప్రసవాలు చేయించుకోవడానికి గల కారణాలను వైద్యులను అడిగి తెలుసుకున్నారు.ప్రభుత్వ ఆసుపత్రులలో మెరుగైన వైద్య సేవలు అందించి గర్భిణులు ప్రభుత్వ వైద్య సేవలను వినియోగించుకునేలా అవగాహన కల్పించాలని తెలిపారు.వైద్యులు,సిబ్బంది విధుల పట్ల సమయపాలన పాటిస్తు ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని,అవసరమైన మందులను అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు.మండల తహశీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి భూ భారతి,రెవెన్యూ సంబంధిత పెండింగ్ దరఖాస్తుల పరిష్కారంపై తహసిల్దార్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు.మండలంలో ఇందిరమ్మ ఇండ్ల పురోగతిపై మండల పరిషత్ అభివృద్ధి అధికారిని వివరాలు అడిగి నిర్మాణ పనులు వేగవంతం చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.జన్నారం మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలను సందర్శించి నిర్మాణంలో ఉన్న ప్రహరీ గోడ పనులను పరిశీలించి త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.పాఠశాలలో విద్యార్థుల హాజరు,విద్యార్థుల సంఖ్య,వారికి అందిస్తున్న సౌకర్యాలు,భోజన మెనూ అమలును పరిశీలించారు.విద్యార్థులకు నిర్ణీత మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు.కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి నిర్మాణంలో ఉన్న అదనపు గదుల పనులను పరిశీలించారు.పనులు దాదాపు పూర్తయ్యే దశలో ఉన్నందున మిగిలిన పనులను త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని తెలిపారు.విద్యార్థినులకు మెనూ ప్రకారం సకాలంలో పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందించాలని,విద్యార్థుల ఆరోగ్య పట్ల శ్రద్ధ వహించాలని తెలిపారు.నిర్మాణంలో ఉన్న భోజనశాల పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు.మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి వైద్య సేవలు,రోగులకు అందుతున్న చికిత్స,ఆసుపత్రి నిర్వహణను పరిశీలించారు.జిల్లాలో డెంగ్యూ కేసులు నమోదైన గ్రామాల వివరాలను సేకరించి,సంబంధిత ప్రాంతాలలో నీటి నమూనాలను పరీక్షించాలని వైద్యాధికారులను ఆదేశించారు.దోమల వృద్ధికి కారణమయ్యే నీటి నిల్వలను గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు.ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో వారానికొకసారి,కనీసం నెలకు ఒకసారి ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు.మండల తహసిల్దార్ కార్యాలయాన్ని సందర్శించి తహసిల్దార్ జి బక్కయ్య,మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఉమర్ షరీఫ్ లతో కలిసి భూ భారతి దరఖాస్తుల పరిష్కారం,పెండింగ్ రెవెన్యూ సమస్యలు అడిగి తెలుసుకున్నారు.మండల పరిషత్ అభివృద్ధి అధికారులతో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పురోగతి,వివిధ దశలలో ఉన్న ఇండ్ల వివరాలు,పారిశుధ్య కార్యక్రమాల అమలుపై సమీక్షించారు.ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులతో ఇండ్ల నిర్మాణానికి ప్రభుత్వం ఉచితంగా ఇసుకను అందిస్తుందని,ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని నిబంధనల ప్రకారం నిర్ణీత విస్తీర్ణంలో ఇండ్లు నిర్మించుకోవాలని తెలిపారు.

నేరడగంలో ఖేత్ బచావో అభియాన్ పై రైతులకు అవగాహన

నారాయణపేట అక్టోబర్ 30: మాగనూరు మండలం నేరాడుగాం గ్రామంలో ఖేత్ బచావో కార్యక్రమం పై రైతులకు అధికారులు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి సుద ర్శన్ గౌడ్ మాట్లాడుతూ వ్యవసాయ భూముల సారవంతాన్ని కాపాడుకోవ డం ప్రతి రైతు బాధ్యత అని తెలిపారు. అధిక రసాయన ఎరువుల వినియోగం తగ్గించి, సేంద్రియ ఎరువు లు మరియు పచ్చిరొట్ట ఎరువులను వినియోగించ డం ద్వారా నేల ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవాలని సూచించారు.నేలలో సేంద్రియ కర్బనం శాతం పెరగడం వల్ల నేలలో నీటిని నిల్వ చేసుకునే సామర్థ్యం పెరిగి, సూక్ష్మజీవుల వృద్ధికి అనుకూలమైన వాతావర ణం ఏర్పడుతుందని వివ రించారు. పశువుల ఎరు వు, కంపోస్టు, పచ్చిరొట్ట ఎరువుల వినియోగంతో నేలలో సేంద్రియ కర్బనాన్ని పెంచుకోవచ్చని తెలిపారు. అలాగే వరి కోత అనంతరం మిగిలిన పంట కొయ్యలను కాల్చడం వల్ల నేలలోని ఉపయోగకరమైన సూక్ష్మజీ వులు నశించడంతో పాటు సేంద్రియ పదార్థాలు, పోషకాలు తగ్గుతాయని, వాయు కాలుష్యం కూడా ఏర్పడుతుందని వివరించారు. పంట అవశేషాలను కాల్చకుండా భూమిలో కలి యదున్నడం లేదా కంపో స్టుగా మార్చి వినియోగించ డం ద్వారా భూసారాన్ని కాపాడుకోవచ్చని సూచిం చారు.పంటల మార్పిడిలో భాగంగా వరి తర్వాత శన గ, పెసర, మినుము వంటి పప్పుధాన్యాల పంటలను సాగు చేయడం ద్వారా నేల ఆరోగ్యంమెరుగుపడటంతో పాటు రైతులకు అదనపు ఆదాయం లభించే అవ కాశం ఉంటుందని తెలి పారు. పప్పుజాతి పంటల వేర్లపై ఉండే రైజోబియం బాక్టీరియావాతావరణంలోని నత్రజనిని స్థిరీకరించి నేల సారవంతాన్ని పెంచ డంలో సహాయపడు తుందని వివరించారు.ప్రకృతి వ్యవసాయ పద్ధతులైన జీవామృతం, ఘనజీవామృతం తయారీ మరియు వినియోగంపై రైతులకు అవగాహన కల్పించారు. స్థానికంగా లభించే సహజ వనరులను వినియోగించుకోవడం ద్వారా సాగు ఖర్చులను తగ్గించుకోవడంతో పాటు నేలలో జీవవైవిధ్యాన్ని పెంపొందించుకోవచ్చని సూచించారు.నేలను కాపా డితేనే భవిష్యత్ వ్యవసా యం సురక్షితంగా ఉంటుం ది. కాబట్టి ప్రతి రైతు పంట అవశేషాలను కాల్చకుండా, సేంద్రియ పదార్థాల విని యోగం పెంచుతూ, పంటల మార్పిడిని పాటిస్తూ సాగు భూమి సంరక్షణలో భాగ స్వామి కావాలని మండల వ్యవసాయ అధికారి పిలు పునిచ్చారు.ఈ కార్యక్రమం లో వ్యవసాయ విస్తరణ అధికారి అనిల్, గ్రామ సర్పంచ్, గ్రామ రైతులు పాల్గొన్నారు.

రాళ్లగుడుపల్లిలో వ్యక్తమవుతున్న సర్పంచ్ మహిపాల్ తీరుపై గ్రామస్తుల ఆగ్రహం



లోకల్ గైడ్,మోమిన్‌పేట/ వికారాబాద్ జిల్లా : మోమిన్‌పేట మండల పరిధిలోని రాళ్లగుడుపల్లి గ్రామంలో స్థానిక సర్పంచ్ మహిపాల్ వ్యవహారశైలిపై గ్రామ ప్రజలు తిరుగుబాటు బావుటా ఎగురవేస్తున్నారు. గ్రామంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.... మా గ్రామంలో ఎలాంటి అభివృద్ధి పనులు జరగకపోగా, ప్రజా సమస్యలను పట్టించుకోవడం లేదంటూ ప్రజలు మండిపడుతున్నారు. ముఖ్యంగా గ్రామసభ నిర్వహించకపోవడం, ప్రభుత్వ వనరుల దుర్వినియోగం, ఇష్టారాజ్యంగా వసూళ్లకు పాల్పడుతుండటంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ప్రధాన ఆరోపణలు మరియు సమస్యలు:

గ్రామసభలకు మంగళం : గ్రామ పంచాయతీ చట్టం ప్రకారం ప్రతినెలా లేదా నిబంధనల ప్రకారం నిర్వహించాల్సిన గ్రామసభలను సర్పంచ్ ఇప్పటివరకు నిర్వహించలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, ఖర్చు చేస్తున్న నిధుల వివరాలపై పారదర్శకత కరవైందని, ప్రజలను భాగస్వామ్యం చేయకుండా ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకుంటున్నారని వాపోతున్నారు. గ్రామ పంచాయతీ ట్రాక్టర్ వ్యక్తిగత వాడకం : గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణ కోసం, చెత్త సేకరణ కోసం ప్రభుత్వం కేటాయించిన ట్రాక్టర్‌ను ప్రజలకు ఉపయోగించకుండా, సర్పంచ్ మహిపాల్ తన ఇంటివద్దే నిలుపుకుంటున్నారని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చెత్త సేకరణ సక్రమంగా జరగక గ్రామంలో మురుగు పేరుకుపోతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నల్లా కనెక్షన్ల పేరుతో వసూళ్ల దందా : గ్రామాల్లో తాగునీటి సరఫరాను సులభతరం చేయడానికి ప్రభుత్వం నల్లా కనెక్షన్లను ఇస్తుంటే.. సర్పంచ్ మాత్రం వాటిని బిగించడానికి, కొత్త కనెక్షన్ల పేరుతో అమాయక ప్రజల నుంచి అక్రమంగా డబ్బులు డిమాండ్ చేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. డబ్బులు ఇస్తేనే కనెక్షన్ ఇస్తామంటూ పేదలను వేధిస్తున్నారని బాధితులు వాపోతున్నారు. గ్రామాభివృద్ధి రాళ్లగుడుపల్లిలో కనీస మౌలిక వసతులు కరువయ్యాయని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. మురుగునీటి పారుదల వ్యవస్థ అస్తవ్యస్తంగా మారడం, నీరు నిలిచిపోవడంతో దోమలు ఈగలు వ్యాప్తి చెంది విష రోగాలు వస్తాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అధికారులు స్పందించాలని డిమాండ్

గ్రామంలో నెలకొన్న ఈ సమస్యలపై ఉన్నతాధికారులు వెంటనే స్పందించి, సమగ్ర విచారణ జరపాలని రాళ్లగుడుపల్లి ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ప్రజాధనం దుర్వినియోగం కాకుండా, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న సర్పంచ్, ఉపసర్పంచ్ గ్రామ కార్యదర్శి తీరుపై తక్షణమే చర్యలు తీసుకోవాలని, వెంటనే గ్రామసభ నిర్వహించి లెక్కలు తేల్చాలని ప్రజలు కోరుతున్నారు.ఈ సమావేశంలో డి లక్ష్మయ్య, డి బిచ్చయ్య, ఎం అంజయ్య వార్డ్ నెంబర్ 3, ఎం ప్రతాప్, సర్దార్ నాయక్, గోపాల్ నాయక్, ఎం నరసయ్య, జగదీష్ నాయక్, మాజీ ఎంపిటిసి నర్సింలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

Edited, Printed, Published & Owned by CH.RAM REDDYPublished from CRR publications, D.No.1-144/1, Near Apple Hospital Mothinagar, Balanagar Mandal, Ranga Reddy Dist.Telangana State and printed atGayatri Printers, near Apple Hospital Mothinagar, Balanagar Mandal, Rangareddy Dist,Telangana state.RNI NO:APBIL/2013/50718 Editor CH.RAM REDDYEMAIL: Localguide9999@gmail.com eb:www.localguidenews.com,contact:8977761499